UNIVERSAL
LIBRARY
OU_204671
UNIVERSAL
LIBRARY

శ్రీః

# సరస పద్యకథాసంగ్రహము

భారతాదిగ్రంథములనుండి

శ్రీ పిఠాపురం రాజా వారి కాలేజి

యుపాధ్యాయులచేఁ గూర్పఁబడి

సర్వపాఠశాలోపయోగార్థము

టీకతో

[ రెండవ కూర్పు. ]

ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనివారిచే

ఆనంద ముద్రణాలయమున ముద్రింపఁబడి

ప్రకటింపఁబడినది.

MADRAS.

1918

*Copyright Registered.*

PRICE 8 ANNAS.] [వెల 8 అణాలు.]

శ్రీరస్తు.

# సరసపద్యకథాసంగ్రహము

సటీకము.

రెండవకూర్పు.

చెన్నపురి:
ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనివారిచే
ఆనందముద్రణాలయంబున ముద్రితమై
ప్రకటితము.

191[illegible]

*All Rights Reserved.*

[10 అణాలు.] [Price 10 Annas.

# విషయసూచిక.

## (సరసపద్యకథాసంగ్రహము.)

---


| విషయము. | | పుట. |
|---|---|---|
| 1. శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట (అచ్చతెనుఁగు రామాయణము). | | 1 |
| 2. లంకాదహనము | ,, | 6 |
| 3. శ్రీరామపట్టాభిషేకము | (భాగవతము) | 9 |
| 4. శ్రీకృష్ణుని దుడుకుతనములు | ,, | 15 |
| 5. శ్రీకృష్ణుఁడు గోపకులతో బంతిచల్దులుగుడువ వనమున కేఁగుట. | ,, | 17 |
| 6. గోపాలురు బాలకృష్ణునిఁగూడ చల్దులారగించుట | ,, | 19 |
| 7 ద్రౌపది కృష్ణునితోఁ దనభంగపాట్లు సెప్పుట | (మహాభారతము) | 21 |
| 8. శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట | ,, | 27 |
| 9. భీష్మ పరశురాముల యుద్ధము | ,, | 28 |
| 10. హంస కాకీయోపాఖ్యానము | ,, | 39 |
| 11. దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల వృత్తాంతము | ,, | 45 |
| 12. కపోతోపాఖ్యానము | ,, | 48 |
| 13. గృధ్రజంబుకోపాఖ్యానము | ,, | 55 |
| 14 చిరకారిచరిత్రము | ,, | 59 |
| 15. వసిష్ఠవిశ్వామిత్రసంవాదము (గౌరన హరిశ్చంద్రోపాఖ్యానము - ద్విపద) | | 64 |
| 16. వసంతవర్ణన | ,, | 72 |
| 17. ప్రసిద్ధపద్యములు | | 75 |
| టీక | | 83 |


---

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః.

# సరసపద్యకథాసంగ్రహము.

## ౧. శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట.

ఈ కథాభాగము కవిసార్వభౌముఁడని బిరుదుపొందిన కూచిమంచి తిమ్మకవి రచియించిన అచ్చ తెనుఁగు రామాయణమునుండి యెత్తఁబడినది. ఇతఁడు 1700 సం॥ర॥ ప్రాంతమున పిఠాపుర సంస్థానములోని కందరాడ అను గ్రామమున 'కుకరణముగ' నుండెను. ఈయన రుక్మిణీపరిణయము, సింహాచలమాహాత్మ్యము, నీలాసుందరీ పరిణయము, రాజశేఖర విలాసము, సర్పపురమహాత్మ్యము, రసికజనమనోభిరామము, లక్షణసారసంగ్రహము మొదలగు బహు గ్రంథములను రచియించెను.

తెనుఁగుభాషలోని శబ్దములను నాల్గుజాతులక్రింద విడఁదీయవచ్చును. అందు సంస్కృతభాషనుండి మార్పులేకయే తెలుఁగులో వాడుకొనఁబడు శబ్దములు తత్సమములను మొదటిజాతి. రెండవజాతితద్భవము; అనఁగా, సంస్కృతశబ్దమును పలుకుటలో కొన్ని అక్షరములు మాఱి శబ్దమువేఱురూపమును బొంది తెనుఁగున వాడఁబడినప్పుడు, ఈజాతిలోఁ జేరును. మూడవది దేశ్యము; అనఁగా తెనుఁగువారు ఆయా దేశములయందు వాడుకొనుచుండు మాటలు. నాల్గవది గ్రామ్యము అనఁగా మాటలాడునప్పుడు మాత్రమె ఉపయోగించు శబ్దములు శబ్దరూపములును. గ్రామ్యశబ్దములను కావ్యములందు వాడునట్టి యాచారములేదు. కావున అచ్చ తెనుఁగనఁగా తద్భవదేశ్యములకే కావ్యములందు వ్యవహారము.

ఈకథాభాగమందు శ్రీరామునికి తలిదండ్రులందలి వినయము, భక్తియును, సీతాదేవియొక్క పతివ్రతా ధర్మమును లక్ష్మణునియొక్క పవిత్రమైన సోదర భావమును, దేటపడుచున్నవి.

క. పినతల్లిఁ బోడగని, క
మ్మని పలుకుల నిట్టు లనియె, ƒ "మము నేఁగ నో
పినతల్లీ! నీడెందం
బున నిటువలె లాఁతితనము ƒ పూనఁగఁ, జనునే. 1

క. "ఓయమ్మ యిట్టు లఱమఱ
సేయంగా నేల, నీవు ƒ సెప్పినచెయ్వుల్
ద్రోయంగా నేర్తుమె; యిఁక
నీయానతిఁ గడవఁ బోము; ƒ నీయానసుమీ. 2

తే. "ఒనరఁ దలిదండ్రు లెలమితోఁ ƒ బనుపుదురఁట;
తోఁడబుట్టువు పుడమికి ƒ దొర యగునఁట;
పున్నియపునేల లొగిఁ గాంచఁ ƒ బోవుటయఁట;
మొలఁత! మఱి యింతకంటెను ƒ మేలు గలదె? 3

క. "తలఁపఁగ జగమునఁ గలవే
ల్పులు, సంగడికాండ్రుఁ, జుట్ట ƒ ములు, మఱి సెప్పం
గలవార లెందఱేనియుఁ,
దలిదండ్రుల కెన యొనర్పఁ ƒ దగుదురె యెందున్? 4

తే. "అట్లుగావున, నిపుడు మీ ƒ యాన బత్తి
దవిలి యొనరింతు" నని, యటఁ ƒ దరలి తనదు
తల్లికడ కేఁగి, యత్తెఱం ƒ గెల్లఁ దెల్పి,
యడుగులకు మ్రొక్కుటయు, నాతి ƒ యతనిఁ జూచి, 5

క. “ కటకట! బిడ్డఁడ! కోరిక
లటమట లై చనియె నిప్పు; డద్దిర! ‘తా నొ
క్కటి దలఁచిన దయ్యం బొ
క్కటి దలఁచు’నఁటన్నమాట కడు బెడఁ గగుచున్. 6

క. “పుడమిఁ దనకన్నకొడుకున
·కడుగుకొనియెఁ గాక కైక, యహహా! నినుం గా
అడవులకుఁ బనుపు మనుచుఁ
నుడువఁగ నెప్పగిదిఁ దనకు నోరాడెనొకో. 7

తే. “సవతితన మూని, యిట్టు లకయ్యవిద వలుక,
నటులె తానును డెందంబు దిటము పఱచు
కొని, యయో! నిన్నుఁ గానల కనుపుకొనఁగఁ,
దండ్రి యేచందమున నఱఁ దలఁచెఁ జెపుమ. 8

క. “అజ్జోటియు నొడయఁడు నీ
పజ్జం గనికరము మాలి పనిగొల్పినచో;
నిజ్జాడ మీకుఁ దగ దని
యొజ్జయుఁ బ్రెగ్గడలు నాడకుండిరె వారిన్? 9

క. “గడియయ యేఁ డగు మును నినుఁ
బొడగానక యుండు నెడలఁ; బొలుపరి నీ వి
ట్లెడవాసి దవ్వు చనుచోఁ,
గొడుకా! యిఁక నెట్లు తాళుకొనఁ గలఁ జెపుమా?”

తే. అనుచు నడలెడుతల్లి నూరార్చి, యంప
దొనలు విల్లును గయికొని చనఁ దలంచు
నెడల, నడ్డంబుగా వచ్చి పుడమికాన్పు
వలపుగులుకంగ మెల్లనఁ బలికె నపుడు. 11

తే. "మేలు గలవాఁడు మఱియుచు | మెసవనేర్చి,
గొడవ లోఁదవెదుతఱిఁ బోవ | విడువఁదగునె
తలఁప నుసుఱులరయొడయఁ డై | తనరుమగని
వెర వెఱింగిననాఁడెంపు | వెలఁదుకలకు? 12

ఆ. "మగనితోడ నెలమిఁ | దగిలి ముత్తయిదువ
పోణిమిని గరంబు | రాణఁ బొసఁగు
చున్ననాఁడె కాక, | యన్నుల కటమీఁద
నెన్నఁడైన నెమ్మి | యింత గలదె? 13

ఆ. "అట్టు లగుటఁ జేసి | యరగడియయుఁ దాళఁ
జాల నిన్నుఁ బాసి, | నేలఱేఁడ!
మాఱుమాట లుడిగి, | కాఱియఁ బెట్టక,
తోడుకొని కడంక | తోడఁ జనుము." 14

క. అనవుడు నబ్బల్లిదుఁ డా
ననఁబోఁడులమిన్నఁ జూచి, | నగి యిట్లనియెన్,
"వెనుఁగానలబడి చెలులకుఁ
జనఁ జనునే వెరవుమాలి, | చక్కెరబొమ్మా? 15

క. "నగువారి నెల్లఁ దలఁపక,
మగువా! మగవారివెంట | మచ్చికతో రాఁ
దగవా? పగవాఁడనె నిను
దిగనాడి చనంగ? లాఁతి | తెఱఁ గెన్నుదురే? 16

సీ. "చెలిమితో నాడంగ | జింకకూనలుగావు,
గద్దఱికొదమసిం | గములు గాని;
కులుకుచుఁ బలికింపఁ | జిలుకబారులు గావు,
దుగమొగంబులపుల్గు | తెగలు గాని;

వలపుతోఁ బెనుప జవ్వాదిపిల్లులు గావు,
బలితంపుఁబొగరు బెబ్బులులు గాని;
కయిసేయఁ బువ్వుఁదీవియపందిరులు గావు,
పొదలుజొంపపుఁగాఱు పొదలు గాని;
తే. గొండ్లి సలుపంగ నసుఁగుఁబూఁబోండ్లు గారు,
తులువపొలయోగిరపుఁబొలంతుకలు గాని;
గోల లెచ్చట, గాటంపుఁగోన లెచట;
వలవ దుడుగుము పయనంబు, తలిరుఁబోఁడి. 17
క. "వల నొదవని పని యగుటం,
బలికితి 'రావలవ'దనుచుఁ, బరికింపఁగ నో
యెలదీవెఁబోఁడి! నిన్నుం
గలలోపల నైనఁ బాయఁగలనే? చెపుమా." 18
క. అని యిట్టు లెన్ని సెప్పిన,
విననొల్లక, కలువకంటి వెగ టొదవఁగఁ బ
ల్కినఁ, దలఁకుచు వెంటం దో
డ్కొని చనుటకు నాతఁ డియ్యకొని యుండుటయున్. 19
తే. అత్తలకు మ్రొక్కి, వారల యానతిఁ గొని,
జానొదవఁ జెల్మిబోటులఁ జాలఁ గూర్మి
తోడఁ గవుఁగిటఁ బెనఁచి, యాతొడవుతొడవు
నెమ్మిఁ బెనిమిటిదరిఁ జేరి నిలుచునెడను. 20
క. లక్కుమనుఁడు సింగాణియు
నక్కజపుందొనలు పూని యరుదెంచి, కడున్
మ్రొక్కు లిడి, యున్న నాతని
మక్కువ కెదలోన నలరి, మఱి యప్పిదపన్, 21

తే. తమ్ముఁడును గేస్తురాలును దాను నగరు
వెడలి యమ్మేటి దమవీటి నడిమిత్రోవఁ
జనుచు నుండెడుచోఁ, గనుంగొనుచు నుండి
యెల్లవారలుఁ దమలోన నిట్టు లనిరి: 22

క. "ఇట్టినిగారపు గొనముల
తిట్టలఁ గనికరము మాని, తెం పొదవంగాఁ,
గట్టడవులకుం బనుపఁగఁ,
గట్టా! యమ్ముదుకఁ డెంత కట్టిఁడి చెపుమా! 23

క. "తడవేఁడు లయ్యెఁ, దనకుం
గొడుకులు లే రనుచు, ముందుఁ గుందుచు, నెన్నో
పడరానిపాట్లు వడి, యిపు
డడవులకుం ద్రోచుకొనుట యరుదై తోఁచున్. 24

క, "తప్పక యాఁడుది గోరినఁ,
మెప్పులకై వెడఁగుఁదనము మీఱఁగ, నిటు లీ
యొప్పులకుప్పల విడుచుట
ముప్పందటి? నితని కేమొ ముది మది దప్పెన్. 25

ఆ. "ఆలిమాటకొఱకు? బేలయై, కోడలిఁ
గొడుకుఁ బోవఁ ద్రోచుకొనియె, నితని
కేటిమగతనం బికసీ! కడుఁ గొద లేని
అట్టు వొందె, నింక అంతు లేల? 26

## ౨. లంకాదహనము.

ఈ భాగముకూడ వెనుకఁ జెప్పఁబడిన అచ్చతెనుఁగు రామాయణము నుండియే తీయఁబడినది."

తే. అనిన రాకాసిదొర బొమ ‡ లదరఁ, బండ్లు
గొఱుకుకొంచును, గన్నుల ‡ నెఱుపు మీఱ,
"వీని నిటు డాయఁ బిల్చినఁ, ‡ బూని వేయి
చందములఁ బ్రేలుచున్నాఁడు ‡ జంకు మాలి. 1

క. కావున నింకం గొంకక,
నీ వెడఁగుం గొమ్మ మెకము ‡ నిపు డడ లోదవం,
దావిమలచక్రరాయని
తావున కనుపుఁ డ"ని బంట్లఁ ‡ దగఁ బనికొలిపెన్. 2

తే. అత్తఱి విభీషణుఁడు డాసి, ‡ "యన్న! యిట్లు
తెగువతో రాచపను లూని ‡ తిరుగుబంటు
లేమియాడిన నాడుదు; ‡ రింతె కాని,
తప్పుగాఁ గొని చంపింపఁ ‡ దగదు సుమ్మి. 3

తే. "కాక యించుక కినుక లోఁ ‡ గలిగెనేని,
కొంత వెత పెట్టి విడుచుట ‡ గూడు న"నిన,
"నట్ల కాక"ని యొప్పున ‡ గ్గట్లనూడు
పగతుఁ డబ్బంట్లఁ గనుఁగొని ‡ నగుచుఁ బకెలి. 4

క. "ఈదుడుకుఁగోఁతిఁ గొని చని,
మీఁదిట్టతనంబు లెల్ల ‡ మెఱయఁగ, నిపు డౌఁ
గాదనక, తోఁకఁ గాలిచి,
వీదీ వీదులను ద్రిప్పి ‡ విడువుఁడు కడఁకన్." 5

తే. అనుడు, రక్కసు లతనిఁ దో ‡ డ్కొని తొలంగ
నేఁగి, మోకులు పగ్గము ‡ లెన్నియేని
గూర్చి బిగఁగట్టి, తద్దయు ‡ నార్చుకొనుచుఁ,
దప్పెటలు మ్రోయఁ బ్రోలెల్లఁ ‡ ద్రిప్పి మఱియు; 6

తే. పుట్టములు దిట్టలుగఁ గూడఁ బెట్టి, నేయి
నూనియల ముంచి, యవి తోఁకకైని జుట్టి,
నిప్పుకలు వెట్టి రవులింపఁ, గప్పుఁ దెరువు
జాణమంటలు వెదచల్లఁ జాఁగె మిగుల. 7

తే. అపుడు గొందఱు సోఁకుఁదొయ్యలులు దుక్కి-
చాలుపేరింటి రాచప్రో యాలికడకు
నేఁగి, యత్తెఱఁ గంతయు నెఱుఁగఁ జెప్ప,
నమ్మెలంతుక తద్దయు నుమ్మలించి. 8

క. “అక్కట ! యసురులవిం దగు
నిక్కోఁతులమిన్న కిప్పు డిట్టిదొసంగుల్
దెక్కలిదయ్యెం బింతయు
నక్కటికము లేక యిట్లు హత్తించె నొకో”. 9

తే. అనుచుఁ జేదోయి మోడ్చి, “యోయంటరాని
వేల్ప ! నీసంగడీఁ డగు విన్కచూలి
కనుఁగుఁగొడు కగుకోఁతిక న్నాకునందు
నుడుకు చూపక, చల్లనై యుండుమయ్య”. 10

ఆ. అనుచు వేఁడుకొనిన, హనుమంతునకుఁ గడు
నగ్గిచల్లనయ్యె; నాతఁ డంతఁ
గడఁకఁ బ్రాఁతమినుకు నుడువులు గొడఁగినఁ,
గడిఁది మీఱు బమ్మ కట్లు వీడె. 11

క. వీడినఁ దద్దయు నేత్తెఱ
తోడ్తమెయి వెంచి, తులువ తొలి వేలుపులం
గాడుపడఁ దఱిమి యార్చుచు,
గాడుపుచూలివ్వడు సొచ్చె గాటపుఁగినుకన్. 12

సీ. మేడలు రవళించి, । మాడువుల్ గాల్చి, వెఱ
రచ్చకొట్టంబులఁ । జిచ్చునించి,
చప్పరంబులు నూఁడి, । చవికలు మసి చేసి,
తత్తడినెలవులు । దగుల వైచి,
విడిముడిపట్టులు । వెలిమిడి గావించి,
మల్లెసాలలు బిట్టు । మండఁ జేసి,
లోనగళ్లెల్లఁ బె।ల్లుగ నగ్గి కెర చేసి,
నెఱిమించుసరకు ల।న్నియును మాడ్చి,
తే. గట్టువిలుకాఁడు దిగప్రోళ్లు । గాల్చు తెఱఁగు
దోఁప, రాకాసిపిండెల్ల । దుమ్ముచేసి,
కడలిఁ జిచ్చార్చుకొని, నేల । కాన్పుకడకు
మరలి, తనచందమంతయు । నరయఁ జెప్పి. 13

క. "ఇదె నీరాయనిఁ దెచ్చెద;
నెద నుమ్మలికంబు మాని । యెలనాఁగరో, నె
మ్మది నుండు మింక న" ని చే
యిదోయిన్ మొగిడిచి జోహారు । లిడి చనెనంతన్. 14

## 3. శ్రీరామపట్టాభిషేకము.

ఈ భాగము బమ్మెరపోతరాజు అను మహాకవి వ్రాసిన తెనుఁగు భాగవతములో రామాయణకథనుండి తీయఁబడినది. అచ్చతెనుఁగు రామాయణములో వలెఁగాక యిందు తత్సమశబ్దములు ధారాళముగ వాడఁబడినవి. తక్కినజాత శబ్దములకంటె నివియె మిగుల హెచ్చుగఁగన్పట్టును. ఈ శబ్దములతోఁ బొడవుగ సమాసములుకూడఁ గూర్పఁబడియున్నవి.

శ్రీరాముఁడు రావణునిఁజంపి సీతాలక్ష్మణులతోను, పరివారముతోను, గొప్ప యుత్సవముతో, అయోధ్యకుమరలివచ్చినప్పటి వైభవ మిందువర్ణింపఁబడినది.

కవియైన పోతరాజు క్రీ.శ. 1400 సం॥ర॥ ప్రాంతమువాఁడు. నివాసము కడపజిల్లాలోని ఒంటిమెట్ట (ఏకశిలానగరము) ఈతఁడు దైవభక్తి విశేషము కలవాఁడు. రాజుల నాశ్రయించుట కెంతమాత్రము నిష్టము లేనివాఁడు. ఈయన రచన బహురమ్యమై మధురమై చెవులకు విందుచేయుచుండును.

వ. ఇట్లు విభీషణసంస్థాపనుండై, రామచంద్రుండు సీతాలక్ష్మణ సమేతుండై, సుగ్రీవహనుమదాదులం గూడికొని, పుష్పకా రూఢుండై, వేల్పులు గురియుపువ్వుల సోనలం దడియుచుఁ దొల్లి వచ్చిన తెరువుజాడలు సీతకు నెఱింగించుచు, మరలి నందిగ్రామంబునకు వచ్చె; నయ్యవసరంబున. 1

ఆ. రామచంద్రవిభుని రాక వీనుల విని,
భరతుఁ డుత్సహించి పాదుకలను
మోచికొనుచు వచ్చి, ముదముతోఁ బురజను
లెల్లఁ గొలువ నన్న కెదురువచ్చె. 2

వ. వచ్చి, పాదుకల ముందట నిడికొని, యెడనెడసాష్టాంగదండ ప్రణామంబులుసేయుచు, మెల్లమెల్లనడాసి, రామచంద్రుని పాదంబులు దననొసలం గదియించి, తచ్చరణరేణువులు దుడిచి శిరంబునం జల్లికొని, తనివి సనక, మఱియు నప్పద కమలంబు లక్కునఁజెక్కున నొత్తికొనుచు, సంతసంపుఁ గన్నీటం గడిగి, సేమంబు లరయుచుండె; నంత సీతాలక్ష్మణ సహితుండై విభుండును, దన కెదురువచ్చిన బ్రాహ్మణజనం బులకు నమస్కరించి, తక్కినవారలచేత మన్ననలు వొంది, వారల మన్నించె; నయ్యవసరంబున. 3

చ. " నృపవర! పెక్కునాళ్ళఁగొలె,
నిగగన కుండినయట్టినేఁడు మా

తపములు పండె; నిందఱము
ధన్యుల మైతి మం'' టంచుం, బుట్టముల్
చపలతం ద్రిప్పి, పువ్వుల వ
సంతము లాడుచుం, బాడుచుం, గత
త్రపు లయి యాడుచుం, బ్రజలు
దద్దయుం బండుగు సేసి రెల్లెడన్. 4

సీ. కవ గూడి యిరుదెసం గపిరాజు రాక్షస
రాజు నొక్కటం జామరములు వీవ,
హనుమంతుం డతిధవళాతపత్రముం బట్టం,
బావాలు భరతుండు భక్తిం దేర,
శత్రుఘ్నుం డమ్ములుం జాపంబుం గొని రాంగ,
సౌమిత్రి భృత్యుండై చనవుసూప,
జలపాత్ర చేంబట్టి జనకజ గూడి రాం,
గాంచనఖడ్గ మంగదుండు మోవం,

ఆ. బసిండికేడె మర్థి భల్లూకపతి మోచి
కొలువం, బుష్పకంబు వెలయ నెక్కి,
గ్రహములెల్లం గొలువం గడు నొప్పుసంపూర్ణ
చంద్రుపగిది, రామచంద్రుం డొప్పె. 5

వ. ఇట్లు పుష్పకారూఢుం డై కపిబలంబులు సేరి కొలువ, శ్రీరాముం డయోధ్యకుం జనియె; నంతకు మున్న యప్పు రంబునందు, 6

సీ. వీథులు నున్నం గావించి, తోయంబులు
సల్లి, రంభాస్తంభచయము నిలిపి,

పట్టుఁజీరలు సుట్టి, ♦ బహుతోరణంబులుఁ
గలువడంబులు మేలు ♦ కట్లుఁ గట్టి,
వేదిక లలికించి, ♦ వివిధరత్నంబుల
ముగ్గులు పలుచంద ♦ ములుగఁ బెట్టి,
కలయ గోడల రామ ♦ కథ లెల్ల వ్రాయించి,
ప్రాసాదముల దేవ ♦ భవనములను

తే. గోపురంబుల బంగారు ♦ కుండ లెత్తి,
యెల్లవాకిండ్లఁ గానిక ♦ లేర్పరించి,
జనులు గై సేసి తూర్యఘో ♦ షములతోడ
నెదురునడతెంచి రాఘ ♦ వేంద్రుకడకు. 7

క. సమదగజదానధారల
దుమదుమ లై యున్న పెద్ద ♦ త్రోవలతోడన్
రమణీయ మయ్యె నప్పురి,
రమణుఁడు వచ్చిననె పొంగు ♦ రమణియపోలెన్. 8

ఆ. రామచంద్రవిభుని ♦ రాకఁ దూర్యములతో,
రథగజాశ్వసుభట ♦ రాజితోడ,
నమరెఁ బురము; చంద్రుఁ ♦ డరుదేర ఘూర్ణిల్లు
జంతుభంగమిళిత ♦ జలధిభంగి. 9

వ. ఇట్లొప్పుచున్న యప్పురంబు ప్రవేశించి, రాజమార్గంబున
రామచంద్రుం డరుగుచున్నసమయంబున. 10

మ. "ఇతఁడే రామనరేంద్రుఁ; డాయబలకా ♦ యింద్రారిఖండించెఁ; న
ల్లతఁడే లక్ష్మణుఁ; డాతఁడే కపివరుం; ♦ డా పొంతవాఁడే మరు
త్సుతుఁ; డాచెంగట నావిభీషణుఁడఁ"టం, ♦ చుం జేతులంజూపుచున్
సతులెల్లం బరికించి చూచిరి పురీ ♦ సౌధాగ్రభాగంబులన్

వ. ఇట్లు సమస్తజనంబులు చూచుచుండ రామచంద్రుండు
రాజమార్గంబునం జనిచని; 12

సీ. పటికంపుగోడలఁ ॥ బవడంపువాకిండ్ల
నీలంపుటరుఁగుల ॥ నెఱయ నొప్పి,
కమనీయవైడూర్య ॥ కస్తంభచయముల
మకరతోరణముల ॥ మహిత మగుచుఁ,
బడగల మాణిక్య ॥ బద్ధచేలంబులఁ
జిగురుదోరణములఁ ॥ జెలువు మీఱి,
పుష్పదామకముల ॥ భూరివాసనముల
బహుళతరధూపదీపముల మెఱసి,
తే. మాఱువేల్పులభంగిని ॥ మలయుచున్న
సతులఁ బురుషులు నెప్పుడు ॥ సందడింప,
గుఱుతు లిడరానిధనముల ॥ కుప్పలున్న
రాజసదనంబునకు వచ్చె ॥ రామవిభుఁడు. 13

వ. ఇట్లు వచ్చి, 14

ఉ. తల్లుల కెల్ల మ్రొక్కి, తమ ॥ తల్లికి వందన మాచరించి, య
ల్లలబుధాళికిఁ వినతుఁడై, చెలికాండ్రను దమ్ములం బ్రసం
ఫుల్లతఁ గౌఁగిలించుకొని, ॥ భూవరుఁడోలిఁ గృపారసంబు రం
జిల్లఁగఁ జాలమన్ననలు ॥ సేసెనమాత్యులఁ బూర్వభృత్యులన్.

వ. తత్సమయంబునఁ దల్లులు, 15

చ. కొడుకులుఁ బెద్దకోడలును
గొబ్బున మ్రొక్కిన, నెత్తి, చేతులం
బుడుకుచు, మోములుం దలలు
బోరన ముద్దులుగొంచు, నవ్వుచుం,

దొడలకు వారి రాఁ దిగిచి,
తోఁగఁగఁజేసిరి నేత్రధారలన్,
'వెడలినప్రాణముల్ దగఁ బ్ర
విష్టములయ్యెనఁ' టంచు నుబ్బుచున్. 17

వ. అంత వసిష్ఠుండరుగుదెంచి శ్రీరామచంద్రుని జటాబంధంబు విడిపించి, కులవృద్ధులుందానును సమంత్రకంబుగ, దేవేంద్రుని మంగళస్నానంబు సేయించుబృహస్పతిచందంబున, సముద్రనదీజలంబుల నభిషేకంబు సేయించె, రఘువరుండును సీతాసమేతుండై జలకంబు లాడి, మంచిపుట్టంబులు గట్టుకొని, కమ్మనిపువ్వులు దుఱిమి, సుగంధంబు లలందికొని, తొడవులు దొడిగికొని, తనకు భరతుండు సమర్పించిన రాజసింహాసనంబునం గూర్చుండి, యతని మన్నించి, కౌసల్యకుఁ బ్రియంబు సేయుచు, జగత్పూజ్యంబుగ రాజ్యంబు సేయు చుండె. అప్పుడు, 18

క. తండ్రిక్రియ, రామచంద్రుఁడు
తండ్రుల మఱపించి, ప్రజలఁ బ్రోదా రక్షింపం,
దండ్రుల నందఱు మఱచిరి;
"తండ్రిగదా రామచంద్ర ధరణిపుఁ డ"నుచున్. 19

ఆ. సిగ్గుపడుటగల్గి, సింగారమును గల్గి,
భక్తిగల్గి, చాల భయముఁ గలిగి,
నయముఁ బ్రియముఁ గల్గి, నరనాథు చిత్తంబు
సీత దనకు వశము సేసికొనియె. 20

## ౪. శ్రీకృష్ణునిదుడుకుతనములు.

ముద్దులు మూటగట్టు ఈ క్రిందిపద్యములు గూడ పోతన్నగారి భాగవతమునుండియె తీయఁబడినవి. ఇందు శ్రీకృష్ణుని చిన్ననాఁటి "కొంటె" తనములు చక్కనిస్వాభావికమైన వాడుక మాటలతో సొగసుగ వర్ణింపఁబడినవి.

క. బాలురకుఁ బాలు లే వని
బాలెంతలు మొఱలు వెట్టఁ, బకపక నగి, యీ
బాలుం డాలము సేయుచు,
నాలకుఁ గ్రేపులను విడిచె, నంభోజాక్షీ. 1

క. పడతీ! నీబిడ్డఁడు మా
కడవలలో నున్న మంచి కాఁగినపా లా
పడుచులకుఁ బోసి, చిక్కిన
కడవలఁ బో నడిచె; నాజ్ఞ గలదో లేదో? 2

క. మీపాపఁడు మాగృహముల
నాపోవఁగఁ బాలు ద్రావ నగపడకున్నం,
గోపించి పిన్నపడుచుల
వాపోవఁగఁ జిమ్ముకొనుచు వచ్చెం, దల్లీ. 3

మత్తకోకిలము.

పుట్టిపుట్టఁడు, నేఁడుదొంగిలఁ బోయి,మాయిలుసొచ్చి,తా
నుట్టియందక, ఱోళ్లుఁ బీఁటలు నొక్కప్రోవిడి యెక్కి, చే
పెట్టఁ జాలక, కుండక్రిం దొక పెద్దతూఁ టొనరించి, మీ
పట్టి మీఁగడ పాలు చేరలఁ బట్టి త్రావెఁ,దలోదరీ! 4

క. ఆడం జని, వీరల పెరుఁ
గోడక నీసుతుఁడు ద్రావి, యొకయించుక తాఁ

గోడలిమసాఁతిం దుడిచినఁ,
గోడలు మ్రుచ్చనుచు, నత్త గొట్టె లతాంగీ. 5

క. వారిల్లు సొచ్చి, కడవలఁ
దోరం బగు నెయ్యి ద్రావి, తుది నా కడవల్
వీరింట నీసుతుం డిడ,
వారికి వీరికిని దొడ్డవాదయ్యె సతీ. 6

క. వేలుపు లటె, నా కంటెను
వేలుపు మఱి యెవ్వరనుచు, వికవిక నగి, మా
వేలుపులగోడపై నో
హేలావతి ! నీతనూజుఁ డెంగిలిఁ జేసెన్. 7

ఆ. నమ్మి నిదుర వ్రొవ, నాపట్టిచుంచు మా
లేఁగతోఁకతోడ లీలఁ గట్టి,
వీథులందుఁ దోలె వెలఁది ! నీకొమరుండు,
రాచబిడ్డఁ డైన నవ్వ మేలె.? 8

క. నాపట్టిపొట్ట నిండఁగఁ
బై పడి నీపట్టి వెన్న బానెం డిడినాఁ
డూపిరి వెడలదు, వానిం
జూఁపెద, నేమైన నీవ చుమ్ము, లతాంగీ. 9

సీ. కలకంఠి! మావాడ గరితల మెల్ల నీ
పట్టి రాఁ గలఁ డని, పాలు పెరుఁగు
లిండ్లలోపల నిడి, యే మెల్లఁ దన త్రోవఁ
జూచుచో, నెప్పుడు సొచ్చినాఁడొ,
తలుపులిముద్రలుఁ దాళంబులును బెట్టి
యున్నచందంబున నున్న వరయ,

నొకయింటిలో నాడు, నొకయింటిలోఁ బాడు,
నొకయింటిలో నవ్వు, నొకటఁ దిట్టు,
ఆ. నొకట వెక్కిరించు, నొక్కొకచో మృగ
పక్షిఘోషణములు పరఁగఁ జేయు,
నిట్లు సేసి, వెనుక నెక్కడఁ బోవునో,
కానరాఁడు; రిత్త కడవ లుండు. 10
క. కడులచ్చి గలిగె నేనిం,
గుడుతురు గట్టుదురు గాక, కొడుకుల నగుచుఁ
బడుగులవాడలపైఁ బడ
విడుతురె రాకాంత లెందు, విమ లేందుముఖీ? 11
క. ఓయమ్మ! నీకుమారుఁడు
మాయిండ్లను బాలుఁ బెరుఁగు మననీఁ డమ్మా!
పోయెద మెక్కడి కైనను,
మాయన్నల సురభులాన, మంజులవాణీ. 12

### శ్రీకృష్ణుఁడు గోపకులతో బంతి చల్దులుగుడువ వనమున కేఁగుట.

ఇదియును దీని తరువాతివియును పోతన్నగారి భాగవతములోనివియె. దీనియందు కపట మెఱుఁగని నిర్మలస్వభావము గల గొల్లలు తమచెలికాఁడైన శ్రీకృష్ణునితో స్వేచ్ఛగ నిండువేడుకతో వనమందు చల్దు లారగించిన వృత్తాంతము మిక్కిలి రమ్యముగా వర్ణింపఁబడినది.

వ. అంత నొక్కనాఁడు రామకృష్ణులు గాంతారంబున బంతి చలుదులు గుడువ నుద్యోగించి, ప్రొద్దున లేచి, గ్రద్దనం దమ యింటి లేఁగకదుపులఁ గదలించి, సురంగంబు లగుశృంగంబులు పూరించిన, విని మేలుకని, సంరంభంబున గోపడింభ

కులు చలిదికావడులు మూఁపుల వహించి, సజ్జంబు లగు కజ్జంబులు గట్టికొని, పదత్రాణవేత్రదండధరు లై, లెక్కలకు వెక్కసం బైన తమతమ క్రేపుకదుపులం జప్పుడించి రొప్పుకొనుచుఁ, గాననంబు సొచ్చి, కాంచనమణిపుంజగుంజాది భూషణభూషితు లయ్యును, ఫలకుసుమకోరక పల్లవవల్లరులు దొడవులుగా నిడికొని, కొమ్ము లిమ్ముగ మ్రోయించుచు, వేణువులు పూరించుచుఁ, దుమ్మెదలం గూడిపాడుచు, మయూరంబులతోడం గూడి యాడుచుఁ, బికంబులంగలసి కూయుచు, శుకంబులఁ జేరి రొదలుసేయుచుఁ, బులుఁగులనీడలం బాఱుచుఁ, బొదరిండ్లం దూఱుచు,నరాళంబు లగువాఁగులు గడచుచు, మరాళంబులచెంత నడచుచు, బకమ్ములం గని నిలుచుచు, సారసంబులం జోపి యలఁచుచు, నదీజలంబులం దోఁగుచుఁ, దీవయుయ్యేలల నూఁగుచుఁ, బల్లంబులన్ డాఁగుచు, దూరంబుల కేఁగుచుఁ, గపులసంగడిఁ దరువు లెక్కుచు, ఫలంబుల మెక్కుచు, రసంబులకుఁ జొక్కుచు, నింగికి నిక్కుచు, నీడలు సూచి నవ్వుచుఁ, గయ్యంబులకుం గాలు ద్రవ్వుచుఁ, జెలంగుచు,మెలంగుచు,వ్రాలుచు,సోలుచు,బహు ప్రకారంబుల శరీరవికారంబులు సేయుచు, మఱియును. 1

క. ఒక నొకని చల్దికావడి
నొకఁడొకఁ డడకించి దాఁచు,నొకఁడొకఁ డది వే
ఱొకనొకని మొఱఁగికొని చన,
నొకఁడొకఁ డది దెచ్చియిచ్చు, నుర్వీనాథా. 2

క. ఒక్కఁడు ము న్నేమఱి చన,
నొక్కఁడు బలుకొబ్బ వెట్టు నులికిపడన్; వే

ఒక్కఁడు మిట్టి తటాలున
నొక్కనికనుదోయి మూయు, నొక్కఁడు నగఁగన్. 3

క. తీపు గలకజ్జ మన్యుఁడు
గోపింపఁగ నొడిసి పుచ్చుకొని పో, వాఁడుం
బైపడి యడుగఁగ, నొక్కఁడు
క్రేపులలో నిట్టు నట్టుఁ గిసురించు, నృపా. 4

క. వనజాక్షుఁడు మున్నరిగిన,
'మును పడ నే నేన యతనిముట్టెద' ననుచుం
జని, మును ముట్టనివానిన్
మును ముట్టినవాఁడు నవ్వ మొనసి, నరేంద్రా.

వ. ఇవ్విధంబున. 6

ఉ. ఎన్నఁడునైన యోగివిభులెవ్వనిపాదపరాగ మింతయుం
గన్నులఁ గాన, రట్టిహరిఁ గాఁగిటఁ జేర్చుచుఁ, జెట్టఁబట్టుచుం,
దన్నుచుఁ గుద్దుచున్, నగుచుఁ, దద్దయుఁ బైఁబడికూడియాడుచున్
మన్నన సేయువల్లవకుమారులభాగ్యము లింత యొప్పునే.

౬. గోపాలురు బాలకృష్ణునిఁగూడి చల్దు లారగించుట.

వ. కని,తమ్మికంటి తమ్ములయింటి సొబగునకు నిచ్చ మెచ్చుచుఁ,
జెచ్చెర గాలి నోలింగదలెడు కరళ్ల తుంపురుల జల్లు వెల్లున
నొడళ్లు గగురుపొడువఁ, గొలంకుల కెలంకులఁ గాయపండుల
గెలలఁ ద్రేఁగున వీఁగి పట్టు గలచెట్టుఁదుటుమునీడల నొప్పు
చున్న యిసుకతిప్పలవిప్పు సూచి, వేడుక పిచ్చలింప, నెచ్చె
లుల కిట్లనియె. 1

శా. ఎండన్ మ్రగ్గితి, రాఁకటం బడితి, రిం కేలా విలంబింపఁగా,
రండో బాలకులార! చల్ది గుడువన్, రమ్యస్థలం బిక్కడీ

దండన్ లేఁగలు నీరుద్రావియిరవంఽదం బచ్చికల్ మేయుచుం
దండంబై విహరించు చుండఁగ, సమంఽదప్రీతి భక్షింతమే.

వ. అనిన సగుఁ గాక యని, వత్సంబుల నుత్సాహంబున నిర్మ
లంబు లగుజలంబులు ద్రావించి, పచ్చికల మొల్లంబులు
గలపల్లంబుల నిలిపి, చొక్కంబు లగుచల్దుల చిక్కంబుల
సక్కడించి, 3.

మ. జలజాంత స్థితకర్ణికం దిరిగి రా
సంఘంబులై యున్నచో
కులచందంబునఁ, గృష్ణునిం దిరిగి రాఁ
గూర్చుండి వీక్షించుచున్,
శిలలుం బల్లవముల్ దృణంబులు లతల్
చిక్కంబులుం బువ్వులా
కులు కంచంబులు గా భుజించి రచటన్
గోపార్భకుల్, భూవరా. 4

సీ. మాటిమాటికి వ్రేలుఽమడిచి యూరించుచు
నూరుఁగాయలు దినుఽచుండు నొక్కఁ;
డొకనికంచములోని ఽ దొడిసి చయ్యన మ్రింగి
చూడు లేదని నోరుఽసూపు నొక్కఁ ;
డేగు రార్గుర చల్దుఽలెలమిఁ బన్నిద మాడి
కూర్కొని కూర్కొని ఽ కుడుచు నొక్కఁ ;
డిన్నియుఁ దగఁబంచి ఽ యిడుట నెచ్చెలితన
మనుచు బంతెనగుండు ఽ లాడు నొకఁడు;

ఆ. కృష్ణుఁ జూడు మనుచుఁ ఽ గికురించి, పరు మ్రోల
మేటిభక్ష్యరాశి ఽ మెసఁగు నొకఁడు;

నవ్వు నొకఁడు; సఖుల నవ్వించు నొక్కఁడు;
ముచ్చటాడు నొకఁడు; మురియు నొకఁడు. 5

సీ. కడుపున దిండుగాఁ గట్టినవలువలో
లాలితవంశనాళంబుఁ జొనిపి,
విమలశృంగంబును వేత్రదండంబును
జాఱి రానీక డాచంక నిఱికి,
మీఁగడ పెరుఁగున మేళవించినచల్ది
ముద్ద డాపలిచేత మొనయ నునిచి,
చెలరేఁగి కొసరి తెచ్చిన యూరుఁగాయలు
వ్రేళ్లసందులనెల్ల వెలయ నిఱికి,
ఆ. సంగడీలనడుమఁ జక్కనఁ గూర్చుండి,
నర్మభాషణముల నగవు నెఱపి,
యాగభోక్త కృష్ణుఁ డమరులు వెఱఁగంద,
శైశవంబు మెఱసి చల్దిగుడిచె. 6

## ౭. ద్రౌపది కృష్ణునితోఁ దన భంగపాట్లు సెప్పుట.

ఇదియును దీని తరువాతిదియును మిక్కిలి ప్రసిద్ధమైన మహాభారతము లోనివి. మహాపతివ్రతయగు ద్రౌపది కౌరవులు తనకుఁ జేసిన యవమానములను దలఁచుకొని తన దుఃఖములను శ్రీకృష్ణునకుఁ జెప్పుకొని యేడ్వఁగా నాయన యామెదుఃఖమును బోఁగొట్టుమాటలను జెప్పి, యోదార్చెను.

భారతము 18 పర్వములను భాగములు గల గొప్ప యితిహాసము (పురాణ మువంటిది). వేదవ్యాసముని దీనిని మొదట సంస్కృతమున వ్రాసెను. తరువాత చాలఁగాలమునకు నిది తెనుఁగున వ్రాయఁబడెను. భారతమును ముగ్గురు కవులు తెనిఁగించిరి. అందు మొదటి వాఁడు వాగనుశాసనుఁడను బిరుదము గలిగిన నన్నయభట్టు. ఈయన వేఁగియను దేశమునఁ మొదట కృష్ణాగోదావరుల మధ్యభాగమై, తుదకు

చాలవిస్తీర్ణమై యుండెడిరాజ్యమును) పరిపాలించు రాజరాజ నరేంద్రుని యాస్థానపండితుఁడు. క్రీ. శ 1000 సం॥రము ప్రాంతమువాఁడు.

భారతకవులలో రెండవవాఁడు తిక్కన సోమయాజి, నెల్లూరిలో మనుమ సిద్ధియనురాజునాస్థానమున నుండెడివాఁడు. క్రీ॥శ॥1250 ప్రాంతమువాఁడని కొందఱు నిర్ణయించిరి. ఈయన భారతములోఁ దుదివగు 15 పర్వములను రచియించెను.

కవిత్రయములో మూఁడవవాఁడు ఎఱ్ఱాప్రగడ. ఇంటిపేరుఏర్చూరివారు. నెల్లూరి మండలములోని కందుకూరితాలూకాలోని గుడ్లూరు కాఁపురము. భారతములోనరణ్యపర్వములోఁగొఱఁతిపడియున్న భాగమును బూర్తిచేసెను. క్రీ॥ శ॥ 1350 సం॥ర ప్రాంతమువాఁడు.

తే. ధర్మనందనుపలుకులు శ్రీ దనకు హృదయ
తాప మొనరింప, మోమున శ్రీ దైన్యమొంద,
నున్న పాంచాలి యిట్లని శ్రీ యొయ్యఁ బలికెఁ
గనలి శౌరితో, గద్గదకంఠి యగుచు. 1

ఉ. "అంతలు సేసి పోనడిచి,
యక్కట సంజయుచేతఁ జెప్పిపు
త్తెంతురె యిట్టియూఱట? మ
దింద్రియమందె యుధిష్ఠిరుండు; దా
నంతన యూళ్లు లేవురకు
నైదు సుయోధనుఁ డిచ్చునో? యీ
కంతకృపావిహీనమతి
నాతఁడు నేఁచునె యన్నదమ్ములన్? 2

చ. తనమును పడ్డ బన్నములఁ
దమ్మునిపైఁ గలకూర్మి పేర్మినీ
జనపతి సైఁప కున్నెయది?

సక్కన రాజ్యముపాలు లేక తీ
ఱున కొడఁబాటు గల్గిన, నె
ఱుంగమి వెట్టరె? చాల వైరి పీ
రనరొకొ? నాన లేమి యని
యాడరె లోకమువారు? కేశవా. 3

శా. వెం పేదం దమ కిట్టితక్కువలు రూ
పింపంగ నేలా? విచా
రింపక వారిక మేలు సంధి; దము వా
రిం జూచినం, దారు సా
ధింపఁ జాలరొ? కాక పోరఁ దగ మ
ర్దింపం దలంపేని శం
కింపం బట్టొకొ? వారు బ్రాహ్మణులె యే
కీడైన సైరింపఁగన్? 4

ఉ. ఓటమియొకింత యేనియు సు
యోధను చిత్తమునందు లేదు; నీ
మాటలఁ బోవు నే, దురభి
మానము మెక్కుడు పూనుఁగాక? య
చ్చోటన సంగరంబు లగు
చొప్పులు పుట్టిననైనఁ, బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ?
పోదురొ కానలనుండ, నచ్యుతా? 5

ఉ. ఏ నిటు లంటి నా వలవ;
దింకను నీవును రాజుఁ దమ్ములుం
గా నుచితంబు సూచి, మన

కార్యము మీనుజసత్త్వముం జెడం
గా నొకభంగి సేయక, త
గం గురువర్గముతోడిసంధి మీ
కైన తెఱంగునన్ వలచి
నట్టుల చేయుఁడు నేర్పు తేర్పడన్." 6

వ. అని మఱియు నిట్లనియె. 7

ఉ. "ఆఱడిఁ బోకయున్ ఫలము
నందుటయుం గని పల్కనేరమిన్,
మాఱటనోరిదాన నయి
మాటలు చిత్తమునందు నిల్పకేఁ
గాఱులు ప్రేలెదన్, వినుఁడు;
కర్జము నెగ్గును గాన నల్కమై;
వీఱిఁడి యైనమానిసికి
వెండి వివేకము గల్గ నేర్చునే? 8

చ. "వరమునఁ బుట్టితిన్, భరత
వంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ
వరునకుఁ గోడలైతి, జన
వంద్యులఁ బొందితి, నీతివిక్రమ
స్థిరు లగుపుత్రులం బడసి
తిన్, సహజన్ములప్రాపు గాంచితిన్,
సరసిజనాభ! యిన్నిటఁ బ్ర
శస్తికి నెక్కినదాన నెంతయున్. 9

వ. "అట్లుం గాక.

ఉ. "నీవు సుభద్రకంటెఁ గడు నెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయు; దిట్టిననుఁ బంకజనాభ! యొకండు రాజసూ
యావభృథంబునందు శుచినై పెను పొందిన వేణి వట్టి, యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చెఁ! గులాంగన నిట్లొనర్తురే?

ఉ. "ఆసభ కేకవస్త్ర యగు
నట్టిననుం గొని వచ్చి నొంచుచు
శ్వాసనుఁ జూచుచుం, బతుల
సంభ్రమములై తగుచేష్ట లేక నా
యాసలు మాని, చిత్రముల
యాకృతి నున్నయెడన్, ముకుంద! వి
శ్వాసముతోడ నిన్ గొలుచు
వచ్చె మనం; బదియుం దలంపవే. 12

చ. "అరయమిఁ జేసి, కోడలన
కప్పుడు దాసిగఁ జేసె; నమ్మహా
పురుషునిపాలికిం బతులు
ప్రోవఁగ, వీరలతోన యేను జె
చ్చెరఁ జని, కోటరంబు దగఁ
జేయుదునో, యటు గాకపాడిమై
పరవుడ మోపి చేయుదునొ
వారికి, మాధవ! నిశ్చయింపుమా." 13

వ. అని యట్లుగ్గడించి. 14

ఉ. ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి, వెండ్రుకల్
దా వలచేతఁ బూని, యసితచ్ఛవిఁ బొల్చుమహాభుజంగమో

నా విలసిల్లి వ్రేలఁ, గమనంబునఁబొంగు విషాదరోషముల్
గావఁగ లేక, బాష్పములు గ్రమ్మఁగ, దిగ్గన లేచి, యార్తయై,

వ. గోవిందుముందటం బెట్టి యిట్లనియె. 16

క. "ఇవి దుస్ససేను వ్రేళ్లం
దవిలి, సగము ద్రెవ్వి పోయి దక్కినయవి; కౌ
రవులకడఁ దీఱుమాటల
యవసరమునఁ దలఁపవలయు నచ్యుత ! వీనిన్. 17

సీ. "ఈ వెంట్రుకలు పట్టి యీడ్చినయాచేయి
దొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింతలింతలు తునియలై, చెదరి, రూ
పఱి యున్నఁగని, యుడుకాఱుఁగాక,
యలుపాలఁ బొనుపడు నట్టిచిచ్చే యిది ?
పెనుగద పట్టిన భీమసేను
బాహుబలంబును, బాటించి గాండీవ
మనునొకవి ల్లెప్పుడును వహించు

ఆ. కత్త్రివిక్రమంబుఁ, గాల్పనే, యిట్లు బ
న్నములు వడినధర్మ నందనుండు,
నేను రాజరాజు పీనుంగుఁ గన్నారఁ
గానఁబడయ మైతి మేని ? కృష్ణ! 18

ఆ. నెట్టన యిట్టియల్క మది నిల్పితి రక్కసతాల్మిఁ, జిచ్చొడిం
గట్టినయట్లు, పెద్దయును గాలము; దీనికి నాఱు నెన్నఁడుః
బుట్టము, దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టితోఁ
బుట్టువు నీవుఁ, దేజమునఁ బొల్చినభర్తలుఁ గల్గనచ్యుతా."

వ. అనుచు నెలుంగు రాలుపడ నేడ్చిన యాజ్ఞసెనిం గృపా
యత్తచిత్తుం డయి నారాయణుం డూరార్చి, కూర్చుండ
నియమించి, కన్నీరుదుడువను, బెన్నెఱివేణి ముడువనుందగు
వారి నియోగించి, యన్మానినితో నిట్లనియె. 20

౮. శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట.

ఉ. "ప్రముచ్చిర నేల యేఁ గలుగ, సముద్దియ? నాకువృకోదరుండువి
వ్వచ్చుఁడుఁదోడుగాఁగ, జనవంద్యుఁడుధర్మసుతుండుపంప, నీ
మెచ్చుగ శత్రుసంక్షయము మేకొని చేసెదఁగాక, వేఱొకం
డచ్చుపడంగ నేర్చునె? దురాత్ములు కౌరవు లుర్వియిత్తురే?

క. లలనా యుఁడుగుము; నీయే
డ్పులకోలఁదియె కురునృపాల పుత్రకళత్రం
బులయేడ్పు; లింక వానిం
గలకల నవ్వుచు వినంగఁ గాలంబయ్యెన్. 2

క. యమమహిషఘంటికానా
దము వినఁ గౌతూహలంబు దళుకొత్తెడు చి
త్తములు గల కౌరవుల కి
ష్టము లగునే సంధికార్య శాంతవచనముల్? 3

క. మొదల విధినియతియును న
ట్టిద యందురు పెద్ద; లది ఘటింపక పో; దే
మదిఁ జూచి చెప్పినను ద
ప్పదు, మేరువు దిరిగనేని, పాంచాలసుతా. 4

తే. పూని పలికెద వినుము; రిపుక్షయంబుఁ
జేసి, యుజ్జ్వలపుణ్య లక్ష్మీసమేతు

లైన పాండుకుమారుల । యధికవిభవ
మీావు సూచెదు; తడవు లే । దిది నిజంబు." 5

## ౮. భీష్మ పరశురాముల యుద్ధము.

ఇదియును మహాభారతము లోనిదియె. భీష్ముఁడు పరశురాముని శిష్యుఁడు. అయినను వీరలకు నొకవిషయమై పట్టుదల కలిగెను. ఎట్లనఁగా- కాశీరాజు తన ముగ్గురు కొమార్తెలకును వివాహముకొఱకు స్వయంవరము జరుపుచుండఁగా భీష్ముఁ డాముగ్వుర నెత్తుకొనిపోయి తన సవతితమ్ముఁడును రాజునగు విచిత్రవీర్యునకుఁ బెండ్లి చేయఁబోఁగా అందులో పెద్దదియగు నంబ తాను సాళ్వరాజును వరించి యుంటిని గనుక వేఱొకనికిఁ దన్నిచ్చుట ధర్మముకా దని చెప్పెను. ఆందువలన భీష్ముఁడామెను సాళ్వరాజునొద్దకుఁబంపఁగాఁ నాతఁ డామె నొల్లక పొమ్మనెను. ఇట్లు తిరస్కరింపఁబడి దుఃఖితయై అంబపరశురాముని శరణువేఁడెను. ఆయనయామెకోరికచొప్పునఁదనశిష్యుఁడైన భీష్మునొద్ద కామెను దోడ్కొనిపోయి యాయన తమ్మున కీయంబను బెండ్లి సేయుమని యాజ్ఞాపించెను. సాళ్వునివరించిన యంబనుమఱియొకనికివివాహము సేయుట యధర్మమని యెంచి భీష్ముఁ డొప్పుకొనలేదు. అందువలనఁ బరశురామునికిఁగోపమువచ్చి యాతఁడు భీష్మునితో యుద్ధము మొదలుపెట్టెను.

వ ఏను వినయంబు వదలక, వినతుండ నగుచు, వివిధవాక్యం
బులఁ దెలుప, నంతకంతకు నతనికిఁ గోపం బగ్గలం బైన,
వెండియు. 1

ఆ. "గురుఁడ వై సమగ్ర । కోదండవిద్యామ
హత్త్వ మిచ్చినాఁడ । వలుగఁ దగునె;?
కారణంబు లేక । యీారసమెత్తి?, యి"
ట్లనినఁ బరశురాముఁ । డాగ్రహమున. 2

చ. "గురుఁ డని నన్నెఱుంగు; దన

ఘుండవు, నావచనంబునం దనా
దరణము సేసి; తెన్నియొ వి
ధంబులఁ బల్కెదు భక్తితోడ;నీ
వెరవులు దక్కఁ; మీయబల
వేగము పెండిలి సేయు;మంతతో
మరలు మదీయకోపశిఖి;
మానదు వే లోకవేయుఁ జేసినన్" 3

వ అనిన విని, "ధర్మాచరణంబున కింత పట్టి పెనంగ నగునె? పరానురక్తచిత్తయగుమగువ నిల్లాలిం జేయువారుంగలరె? యిట్టియకృత్యం బాచరించుటకంటె నీచేత నెట్లయినను లెస్స. తొల్లి పెద్దలుసెప్పినచొప్పవధరింపు" మని యిట్లంటి.

తే. "గర్వమై, కార్య మిట్టి దర్కార్య మిట్టి
దని యెఱుంగక, లోకంబుర్చనుపథమునఁ
దిరుగ, కున్మదవృత్తి వర్తించునట్టి
వాని, గురునైన దండింపర్ వలయునండ్రు." 5

క. అనుమాటకుఁ గాలానల
మునుబోలెను మండి, 'కయ్యర్మున కాయిత మై,
మొనలేర్చి వేగ యిచటికిఁ
జను దెమ్మ'ని, భార్గవుండు ర్ సంరంభమునన్. 6

వ. పలికిన, నేనును. 7

క. "అలుకఁదనంబున విప్రున
కలుగంగాఁ దగదు; గురుఁడు ర్ నై యున్నాఁ, డం
చలయక తలఁచితిఁ గా,కిటు
నిలుమీ, నీరణముసేఁత ర్ నిజమగు నేసీన్. 8

క. "క్షత్త్రియులఁ దొల్లి యలుకకుఁ
పాత్రము సేసి తఱిగినాఁడు బలియుఁడు గంగా
పుత్త్రుఁడు పుట్టమిఁ గా కి,ది
యీాత్రయి నింకేల చెల్లు నెఱుఁగవె నన్నున్?. 9

క. "ఏ నొకరుండన వచ్చెదఁ
గాని, బలము దేను; నీవు గఱపినశస్త్రా
స్త్రానేక విధవిలాసము
దాన వలయుసేన గాదె, తథ్యం బరయన్?" 10

వ. అని పలికి, యతనికిం బ్రణమిల్లి, చనుదెంచి సత్యవతి కింతయు విన్నవించి, యద్దేవియనుమతి వడసి, సర్వసన్నాహసమేతం బగురథం బెక్కి, విప్రాశీర్వాదంబులు సెలంగ వెడలి వచ్చి, కురుక్షేత్రంబుఁ దఱియం జనునెడ, భాగీరథ భామినీరూపంబున నరుగుదెంచి, తన్నెఱింగించి, మదీయభక్తి నభినందించి, యేనాయితంబై పోవుటకుఁ గారణం బడిగి, నాచేత నత్తెఱం గెఱింగినదియై, నన్నుం గినిసి, భార్గవుపాలికిం జని, 'నీ శిష్యుండు నిరపరాధుండు; నాకొడుకున కలుగం దగునే?' యని చెప్పి యతని యందుఁ బిక్కుగానక, మగుడ నేతెంచి, నావలనను మెత్తంబాటు లేకున్నం జనియె; నప్పుడు సిద్ధవిద్యాధరమునిగణంబులు గౌతుకంబునం గనుఁగొనుచుండ, నేను జమదగ్ని తనయున కనతిదూరంబునం దేరు డిగి, వినతుండనై నిలిచి, 'నీవు భూచారివై యున్నవాఁడవు; రథికుండనైన నాకు నీతోడసమరంబు సేయనగునే?' యనిన, యనలతరంబ యతండు దివ్యంబు లగురథరథ్యంబులు శస్త్రాస్త్రంబులునుం' గలిగి, యకృతవ్రణుండు సారథిగా సమర

సన్నద్ధుండై తోఁచినం, జూచి రథారోహణంబు సేసి, శంఖంబు పూరించి, గుణంబు సారించి, సూతునగ్గించి, తనకు సమస్కరించి, కడంగిన నప్పరశురామ దేవుండు. 11

క. శరవర్షము నామీఁదం
గురిసిన, నే నాకసమునఁ గుదియించితి, నా
యరదంబు పొంతకును న
చ్చెరువుగ నొకబాణ మైనఁ జేరకయుండన్. 12

క. ఒక మొగి నలువదియమ్ములఁ
బ్రకటబలుం డైన పరశురాముఁడు నాయం
గకములు దాఁకఁగ, నశ్వ
ప్రకరము నో నాట, సూతుపైఁ బడ నేసెన్. 13

క. దానికి నవ్వుచు వేగం
బే నొకభల్లంబు దొడిగి యేసితి, సాంద్ర
జ్యానాదభరితరోదసి
యైనతదీయోగ్రచాప మఱిముఱిఁ దునియన్. 14

ఉ. ఒండొకవిల్లు పుచ్చికొని,
యుజ్జ్వలరోషమహానలార్చు లొం
డొండ మొగంబుపై నెగయ,
నుర్వి చలింప, గుణధ్వనిఘనము
ద్దండతఁ దీవ్రమార్గణశ
తంబున నాయరదంబు ముంచె రా
ముండు, వియచ్చరప్రకర
ముల్ వెఱఁగందుచుఁ బ్రస్తుతింపఁగన్. 15

క. ఊఱక మదీయాంగంబులు
గిఱిగొన నట్లేయుటయును, గినుక గదిరినన్
మెఱుఁ గారునారసమ్ములు
దఱచుగ నించితిఁ గడంగి తద్గాత్రమునన్. 16

తే. ఉచ్చిపోయిన యేటుల నొలుకుశోణి
తమున సర్వాంగకంబులుఁ దడిసి యొప్పెఁ,
జిగురుఁదఱచునఁ గెంజాయ మిగిలి చెలువు
వడయుక్రొమ్మావిచాడ్పున భార్గవుండు. 17

క. నెత్తురు వడసిన మూర్ధా
యత్తుండై సొగయుటయును, నాతనిఁ గని, యు
ద్వృత్తక్షత్రియధర్మో
పాత్తంబగు తేజ మొల్లఁ బ్రాలై తోఁచెన్. 18

వ. అప్పుడు మనంబున నన్ను నేన గర్హించుకొను చుండితి. 19

ఆ. అంతఁ దెలిసి రాముఁ డతికుపితాత్ముఁ డై,
యేఱు వాఱుతెంచు నెసక మెసఁగ
నప్రమేయశరము లడరించె; నవి సత్వ
రముగ నేను బ్రతిహతములు సేసి, 20

క. మరుదస్త్ర మేయ, గుహ్యక
శరమున వారించె నతఁడు, సరభసముగ ను
ద్ధురశిఖబాణం బేసిన,
గురుఁడు వరుణవిశిఖనిహతిఁ గుదియంజేసెన్. 21

క. ఇమ్మెయి నతఁడును దివ్యా
స్త్రమ్ములు నామీఁద నేయ, రయమునఁ బ్రతిఘా

త మ్మొనరించితి, దివిగజ
ణ మ్మంబరవీథిఁ గీర్తి న మ్మొనరింపన్. 22

తే. రాముఁ డంత్యకాలానలో గ్రామలీల
మండి నాయురస్థలి యొక్క మార్గమున
నేసె, నంతంత నున్నముని నీశ్వరులును
గాశిరాజుకన్యకయును గడఁగియార్వ. 23

క. అనిశితాస్త్రం బెయ్యది
యో నాకుం దెలియ; దది మఱి హృదాగ్రగత నాటం
గానొచ్చి, పడితి నరదము
పై; నప్పుడు సూతుఁ డచట వాపె రథంబున్. 24

తే. చేతనుఁడ నయి యేను, మఱి సూతుఁ గినిసి,
రాముఁ డున్నెడ కప్పుడు గ్రమ్మఱంగ
రథముఁ దోలించి, బాణపరంపరాని
మగ్నుఁ జేసితి, నంబనెమ్మనము గలఁక. 25

వ. ఇట్లు బహుప్రకారంబులం బోరుచుఁ, బ్రొద్దు గ్రుంకిన
ప్పుడు రణం బుపసంహరించుచు, రేపకడ దొడంగుచుం
బెనంగ, నిరువదిరెండుదివసంబులు చెల్లిన, మఱునాఁటి
కయ్యంబున నేనునుం గడంగి. 26

క. కడుబెట్టిదముగఁ గదియం
బడి, హయములు నొవ్వ, ధనువు భగ్నంబుగఁ, జే
డ్పడి సారథి దెరలఁగఁ, దన
యొడలు సిరుఁగ, నేసినను, మఱిహోద్ధతి గురుఁడున్. 27

క. ఒకశక్తి వైవ, నఱికితి;
నకుటిలముగ శక్తిదశక మడరించిన, గ్రు

కృకక్రుంచితి; బహుళశక్తుల
నికరము పరఁగించినం దుర్నిమిత్తం, బెలుచన్. 28

క. విస్మయము నొందుభార్గవు,
నస్మత్కర మపుడు లాఘవారూఢముగా,
నస్మితుఁ డగుచుం బటుదీ
ప్తిస్ఫారాస్త్రముల నేసితిం బరవశుఁగాన్. 29

వ. ఇట్లతండు మూర్ఛిల్లిన, మునిజనంబులును నంబయు నధిక శోకసమాకులత్వంబు నొంది, హాహాకారంబులు సెలంగఁ, బొదివి రంత. 30

ఆ. తెలిసి భార్గవుండు దృఢతీవ్రనారాచ
పంక్తి గురిసి, నన్నుఁ బారవశ్య
మంది నేల కొఱగునట్లుగాఁ జేసి, మ
త్స్రాతుమస్తకంబుఁ దునియ నేసె. 31

వ. అట్టియెడ నెనమండ్రువిప్రులు సమానవయోరూపంబుల నొప్పువారలు నన్నెత్తి, సేదదేర్చి, రథంబుపయిం బెట్టి, గగనగమనంబునం బోయి; రంతకు మున్న మందాకిని మున్ను నాకన్నచందంబున నొగలపయి నుండి, మదీయరథ్యంబుల పగ్గంబులు ధరియించి యున్నయది; యేనునుం గనుంగొని నమస్కరించిన, దీవించి చనియె. వెండియు, 32

క. సారథ్యంబును జేయుచు,
ధీరత వాటించి రామదేవునితోడం
గ్రూడాస్త్రంబులఁ జతురవి
హారం బొనరించితిని, సురావలి వొగడన్. 33

వ. ఇవ్విధంబునం బోరి, సూర్యాస్తమయం బగుటయు నెప్పటి
యట్ల చని, యే నారాత్రి యేకాంతంబున దర్భశయనంబున
నుండి, సురభూసురవర్గంబులం దలంచి, భక్తిం బ్రణామం
బులు సేసి, 'పరశురాముని జయింపరాదయ్యెడు; దినంబులు
పెక్కులు సనియె; నతనినాజి జయించుట గలుగునేని, మీ
రు నాకుం దోఁచి యాఱడింపవలయు న'ని ప్రార్థించినిద్రిం
చు చుండం, బవలు నన్నెత్తి రథంబుపయిం బెట్టిన యెన
మండ్రునుం బ్రభాతసమయంబునం గలలోన వచ్చి; 34

తే. 'నీవు నేమును నొక్కటి, నీకు వెఱవ
నేల, గాంగేయ! రాము జయించునట్టి
శరము సుమ్మ'ని మోహనాస్త్రంబు నాకు
నిచ్చి, పోయిరి క్రమ్మఱ నెక్కడేని. 35

వ. ఏను మేలుకాంచి, సంతోషించి. తన్మంత్రస్వరూపంబును,
ప్రయోగోపసంహారప్రకారంబులును, జిత్తంబున నిలిపికొ
నుచుఁ, గాలోచిత కృత్యంబు లాచరించి, యొక్క సారథి
నంగీకరించి, యరదంబు పూన్పించి, సన్నద్ధుండనై, సత్వ
రంబుగా సమరంబున కరిగినం, బరశురామదేవుండు, 36

క. 'నిన్న యఱ సచ్చి పోయితి;
వున్నయఱయు నేఁడు దీర్చి, యుడిపెద నీగ
ర్వోన్నతి; యింకెట వోయెదు,
నన్ను నెఱుఁగ వెట్టుల' నుచు నాపైఁ గవిసెన్. 37

క. కవిసినఁ గడంగి యేనును
గవియించితి నంపవెల్లిఁ గడుఁ గ్రూరత;భా

ర్గవుఁడును మద్గాత్రంబున
వివిధాస్త్రప్రతతి నించి వెగ డొందించెన్. 38

వ. ఏనుం గోపించి, 39

తే. రయము మెఱయంగ నొక్క నారసము ఫాల
దేశమునయందు నాటించి, తీవ్రశక్తి
నురము వైచినఁ, దూగాడి యొఱఁగ, నూఁది
పట్టి యకృతవ్రణుఁడు దేర్చెఁ బరశురాము. 40

క. అప్పుడు దెప్పిఱి, కన్నుల
నిప్పులు రాలంగ నన్ను నిశ్చలదృష్టిం
దప్పక చూచి, యలఁతిన
వ్యాప్పఁగ బ్రహ్మాస్త్ర మాతఁ డుగ్రత సేసెన్. 41

క. తెగ గొని బ్రహ్మాస్త్రము యేఁ
దగ నేసిన, నొకటి నొకటి దార్కొని, రెండుఁ
గగనం బంతయుఁ దేజ
స్థగితముగాఁ జేసె, సురలు దైత్యులుఁ దలఁకన్. 42

తే. సకలభూతసంక్షోభసంజనక మైన
యట్టియెడఁ గని, యిది దఱియని తలంచి
మోహనాస్త్రంబు సంచితాహ్వానంబు
సేయుటయును, జరాచరశ్రేణి మ్రోసె. 43

వ. తదవసరంబున, 44

క. 'ఉడు గుడుగు! మోహనాస్త్రము
విడువకు మ'ను నెలుఁగుతోడ వేగంబున న
య్యెడ కేఁగుదెంచి నారదుఁ
డడపడు టించుకయు లేక యిట్లను నాతోన్ .. 45

క. 'గురునకు సవమానము ని
ష్ఠురవృత్తిం జేసె దీవు, సూచితిమే యి
ప్పురమునఁ బరుసపు నడవడి,
కురువంశప్రవర! యిట్లు గూడునె చేయన్?.' 46

వ. అని సువ్యక్తంబుగాఁ జెప్పి, 47

క. 'వీరె సుర లోకసంబున,
గారవమున బుద్ధి సెప్పఁగా నీకడకుం
దా రేఁగుదెంచి ర'ని క
న్నారంగాఁ జూపె నాకు నయ్యోనమంద్రడన్. 48

వ. ఇవ్విధంబున నెప్పటి విప్రవరులు సన్నిధి సేసి, నన్నుం జూచి,
నగుమొగంబులతో నెఱుఁగని వారపోలె, నిట్లనిరి. 49

క. 'నారదముని త్రైలోక్యస
మారాధ్యుం, డితనిపలుకు లాగమవాక్యో
దారములు; వినుము వీనిం;
గ్రూరత వాటింపఁ దగదు గురువిషయమునన్' 50

వ. అనిన విని యేను సమ్మోహనాస్త్రంబేయుట యుడిగి, బ్రహ్మా
స్త్రంబు దీపింపం జేసితి; నప్పుడు జామదగ్న్యుం డదియెల్ల
నెఱింగి, ఓటమియొక్కించుకొని, చలంబు మిగిలియున్నం
దజ్జనకుండు జమదగ్నియుఁ, దదీయపితృవర్గంబును, నతని
సన్నిధిసేసి, వేఁడికొని శాంతవచనంబులం దేర్చి, యిట్లనిరి. 51

క. 'వినుము వసుమూర్తి యీతం
డనన్యసామాన్యతేజుఁ; డాహవభూమిన్
మనకు జయింప వశమె భీ
ష్మునిఁ విప్రున కగునె రోషమును మత్సరమున్. 52

తే. సమర ముడుగు; నారాయణ సఖుఁడు నరుఁడు,
సవ్యసాచి నా నింకొక జన్మ మొంది,
యితని వధియించుఁగాని, తక్కిఁతరజనము
లకు నసాధ్యుండు భీష్ముఁడా లంబులోన.' 53

వ. అనిన నతండు పోక, పెనంగిన, వెండియు ననేక ప్రకారం బులంజెప్పి యమ్మునులు నాకడకుం జనుదెంచి,యుపశమన వాక్యంబులు పలికి, జామదగ్న్యతోడం దమయాడినమాటలు దేటపఱిచి, యప్పుడు పొడసూపిన జాహ్నవియుం దారు బహువిధంబుల నన్ను ననునయించి, భార్గవుపాలికి నమ్మహాదేవిం దోడ్కొని యరిగియుం, గ్రమ్మఱ మత్సమీపంబునకు వచ్చియు, నెట్టకేలకుం జలం బుడిపిన, నే మిరువురమును దివ్యాస్త్రంబు లుపసంహరించి, సమరం బుడిగితి మట్టియెడ నయ్యైనమంద్రు విప్రులుం జేరి, నాతో నిట్లనిరి.

ఆ. 'గురుఁడు బ్రహ్మ విదుఁ డకుంఠిత తేజుండు
పరశురాముఁ డతని పాలి కీవు,
భక్తి మెఱయనేఁగి ప్రణమిల్లి తదనుగ్రహ
హంబు పడయు వలయునో యనఘ! యిపుడు. 55

వ. అని చెప్పి యతనికడకుం దారును నారదమునీశ్వరుండును జమదగ్ని ప్రముఖులును భాగీరథియును జని, 'నీశిష్యుండు దేవవ్రతుండు; వానియెడ నలుగం దగునె? వాఁడు దగవు మాలినపనిఁ జేయంజాలక పెనంగె; నింతియ కాని విరోధి గాఁడు; వానిం గరుణింపు'మని తెలిపి, నన్నుంబిలిచినం బోయి యే నమ్మహాత్మునకు సాష్టాంగదండప్రణామంబు సేసిన, నతండు దీవనతోఁ గుచ్చియెత్తి, కౌఁగిలించికొని,'గాంగేయా!

నీశక్తికి భక్తికిం బ్రీతుండ నైతి'నని సస్నేహంబుగా సంభావించి, యంబ నవలోకించి 'నన్ను భీష్ముండు గెలిచె; నావలన నయ్యెడుపని యింతియ; నీవింక నీకుం జూడంబోలిన గతిం బొ' మ్మనిన, నమ్మానిని 'దేవా! యిది యిట్టిద, నీయోపి నంతయుం జేసితి; నీచేతం బోకున్న నేమి సేయుదు; నటు సూడు'మని పలికి పోయెం. దదనంతరంబ యమ్మునిజనపితృదేవతా సమూహంబును భృగునందను నన్ను నామంత్రణంబు సేసి, యంతర్ధానంబు సేసె. భార్గవుండును నన్ను వీడ్కొలిపి, మున్ను తనతో వచ్చిన తపోధనవర్గముం దానును మహేంద్రశైలమునకుం జనియె. నే మగిడి, యెడ నెడ నుర్వీసురుల యాశీర్వాదంబులు సంభావనవచనంబులుం బ్రస్తుతివాక్యంబులుం గర్ణంబుల కింపుసేయ, నిటవచ్చి సత్యవతికి నమస్కారపూర్వకంబుగా నంతయు నెఱింగించితిని.

## ౧౦. హంసకాకీయోపాఖ్యానము.

ఇదియును మహాభారతములోనిదియె. కురుక్షేత్రమందు పాండవులును కౌరవులును గొప్పసైన్యములతో తలపడి పోరాడుసమయమున కౌరవసేనకు నాయకులైనభీష్ముఁడును, ద్రోణుఁడును, పడినపిమ్మట కర్ణుఁడు సేనానాయకుఁడై శల్యునిరథమునడపుటకు కోరఁగా నాతఁడదివఱకు తనమేనల్లుఁడగు ధర్మరాజు వలనప్రార్థింపఁబడినందున ఆకర్ణుని నిరుత్సాహపఱచుచుఁ గఠినపుమాటలతో నిందించుచు, ఈకథ నతనికిఁజెప్పెను.

ఇందు కర్ణుఁడు కాకివంటివాఁడు; అర్జునుఁడు హంసవంటివాఁడు, అని యభిప్రాయము.

సీ. అంబుధిలో నొక్కకోయలఘుతరద్వీప
మున, ధర్మవర్తి నాఁగ జనునరేంద్రు

పురమున, నొక వైశ్యవరుఁ డధ్వరాదిస
త్కర్తుఁడును శాంతి దాంతియుతుఁడుఁ,
గరుణాపరుఁడు దాననిరతుండు ధనధాన్య
శోభియు బహుపుత్రలాభవిలసి
తుండు నై వర్తించు చుండఁగ, నిలు సేరె
నొక కాకి; యతనిపుత్రకులు దాని

తే. కెంగిళులు వెట్టి కొనియాడ, నెలమిఁ బెరిఁగి,
క్రొవ్వి, కడు మీఱి, యెట్టిపక్షులును దన్నుఁ
బోల వనిమెడుచుర్వానమునఁ దృణీక
రించి, యది పెక్కుభంగులఁ గ్రీడ సలుపు. 1

వ. ఇట్లు విహరించు చుండ, నొక్కనాఁడు గొన్నిహంసంబులు,
బలుబలంబున సుపర్ణుతో సరిసేయుం దగునట్టివి,సముద్రంబు
చేరువఁ జనం గని, యాకోమటికొడుకు లక్కాకంబునకు
వానిం జూపి యిట్లనిరి; 2

క. 'పులుఁగులలో నీ వెక్కుడు;
విలసద్గతి నంచ లిట్లు వినువీథిఁ గరం
బెలమిం జనియెడు వీనిం
గలసి పఱచి గెలువ వలదె గతులబహులతన్ ? 3

వ. అని తారతమ్యజ్ఞానహీను లగునయ్యల్పబుద్ధులు సెప్పిన,
నుచ్ఛిష్టదర్పితం బగునదియు, మూర్ఖ్యంబునం దా నంతటి
దాన నని తలంచి వానిదెసకుం జని, మనంబున వీనిలో
మేటి యెయ్యదియో యనుచుం జేరి, తనచూడ్కికి వచ్చిన
యంచం బురుడించి, 'పఱతము రమ్మ'ని పిలిచిన,నయ్యంచ
లన్నియు నిలిచి, పెలుచ నవ్వి, యువ్వాయసంబునకిట్లనియె:

క. 'మానససరసి వసింతు; మ
హీనబలము జవముఁ బక్షులెల్లను బొగడం
గా నెందుఁ దిరుగుదుము; ద
వ్వైనను ఖేదంబు లేదు హంసల మగుటన్. 5

వ. అట్టి మాయందును, 6

క. బలశాలి యైనహంసముఁ
బిలిచితి పురుడించి పాఱ బేలతనమునన్;
గలవే యింతకు మును హం
సలతోఁ బురుడించువాయసంబులు జగతిన్?' 7

సీ. అనుటయుఁ గాక పిట్లను హంసములతోడ,
'గతులు నూటొక్కటి గలవు; వాన
నొక్కటొక్కట శత యోజనవ్యాప్తి నే
మెఱయుదుఁ; బొడవుగా మీఁది కెగసి
చనుట, యచ్చటనుండి చక్క నేలకు జోడు
వట్టి డిగ్గుట, దూరపాతభంగి,
సంగతి పరువడి, చారులీలాగతి,
వక్రయానము, వలయక్రమంబు

ఆ. లోనుగాఁగ నెట్టులైనను మీఱొరి
నట్ల పఱచి, మేటి యంచ యైన
దాని నిపుడ గెలుతుఁ; దక్కటి యంచలు
భయమునొందఁ, గాకి పదుపు వొంగ', 8

వ. అనుటయు విని మున్నాహూతం బైనహంసం బక్కా
కంబు నాలోకించి, 9

ఆ. 'నూఱుగతుల నీవుఁ బోవాఱు; దే నన్నియు
నెఱుఁగఁ; బులుఁగు లెల్ల నెట్లు వాఱు
నడరి యాకసమున నిడుబాట, నట్ల పా
ఱెక్కు గస్తు; జలధి చదల'ననిన. 10

వ. అయ్యెడం గూడినకాకంబు లపహసించి 'శతప్రకారగతి
యగుదీనితో సేక యానపర్యవసానహీన సముత్సాహదో
హలి వగునీ వెట్లు మచ్చరించెదవు. పఱచిభంగపడియెదవు,
గాక' యనుటయు నమ్మరాళం బాగమిం బాసిపఱవఁదొడం
గినం, దోన యవ్వాయసంబునుం బఱచె; నిట్లు రెండును
మున్నీటిపై మిన్ను దఱిసి పాఱునట్టియెడ, 11

క, రాయంచ మందగతిఁ జను;
వాయస మతితీవ్రభంగిఁ వలను మెఱసి, లీ
లాయితము లొప్ప బహుగమ
నాయాసము నొంది, పఱచు నగ్గలికమెయిన్. 12

క. ఎలమిఁ గడచి పోవుఁ, బిలుచుఁ గ్రమ్మఱి వచ్చి,
ముక్కు ముక్కుమీఁదఁ మోపుఁ, జుట్టు
నేచి తిరుగు, నీఁకలీఁకలతో రాయు,
నొరయుఁ జిత్రగతుల, మురియు, నవ్వు. 12

వ. ఇవ్విధంబునం గాకం బనేకప్రకారప్రసరణ చతురం బై
సంచరించుటం జూచి, ముదితంబు లైనవాయసంబు లధిక
స్వరంబుల మెఱయుచు హంసంబుల గేలిగొని నవ్వుచుఁ,
దరువులపయిం ద్రుళ్లిత్రుళ్లి యాడుచు, 'మరాళంబు పరా
భవంబుఁ బొందెడుఁ జూడుం డని.పెద్దయెలుంగునం బలుకు

చుండఁ, దదీయకలకలం బాలించి, హంసంబు భరితోత్సా
హంబై, 14

క. పొడవునకు నెగసి, యొప్పటి
పడమటిదెస నిగిడి, పెలుచఁ బఱచినఁ, గూడం
గడురయమునఁ జని, యంచం
గడవంగా, కీలకఱచి కాకము పాఱున్. 15

వ. పాఱి పాఱి డయ్యుటయు, నయ్యంచ యుదంచిత త్వరిత
గమనకళావైదగ్ధ్యంబు మెఱయం బఱచిన, బీరువడి, కాకం
బాకులాంతరంగంబును, వికలాంగంబును నై, యిట్లని
వితర్కించు: 16

క. 'నేరక తోడరితిఁ; గాల్కొన
భూరుహములు లతలు గిరులుఁ బోద లేమియు లే;
వారయ బహుసత్త్వమయము
వారిధి; డిగి సోఁకినపుడె వలయుం బొలియన్. 17

వ. అనుచు దీనమానసం బయి, భయంబునం గలంగి, డస్సి,
సొగసి, యవశత నంతకంతకు డిగుచు నున్నయక్కాకిం
గనుంగొని, కలహంసం బి ట్లనియె: 18

ఆ. 'నీ వనేకగతులు నేర్తి; ది యేగతిఁ
జనుట చెపుమ, వాయసంబ! యేను
గడవ నరిగి పిలువఁగా నేల తడసెద?
వెఱక లేటి కిట్టు లెడలు విడువ?' 19

వ. అనియె నట్టియెడ, 20

క. తలకొని జలములు పక్షం
బులఁ దుండము దోఁక సోకఁ బోరిఁబోరి నెగయఁ,

బల మఱి, మెయి దిగఁ బడఁగా,
సొలసి మొగయ లేక, వాయసనుఁడు వెగడొందెన్. 21

వ. ఇట్లు మున్నీటి నీటిపయిం బడి, యగ్గలం బగుదురవస్థకు వెగ్గ
లంబు నొందు కాకంబు నాలోకించి, 'పలుక నగుం గాక;
పలికినట్లు యొవ్వరికిఁ జేయఁ దీరుఁ; బసి తీరెంగదా' యనిన
రాయంచకు నక్కాకం బిట్లనియె: 22

క. 'ఎంగిళులు గుడిచి క్రొవ్వునఁ
బొంగినమెయితోడ గర్వమునఁ దిరుగుచు, "నా
కుం గలదె యొండు నెదురు; వి
హంగమపతి నైన గెలుతు," నని మును దలఁతున్. 23

క. నాకొలఁది యిప్పు డెఱిఁగితి;
నీకరుణాలోకనంబు నడిగించి, శర
ణ్యా! కావు; నన్ను మగుడం
గాకులలోఁ గలుపఁ దగవుగాదే నీకున్.?' 24

వ. అని యిత్తెఱంగున, 25

క. ఆకులతఁ బొంది పలుకుచుఁ,
'గా! కా!' యని చంచు దెఱప గా నఱచుచు, నీ
రాకరమున మునిఁగెడు న
క్కాకిం గలహంస పరమకారుణ్యమునన్, 26

క. వెరవునఁ దత్తనువుం దన
చరణంబుల నిఱికి యెత్తి, చావుడిపి, బల
స్ఫురణంబు మెఱయ, వీఁపున
ధరియించుచు, 'వచ్చెఁ బక్షితతులు నుతింపన్... 27

వ. ఇవ్విధంబునఁ దెచ్చి యెప్పటినెలవున డించి, రాయంచ యక్కాకికి దెప్పితెన దానితో, నచ్చటికాకులు విన 'నింక నిట్టి యవినయంబు లెన్నండును జేయకు మని' పలికి, నిజసహచరంబు లగుమరాళంబులుం దానును వలయుచోటికిం జనియె. నీవు నాకోమటికొడుకుల యెంగిలికూటం బెరిఁగిన యక్కాకంబు చందంబునఁ, గురుకుమారుల యెంగిళులు గుడిచి, క్రొవ్వి, యెక్కుడువారల ధిక్కరించెదవు. నీకొలఁది యెఱుంగవు. దీనం జేటువాటిల్లు. 28

౧౧. దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల వృత్తాంతము.

ఇదియును భారతములోనిదియె. నీతినిబోధించుకథ.

వ. భీష్ముండు వెండియు నిట్లను. దీర్ఘదర్శియుఁ బ్రాప్తకాలజ్ఞుండును దీర్ఘసూత్రుండును ననుమత్స్యములు మూఁడు జలచరబహుళం బగు నొక్క యేటిమడువునఁ దమలోనం బొందు గలిగియుండునవి. వేసవి సొచ్చిన దీర్ఘదర్శి దక్కటి రెంటినిఁగూడం బిలిచి, 1

క. 'మడు వింకఁగఁ బాఱెడు, నీ
రెడఁ దెవ్విన నొండుపోటికేఁగఁగ రా దే;
ప్పుడు నింకని నీళ్లు గల
మడువునకుం బోవవలదె మన కిట్టియెడన్?'

తే. అనినఁ బ్రాప్తకాలజ్ఞుఁ డిట్లనియె, 'నేది
ప్రాప్తమయ్యె నక్కార్యంబు భంగి నెఱిఁగి,
యప్పటికిఁ దగునట్లు సేయంగవలయు,
మాని తో పాయవృత్తి నేమఱుట లేక.' 3

వ. అనిన నయ్యిరుదెఱంగుల పలుకులు విని దీర్ఘసూత్రుం డిట్లనియె.

క. 'జడనిధి చందంబున ని
మ్మడు వొప్పుఁగ, నిప్పు డేమి మాఁడెనె, యిమ్మై
నడిచి పడ; రిత్త నెవ్వగ
లుడుగుఁడు; మఱి చూచికొంద మొయ్యనఁ దఱితోన్'

క. అనుటయు, 'నిది కర్జము గా'
దని పల్కుచు, దీర్ఘదర్శి యంబుస్రోతో
జనితాభయ మగు పథమునఁ
జని, చొచ్చెం బెద్దమడువు సమ్మదలీలన్. 6

వ. తక్కిన రెండును నంద నిలిచె; నిట్లు నిలిచినయమ్మత్స్యద్వయంబునకు భయంబు జనియింపం, గతిపయదివసంబులకు, 7

క. పాఱెడు నీరెడ త్రెవ్వఁగఁ
దాఱి, బెడిదమైన యెండ దనుకఁగ, నివురం
బాఱె మడు; వంత వేడుక
కాఱులు జాలరులు సొచ్చి క్రందుకొనంగన్. 8

క. నెరవున నూఁతల నెత్తెలఁ
గరముల మత్స్యములఁ బట్టి, కడు సంతసముం
బొరయుచుఁ, ద్రాళ్లఁ గ్రువ్వఁగఁ
గర మూహించి; మదిఁ బ్రాప్తకాలజ్ఞుండున్. 9

క. 'ఇందాఁక త్రాడు గఱచి, యే
నొందంగాఁ గ్రుచ్చినట్లుండెద, వి రి
క్రందుకొనుట మానంగ, న
మ్మంగత నది యొడల విడిచి మడువు దఱిసెదన్'. 10

క. అని యొక గుదిమీలనడుమ
నెనయంగాఁ దూఱి కలఁచి, యిరుదోడలఁ ద్రా
డ్రానరంగఁ బట్టుకొని, గ్రు
చ్చినచందము దోఁప, మూర్ఛఁ జెందినభంగిన్, 11

వ. ఉన్నంత; వేఁట దీఱి యగ్గుదిగల యతండు, 12

క. తెలినీట రొంపి ప్రోవం
దోలుచు నెడం, ద్రాడు విడిచి, యదురితంబునకుం
దోలఁగి, పొరదప్పి యందొక
జలచర మున్నయెడ కేఁగె, సంభ్రాంతగతిన్. 13

క. ముట్టఁబడి దీర్ఘసూత్రుం
డిట్టట్టరుగఁగ, నుపాయ మేది, యొకనిచేఁ
బట్టువడెఁ, దనదు డెందము
పట్టు వదలి, చకితవికలభావేంద్రియుఁడై. 14

క. విను దోదవ్వులఁ గార్యము
గనికొని వలయునవి మున్నె కావింపఁగ నే
రని జడుఁడు, దీర్ఘసూత్రుం
డను నమ్మత్స్యంబుభంగి నాపదనొందున్. 15

తే. అప్పటికిఁ దోఁచినట్టులు దప్పకుండ
ననువుతో ధృతిగల్గి కార్యంబు నడపు
నతఁడు, ప్రాప్తకాలజ్ఞాఖ్యునట్లుపోలెఁ,
బరమసంశయ మయ్యేడు బ్రదుకుఁ గాంచు. 16

క. ధుర్యత ననాగతము లగు
కార్యము లూహించి, పని తగం జేయు నయా

చార్యుఁడు సౌఖ్యముఁ బొరయును,
నార్యస్థితి దీర్ఘదర్శి యనుమీనుక్రియన్. 17

## ౧౭. కపోతోపాఖ్యానము.

ఇదియును భారతములోని మఱియొక నీతికథ. ఇది యపకారికిఁగూడ నుపకారము చేయవలయునను నీతిని బోధించును. అతిథి సత్కారమును గూర్చిన ధర్మమును భూతదయయునుగూడ బోధించును.

క. 'శరణాగతసంరక్షణ
పరులకు సమకూరు నెట్టిపాటిఫలము ని
ర్భరకరుణాకర! పరమా
దరమున నెఱిఁగింపు నాకు దాని తెఱంగున్.' 1

ఆ. అనిన భీష్ముఁ డిట్టులను, 'ముచికుందుండు
నాఁగఁ బరఁగు ధరణినాయకుండు
దనుజమంత్రిచేత వినినది యొకకథ
యఖిలపాపహారిణ మాచరించు. 2

వ. అయ్యితిహాసంబు సెప్పెద; దాన నీయడిగిన యర్థంబు దెలియు నవహితుండవై యాకర్ణింపుము.

సీ. పాపాత్ముఁ డొకబోయ పక్షుల వధియించి,
తినియును, బెక్కమ్మికొనియు, నదియ
బ్రదుకుగా దానికి బహుసాధనంబులు
సవరించుకొని, మహాటవిఁ జరింప,
నొకనాఁడు పెనువానయును గాలియును ముట్టి,
సకల జీవులకు నాశంబు పుట్టు
నట్టిదియై, కానయంతయు జలమయం
బైన, బెగ్గిలి యన్నరాధముండు

తే. వేఁగ వట్ఱొడ్డి యెల్లను వెడలి, మిఱుత
నొక వనస్పతి జొంపమై యున్న దానిఁ
జెంది, రాతిరి యగుటయు, శిలయ సెజ్జ
గాఁగ, శీతార్తుఁడై యుండెఁ, గౌరవేంద్ర. 4

క. ఆలుబ్ధకుఁడు తరువర
మాలోకించి, కడుభక్తి ననియె, 'నిచటి భూ
తాలిం గొలిచెదఁ గరుణా
శీలత ననుఁ గాచుటకు విశిష్టవినీతిన్' 5

వ. అని యిట్లు పక్షిధ్వంసకుండు శయనంబు ప్రార్థించియుండ,
నమ్మహీరుహంబు కోటరంబున వసియించియుండునది యొ
క్క కపోతంబు, దన వల్లభ యెటయేని మేఁతకుం బోయి
రాక తడసిన శోకించి. 6

సీ. 'ఎచటనున్నది యొక్కొ? యింత ప్రొద్దొకచోట
నుండునే, ననుఁ బాసి యుజ్జ్వలాంగి?
యమ్మేను లేకున్న నిమ్మేని కలిమి ని
రర్థకంబ; ధికానురాగయుక్త
యగు సతిగుణముల మైహికాముష్మిక
సుఖసాధనంబులు సువ్వె పతికి;
నేకారణంబున నేమయ్యెనో? వాన
యేపునఁ దెగియెఁ గానోపు నకట!

గీ. యేమి సేయుదు "మందిరంబిపుడు పాడు
వాఱుచున్నది" యనఁగ, నప్పలుకు లెల్ల
బోయ వలలోన నున్న కపోతి విని, మ
నంబు సంతోషపూరమగ్నంబు గాఁగ; 7

క. 'పతి మదికి నింత యెక్కిన
యతివగదా పుణ్యవతి! ప్రియాలాపము లీ
గతి వినఁ గాంచితి, జన్మము
గృతకృత్యం బయ్యె నాకు, గెలిచితి జమునిన్.' 8

వ. అని యుల్లంబునన యుగ్గడించి, పతికిం దన తెఱం గెఱింగించి, విధికృతంబునకు వగవం బని లేదని, మఱియు నిట్లనియె.

చ. 'శరణము సొచ్చినం, దగఁ బ్రసన్నతఁ గైకొని, రక్షణంబు సా
దరముగఁ జేయు టత్యధికధర్మముగా బుధకోటి సెప్పు, నీ
వరసి, మహార్తు వీని శరణాగతు నోపినభంగి నాపదం
బొరయక యుండఁ జేయుము; ప్రభూతపుఁబ్రీతునఁ గొంకు వ్రా
యెదురన్' 10

క. అని యేర్పడ భాషించిన,
విని, శోకము డిగ్గవిడిచి, విహగము గరుణం
దన జాతి సెప్పి, తగ ని
ట్లనియె మనుజభాషణముల నాలుబ్ధకుతోన్. 11

క. 'ఓయన్న! డస్సినాఁడవు;
మాయింటికి నతిథి వైతి; మసలక నీకుం
జేయవలయు నాతిథ్యం
బేయది భవదీప్సితార్థ మెఱిఁగింప వనా' 12

చ. అనవుఁడు నుల్లమెంతయుఁ బ్రి
యంబువహింపఁగఁ, బక్షివైరి, 'సీ
తున సకలాంగకంబులుఁ బ్ర
తున్నము లయ్యెడు, దీనిఁ బాపవే'

యనిన, విహంగమంబు రయ
మారఁగ నచ్చటిపుల్ల లెల్ల ము
క్కునఁ గొని తెచ్చి, ప్రోవిడి, య
కుంఠితమైన దయాగుణంబునన్ 13

వ. ఆపొంతపల్లియకు రయంబునం జని, పుల్లతల సంగతంబైన
యింగలంబు 14

క. కొని వచ్చి, పుల్లప్రోవునఁ
దనుకంగాఁ జేసి, నెమ్మి దళు కొత్తఁగ, ని
ట్లను బోయతోడ, 'మే నీ
యనలంబునఁ గాంచికొనుటకై తె మ్మనఘా' 15

చ. అనవుఁడు, వాఁడు గువ్వహృద
యం బలరం, దనయంగకంబు ల
య్యనల శిఖాకలాపమున
నల్లన యల్లన కాఁచి, శీత బా
ధన ముడుఁగంగఁ జేయఁగఁ, బ
దంపడి యాఁకలి సాలఁ దోఁచెఁ; దోఁ
చిన నెఱిఁగించె గువ్వ; కది
సేయ నుపాయము లేక యాత్మలోన్ 16

వ. వగచి, వెలవెలంబాఱి,తలంచికొని,వాని కి ట్లనియె: 17

తే. 'ఖగములకు జీవనం బనఁ గలదె సంగ్ర
హించి నట్టిది? యాఁకలి కేమి యైన
మాకు దొరకొన్నఁ దిందుము గాక. యైన
నీవు డస్సితి,వాతిథ్య నియతి వలయు. 18

కపోతంబు దనశరీరంబును బోయ కాహారంబుగా
నిచ్చుట.

వ. నాశరీరం బాహారంబుగా నిచ్చెదఁ గొనుము.'

క. అని పలికి యగ్ని వలగొని,
తనదేహము దానిలోనఁ దడయక యిడినం
గని, బోయ విస్మయంబున
మన మూనఁగఁ గొంతసేపు భ్రాన్తుఁడయుండెన్. 20

వ. పదంపడి. 21

మ. 'కలదే యిమ్మెయి పౌరుషంబు జగతిం గారుణ్యమేపార ని
ష్పలుఁ గిట్లిచ్చునె మేను? నాదుచరితం బుల్నిందకుం బట్టులై
తలఁపఁ గా వచ్చిన నింత కీడగునె? యే తత్కూర్మ ఘోరచే
ష్టలు మానం గలవాఁడఁ, బక్షి గురువై సంధించె సద్బోధమున్' 22

వ. అని యంతరంగంబున వైరాగ్యంబు నిరంతరం బగుటయు,
నంత నిలువక. 23

మ. 'ఇది యిట్లాలిని బంధులం దొఱఁగి తా నీయగ్నిలోఁ గూలె; నొ
ప్పిద మై యుండఁగ నిట్టి తెంప యొలయం, బెంపారె వైరాగ్యసం
పద; పాపంబుల నెల్లఁ ద్రుంపఁగ మహాప్రస్థానపుణ్యాత్వ మొం

దెద నే నిప్పుడ'యంచు మానసము శాం
తిం బొంద నిర్మోహుఁడై, 24

క. వలలోన నున్న పులుఁగుల
వెలువడఁగా విడిచి,వలయు, వెండియుఁ దనకుం
గల పక్షినిహతిసాధన
ములు, నచటనె యుండఁ, బోయె బోయ నియతుఁడై. 25

ఆ. అక్కపోతి నాథుఁ డగ్నిలోఁ బడుటకు
శోకవహ్నిఁ జిత్త మాకులముగ,
నెలుఁగు రాలుపడఁగ, నిట్లని పలవించె,
నశ్రుజలతరంగి తాస్య యగుచు. 26

క. 'నాయూఁకలి కోర్వ వెపుడు;
వే యైనను నేఁ గొనంగ వెండి యనుభవిం;
తాయాస పడుటఁ గనుఁగొని
నోయుదు; ననుఁబాసి యిటు సనుట దగ వగునే?' 27

వ. అని వెండియు. 28

సీ. 'ఇగురుజొంపంబుల నింపారు విరులను
బలు పైనపొదల క్రేవలకుఁ దార్చి,
సెలయేఱు లందలి తెలినీటఁ దనుపుసాం
పెలసిన గిరుల తెర ప్పలకుఁ జేర్చి,
మావిమ్రోకల నెలదీవలఁ జెన్నొందు
తోఁటలకడ నలి తోడఁ జెంది,
యలరునెత్తమ్ముల కలిమిఁ జెల్వగు డిగ్గి
యుల తీరభూముల నల్లఁ బొరిది,

తే. నన్ను మనమునఁ దేల్చియా నంద మొందఁ,
గేలిసలిపెడు నీదగు లీల మఱవ
నావశంబె, ప్రాణేశ! ప్రాణంబు లిపుడ
నిన్నుకూర్చి, యేతెంతు నీ సన్నకడకు. 29

వ. అట్లుం గాక. 30

క. జేని యనుమరణమునఁ దన
మేను విడిచి నట్టి కాంత మేలిపదవికిం
దాను నతండును నరిగి, య
నూనస్థిరసుఖము లందు చుండుట విందున్.' 31

క. అని పల్కి, యపుడ యనలము
ఘనముగ దరికొలిపి, మది వికాసముఁ బొందం,
దనవల్లభుఁ దలఁచుచు, వల
గొని, లీలం జొచ్చి, యతనిఁ గూడం జనియెఁ. 32

క. స్ఫురిత విమానముమీఁద న
మరతతి వేష్టింప, రత్నమయభూషణసుం
దరదివ్యమూర్తి వెలిఁగెడు
వరునిఁ గలసి, పరమసౌఖ్యవైభవ మెసఁగన్ 33

తే. లీలఁ బొరిఁబొరి నచ్చర లేమపిండు
బలసి యభినందనము సేయఁ, బొలిచె; నిట్లు
సనిన పక్షియుగ్మంబు వర్తనము దోఁచెఁ
బుణ్యావర్తనుఁ డగుట నా బోయ కపుడు. 34

వ. తోఁచిన నతండు, 35

క. 'ఏనున్న ని ట్లగుదు న'నుచు,
నూనిన కౌతూహలమున నుల్లము పొదలన్,

మే నెల్ల ముండ్లు సింపఁగఁ,
గానఁ దఱిసి, గళితరక్త కలితాకృతి యై. 36

తే. అరుగు చుండు వాఁ డొకచో, దవానలంబు
గట్టెదిరి కాననం బెల్ల ముట్టి మండ,
సంప్రమోదితచిత్తుఁడై, చక్కఁ జొచ్చి,
యొడలు దొఱఁగి, దేవత్వంబు నడసియొప్పె. 37

---

## ౧౩. గృధ్రజంబుకోపాఖ్యానము.

ఈ నీతికథయును భారతములోనిదే. ఇందు స్వలాభమునిమిత్త మితరులను వంచించు వారల స్వభావములు గ్రద్దయొక్కయు నక్కయొక్కయు వాదములవలనఁ దేటపఱుపఁబడినవి.

సీ. గాంగేయుఁ డిట్లనుఁ గాంతేయపూర్వజు
నకు, 'విదిశాపట్టనమున, నొక్క
బాలుండు మృతుఁడైన, బంధులు ప్రేతభూ
మికిఁ గొనిపోయి, యమేయశోక
వివశాత్ములై పలవింపఁగా, గ్రద్ద యొ
క్కటివచ్చి, "మీర లిక్కడ భయంబు
దక్క యేడ్చుచునుండఁ దగ దిది; దె క్రుంకెడుఁ
బ్రొద్దు; రాక్షసులును, భూతములుఁ, బి

తే. శాచములు వచ్చి, తిన నిపు డేచి వచ్చు.
జననమరణముల్ వింతలె? చన్నశిశువు
తోన యందఱుఁ జనుటకుఁ బూనియుండు
వారలే? పొండు పీనుంగు వైచి వేగ. 1

క. తెగిపోయినవా రేడ్చిన
మగుడుదురే, వెఱ్ఱులార? మానుఁడు; మీరుం

దెసఁగుదురు దడసిన," నాప్పుడు
"నగు నట్టిద కర్జ మ''నుచు నందఱు భీతిఁ 2

వ. శవంబు విడిచిపోవం జూచిన, నొక్కనక్క బొక్కలో నుండి
వెడలి, వారలతోడ: 3

సీ. "గ్రద్దమాటల కేల కడుభీతిఁ బొందితి?
రక్కటా! బాలుని నబ్జవదను
నిటు వైచి పోవఁ గాళ్లె ట్లాడె? నేడ్వఁడు
శోకంబు ప్రోవ నిచ్చోటఁ గొంత
ప్రొద్దంతలో విధి ప్రాపుండు గా కున్నఁ,
ప్రాణంబు గ్రమ్మఱ రాక గల్గు
నో యెఱుంగుదురే? యినుండును నస్తాద్రిఁ
జేరఁడు వెఱవక మీరు నిలువుఁ"

తే. డనిన వారును, మనమున నాస పుట్టి,
మగిడి వచ్చిన, గ్రద్ద, "యిమ్మందబుద్ధి
యైన నక్కమాటలు విననగునె? వికృత
మయ్యెఁ బీనుంగు; వచ్చునే యసువు లింక? 4

క. కడుబెట్టిదుండు కాలుఁడు,
మిడుక మిడుక నపహరించు; మీ రీయాసల్
విడువుఁడు; బాలునికి సుగతిఁ
బడయుఁడు దానాదులైన బహుధర్మములన్'' 5

వ. అని పలికిన, నాగృధ్రంబు వచనంబు లాక్షేపించి, యజ్జంబు
కంబు వారల నుద్దేశించి: 6

క. "క్రూరంబు గృధ్ర ;మిట్టి కు
మారకునిం జూచి చూచి మసలక పోవన్

మీ రెట్లోర్చెదరో? క
న్నీరిటు ననుబోఁటులకును । నిలువ కొలిఁకెడున్. 7

క. దయమాలి పోవ నేటికిఁ,
బ్రయత్నమునఁ బొందువ, । దైవబలమున మీకుం
బ్రియ మెసఁగ బ్రదుకు; బ్రదుకం
డయినను, మఱి పోవరాదె?" । యని చెప్పుటయున్. 8

వ. గ్రద్ద యిట్లనియె: 9

ఆ. "ఏను బుట్టి, వేయి । నిన్నూఱు మున్నూఱుఁ
గలవు వత్సరములు; । గాన నెందు
బాలు, యౌవనస్థుఁ, । బ్రౌఢుని, వృద్ధునిఁ
జచ్చిపోయి మగిడి । వచ్చు వాని. 10

క. ఒకటి గలదు; వత్తురు వే
ఱొకగర్భంబునకు మృతులు; । నుక్కివ మాన
క్కట నేటిబుద్ధి? పీనుఁగు
నకు బ్రదుకటె కలుగు? నిట్టి । నవ్వులు గలవే" 11

సీ. అనవుడు, నెగవెక్కి । యాబిడ్డ వైచిపో
యెడు వారలకు నడ్డ । పడుచు, నక్క
"వినుఁడు రాఘవుఁడు నే । ర్చిన బ్రదికింపఁడే
మృతుఁడైన భూసుర । సుతుని మగుడ?
సృంజయు । కొడుకు స । చ్చిన, నారదుఁడు ప్రభా
వంబునఁ గ్రమ్మఱ । వానిఁ దేఁడె?
యట్టుల యొక సిద్ధుఁ । డమరుండు బూ యేడ్పు
లాలించి, దయ బాలు । ననువు లోనఁగ

ఆ. నేని, మేల కాదె? యిదియేల పోమెద
ర''నిన వారు మగిడి యరుగుదెంచి,
శిశుశవముచుట్టుఁ జేరి, వెల్లేడ్చిరి.
పనవి పనవి; యంత నినుఁడు గ్రుంకె. 12

వ. ఆగృధ్రంబును జంబుకంబును నాఁకలిచేత వందురుచుండి, తాసతాన బాలశవంబు నాహారంబు గొనుటకై యివ్విధంబునం దమతమ పల్కునేర్పున నజ్జనంబుఁ బ్రమ్మతించెఁ; బ్రొద్దు గ్రుంకినం దా నచ్చోట నిలువనేరదు గావున, గ్రద్ద యటమున్న వాగు వ్రొవునట్టి తెలుఁగు మాటలాడెఁ; రాత్రియైనం దనకు మేలుగావున, నక్క వారలు దడయుటకుం దగినచందంబుఁ జెప్పె; నది వాని తెలుఁగు ప్రేతవనవిహార నిరతుం డగు శంకరుండు కరుణాకింకరుండు నగుట, నప్పుడు,

ఆ. అట్లు పనవియేడ్చు నజ్జనంబులకుఁ బ్ర
త్యక్షమై, 'వరంబు లడుగుఁ'డనిన
సంప్రమోద భక్తి సంభ్రమభరితులై,
చక్క నవనిఁజాఁగి మ్రొక్కి, వారు. 14

క. "బాలమరణశోకంబునఁ
దేలక యుండంగఁగావు, దేవోత్తమ! నీ
వాలించిన బ్రదికితిమి ద
యాళుహృదయ! పార్వతీప్రియా! చంద్రధరా!" 15

వ. అనుచు లేచి నిలుచుటయు, శివుం డాశిశువుప్రాణంబు లొసంగి, "వీఁడు శతాయుస్సంపన్నుం డగు వాఁ" డని, యానతిచ్చి 'యాగృధ్రజంబుకంబులకు నాఁకలి యెన్నండును లేక యుండం బ్రసాదించి, యంతర్హితుం డయ్యె. సంతో

షంబున నంతరంగంబులు నంగంబులుం బొదల, నజ్జనంబులు బాలు నెత్తికొని, పలుమఱుం జూచుచుఁ, గౌఁగిలించుచుం జనిరి. గృధ్రంబునుం జంబుకంబును ముదంబునఁ బొంగుచుం బోయి, తమతమ కులంబులలోఁ బ్రభూతంబులై ప్రవర్తిల్లె; నార్తజనబాష్పప్రమార్జనంబు ప్రభువులకుం గర్తవ్యం బగుటకును, నిజకార్యార్థులగు కపటుల నేర్పుమాటల తెరువు లెఱింగికొనుటకును, నుదాహరణంబైన యీగృధ్రజంబుకోపాఖ్యానంబు 16

క. వినినఁ, బఠించిన, వ్రాసినఁ,
గొనియాడిన, దురితపీడకుం దొలఁగి, నరుం
డనుపమధర్మములకు భా
జన మగు, నాయుఃప్రవృద్ధి సంపద నొందున్. 17

---

## ౧౮. చిరకారిచరిత్రము.

ఇదియును మహాభారతములోనిదియె. ఏపనియును దొందరపడిచేయక బాగుగా మంచిచెడ్డలను విచారించి ప్రవర్తింపవలెనని బోధించుటకుఁ జెప్పఁబడినది. ఇందుఁదలిదండ్రులు బిడ్డలయెడలఁ జూపు ప్రేమరసము, బిడ్డలు తలిదండ్రులకుఁ జూపవలసిన కృతజ్ఞతయు వివరింపఁబడినవి.

క. అతఁడు చిరకాలసువిచా
రితంబుగాఁ జేసి యాచరించుం, గురుభూ
పతివర్య ; యెద్దియును; నది
కతముగఁ జిరకారినామకంబునఁ బరఁగున్. 1

సీ. విను మొక్క కారణంబున, ముని పత్నిపైఁ
గోపించి, చంప నకొడుకుఁ బనిచి,

యెటయేని వెడలి పోవుటయును, బను లెల్లఁ
జిరవిచారముతోడఁ జేయుఁగాన,
యచ్చిరకారి యిట్లని విచారించె, "జ
నకుపంపు సేఁత మా సంగరాదు;
తల్లిఁ జంపుటయును దగదు; 'తండ్రి తలంపు
దప్పింతుఁ గా క'ని తలఁతునేనిఁ,

తే. గల్మషం బంద్రు దాని సత్కర్మవిదులు;
మాతృరక్ష గర్తవ్య మొకమ్మాడిక్కైననఁ;
బుత్రభావ మస్వాతంత్ర్య మునకు నెలవు.
పాప మడఁగింప నెవ్వల నోపునొక్కొ? 2

క. 'జననీవధంబు సేసిన
ననుమానమె నరక మగుట' యని యుడిగితిఁ బో,
జనకావమాన మొనరిం
చినవానికి నరకమున వసింపఁగ వలదే? 3

తే. తల్లి భస్త్రిక, బీజంబు తండ్రి వెట్టు,
వంశధరణార్థముగ; నిది వారిభంగి,
యేను బొత్తులవాఁడ నయ్యిరువురకును,
వీరలం దిప్పు డెవ్వరి విడుచువాఁడ." 4

వ. అని విచారించి తలంచుకొని, 5

క. "జనకుఁడ యే నై జన్మిం
చినవాఁడను; జనకుపంపు సేసినఁ, బాయుం
దనయునిపాపము లనియును
విని యుండుదుఁ; దలఁపు లింక వేయును నేలా? 6

క. జనకుఁడు తపమును, ధర్మం
బును, విద్యయుఁ, బరమదైవతమును, గావున నా
తనికిఁ బ్రియం బగుపని సే
సిన, దేవతలెల్లఁ బ్రీతిఁ జెందుట గల్లున్" 7

వ. అని వితర్కించియుఁ, దల్లి తెఱంగుఁ దలంచి, 8

చ. "కరచరణాదిసంఘటిత
కాయము సంజననంబు, వహ్నిపు
ట్టరణికిఁబోలెఁ, దల్లి దెస
నైనది గాదొకో? యట్లుఁ గాక దు
ర్భర మగుగర్భఖేదమును
బట్టికినై, నిజదేహచింతపై
భర మొకయింత లేక పడు
పాటులు నక్కట! యొక్కఁ డింతకున్. 9

ఆ. వచ్చి పోయి చూచువాఁడు గాకిడుములఁ
బడునె తల్లిపోలెఁ బట్టితోడఁ
దండ్రి? చెప్పు నిట్లు ధర్మశాస్త్రంబులు,
నంబ గౌరవమున నధిక యగుట. 10

ఆ. బాలుఁడైనఁ, గొడుకు ప్రౌఢుఁడైనను, వృద్ధుఁ
డైన, నొక్కవిధమ యర్మిలియును,
నరయుభరముఁ దల్లి కాపదార్థంబు జ
గంబుకలిమి కెల్లఁ గారణంబు. 11

ఆ. క్షుద్రజంతువులకు గురులకు నెమ్మియుఁ
దలఁప నొక్కరూపు తల్లి వలయు

నూఱడిల్లఁ గలదె యొండుసోటుల సువ
స్తువు, నివాస మైన చోటఁ గాక? 12

క. అప్పుడ యసమర్థుం డగు,
నప్పుడ దుఃఖి యగు, శూన్యుఁ డై తోఁచు జగం
బప్పుడ, మాతృవియోగం
బెప్పుడు వాటిల్లె,నపుడ యెంతయుఁ దూలున్. 13

క. కలవాఁడు లేనివాఁడు, స
బలుఁ డబలుఁడు, మూఢబుద్ధి ప్రౌఢుం డ,నఁగా
వల దెవ్వరి కైన, జనని
కలిమియ యత్యంతసౌఖ్యకర మై యుండున్. 14

తే. ఇట్టిజనని వధించుట యెల్లభంగి
నధికపాపపయోరాశి యందు ముంచు;
దీని నెఱుఁగండె పసులవాఁ డైన? వధకు
నేల తెంపు వాటిలుఁ? జేతు లెట్టులాడు?" 15

వ. అని యిట్లు పెక్కు భంగుల నూహించుచుఁ, జిరకారియగుట
నతండు శీఘ్రకారి గాక యుండం, దడ వెంతయేనియుం
గలిగె; నంతకుం దదీయజనకుండు, 16

క. "వెడపనికి నాలిఁ జంపం
గొడుకుఁ బనిచి వచ్చినాఁడఁ గ్రూరత్వమునం,
గడవంబడునొక్కొ పని," యని
కడువెసఁ జనుదెంచె నశ్రుకణములు దొరఁగన్. 17

వ. అట్లు సనుదెంచునప్పుడు, 18

క. "చిరకారి యెట్లునుం దన
చిరకారితఁ జూపుఁగాక, శీఘ్రపుఁ జేఁతన్

దురటిల్లఁ జేయునే నను?
వెరవరి వాఁ డిట్టిపనికి ♦ వేగిరపడునే?" 19

వ. అని పుత్త్రు నుద్దేశించి, 20

చ. "చిరముగ గర్భవాసమునఁ
జెందితి పుత్ర! చిరంబు గాఁగ ని
న్నరసెఁగదయ్య తల్లి; యన
యంబును నేఁ బసుపంగఁ బూనియుం,
జిర మగునట్టి యిత్తెఱఁగు
సేఁత దలంచితయేని, సత్కృపా
పర! చిరకారి నాఁ బరఁగు
భావితనామము సార్థకం బగున్. 21

ఆ. నాకు నాతపంబుఁ ♦ నకు నింద రాకుండ,
దురితభయము నిన్నుఁ ♦ బొరయకుండ,
నెమ్మిఁ జేసి; తన్న! ♦ నీచిరకారిత
సకలభూతములును ♦ సంస్తుతింప." 22

వ. అనుచుం జనుదెంచి, నివాసంబు ప్రవేశించినం గని, చిరకారి నిజకరంబున నున్నవధసాధనంబు డిగ్గవిడిచి, యగ్గౌతమవంశవర్యుచరణంబులు శిరంబుసోఁకఁ బ్రణామంబు సేసెం; బత్నియుం జాఁగి మ్రొక్కె; నయ్యిరువుర నెత్తి, శోకబాష్పంబు లానందాశ్రువులుగా, నమ్మునివరుండు దనయుని గాఢాలింగనంబును, మూర్ధఘ్రాణంబును, జేసి దీవనలం బొఁగడ్తల నభినందించి, దానును వారును సుఖాసీనుఁడై యుండి యిట్లనియె. 23

క. "కార్యవిచారము చిరముగ
ధైర్యముతో నడపవలయుఁ; దత్తత్క్రియలం
దార్యుఁ డనార్యుఁడు వీఁ డని,
యార్యులు సేయుదురు నిశ్చయమును జిరముగన్. 24

క. మిత్రత్వము, శత్రుత్వముఁ,
బాత్రతయు, నపాత్రతయును, బరికించు సుచా
రిత్రుఁడు చిరతరగణనా
సూత్రితముగ దాన నెల్ల శుభములు నొందున్." 25

---

## ౧౫. వసిష్ఠ విశ్వామిత్ర సంవాదము.

ఈ కథాభాగమును దీని తరువాత భాగములు రెండును గౌరన వ్రాసిన హరిశ్చంద్రోపాఖ్యానము నుండి తీయఁబడినవి. ఇది ద్విపద కావ్యము. ద్విపద అనఁగా రెండు పాదములు గల పద్యము. ఈ పద్య మనేకవిధములఁ జదువుటకును బాడుటకును, నుపయోగించును. దసరా పద్యములు మొదలైనవి ద్విపదగనే సామాన్యముగ వ్రాయఁబడుచుండును. గౌరన కవి క్రీ.శ. 1550 ప్రాంతము వాఁడందురు.

'మూఁడు లోకంబుల మునుమిడి మీరు
చూడని యట్టి రాజులు మఱిలేరు;
వారక మును చన్నవారిలో, నున్న
వారిలోఁ,బుట్టెడివారిలోపలను
బలికి బొంకని మహీపాలుండు గలఁడె?
తలపోసి చెప్పుఁ డింద్రాదులు నట్టివాని'
నని యిట్లు దేవేంద్రుఁడాడినమాట
వినియును, విననట్లు విస్మయం బంది,
యేవారు నుత్తరం బీక, యొండొరుల

నీవు నీవని చూపి, నిఖిల సన్మునులు
గుజగుజలాడఁ; గన్గొని, సభవారి
గజిబిజిఁ జేయొత్తి కలయ వారించి,
నిరుపమ విజ్ఞాననిధి వసిష్ఠుండు
పురుహూతుతోడ నద్భుతముగాఁ బలికెః—
'వినుము, సురేంద్ర! యీ విశ్వంబునందు
వినుతికెక్కిన మహా విక్రమోన్నతుఁడు,
తనరు షోడశ మహా దానవినోది,
వినయభూషణుఁడు, వివేకసంపన్నుఁ,
డతులసత్కీర్తి, మహాభాగ్యశాలి,
వితతధనుర్వేద విద్యాధికుండు,
కరుణాపయోనిధి, గాంభీర్యఘనుఁడు,
దురితదూరుఁడు, బుధస్తోత్రపాత్రుండు,
సర్వశాస్త్రార్థవిచారకోవిదుఁడు,
గర్వితరిపుగజకంఠీరవుండు,
వరుస నాఱ్వురు చక్రవర్తులలోనఁ
దర మిడి మున్నెన్నఁదగు చక్రవర్తి,
నిత్యప్రసన్నుండు నీతిపాలకుఁడు,
సత్యసంధుండు, త్రిశంకునందనుఁడుఁ,
నిరుపమ విజ్ఞాన నిధి, భానువంశ
శరధిచంద్రుఁడు, హరిశ్చంద్రుఁ డన్రాజు;
షోఁడిమి మదిఁ దలపోసి చూచినను,
వాఁడె పో బొంకనివాఁడు దేవేంద్ర!'
అనిన విశ్వామిత్రుఁ డంబుద ధ్వనికిఁ

గనలి సింహము మాఱు ఽ గర్జించునట్లు,
లావసిష్ఠునిఁ గోప ఽ మడర వీక్షించి,
'యీవిధంబున మృష ఽ లేల వాక్రువ్వ?
నోజ దధ్యాజ్యశా ఽ ల్యోదనమాంస
భోజనంబులు పరి ఽ పూర్తిగా మెసఁగి,
మత్తులై వర్తిల్లు ఽ మానవేశ్వరులు
సత్తుగా బొంకుట ఽ సత్య మెయ్యెడను.
జనపతు లేయూరు? ఽ సత్యమే యూరు?
వినఁ గూడ దీమాట ఽ విడువుము; చాలు

నే; డ హరిశ్చంద్రుఁ? ఽ డెక్కడి సత్య
మే? డ సమ్మోషి దిది ; ఽ యినవంశజులకు
హితవు మీరిన పురో ఽ హితుఁడవు గాన,
శతముఖంబుల రేఁగి ఽ సన్నుతిఁ జేయు
ద;భిమతం బింద్రున ఽ కైనఁ గానిమ్ము;
సభవారి కీమాట ఽ సమ్మతి గాదు.
దోషము వినఁగ నీ ఽ దుర్వాక్కు'లనిన,
రోషించి పలికె న ఽ రుంధతీ విభుఁడు:—
"అంతుగా నాఁబోతు ఽ అంకె వేసినను,
గంతులు దక్కునే ఽ కంఠీరవంబు?
కల్లజంజాటంబు ఽ కౌశిక ! యిచటఁ
జెల్లదు సుమ్ము, వ ఽ సిష్ఠుఁ డుండంగ;
సురగకంకణుతోడ ఽ నూరజోగులను
సరి చేసి యెన్నిన ఽ చందాన, నీవు
నమలసత్యవ్రతుం ఽ డగుహరిశ్చంద్రు

సమముగా నృపపిశాచముల లెక్కింతు!
వా మహారాజేంద్రు నఱకాలివ్రాలు
భూమిపాలుర ఫాలముల నైనఁ గలదె!
యెవ్వనిఁగాఁ జూచితినకులేశ్వరునిఁ?
గ్రొవ్వి దూషించెదు కొలువు మధ్యమున?
నాసార్వభౌము నిట్లాడిన నీకు
వాసి వచ్చెనో? వాని వన్నె యుడిగెనో?
యట్టి సత్యవ్రతు, నారాజచంద్రు,
నట్టి తేజోధను, నా హరిశ్చంద్రుఁ
దివిరి పల్మాఱు నిందించెద వేని.
శివుఁ డెఱిఁగెడుఁ జుమీ! చెప్పెడి దేమి? ”
యనిన విశ్వామిత్రుఁ డలుక రెట్టించి,
మనమునఁ బెనఁగొన మఱియు నిట్లనియె:—

‘వలదు వసిష్ఠ! యీ వట్టిజర్జరుల
కలుగునే కౌశికుఁ డల్పుని రీతి?
దండడి డీకొని తగరు దాఁకినను,
గొండల మందునే కులపర్వతంబు?
సొలయక నినుఁ బుత్రశోకాబ్ధి ముంచి,
మలయంగఁ జేయుట మఱచితే నేఁటి?
కొక రాజకీటంబు, నొక దుర్మదాంధు,
నొకని నాముందఱ నొకకొండఁ జేసి,
పూని, నీ వతనిపైఁ బూయనిపూఁత,
లేనిసత్యంబు గల్పించి, యెక్కించి,
నలరేఁగి, వాని గుణంబులు గాఁగఁ

గలవి లేనివి కొన్ని కాఱులు సెప్పి,
యందంద నామది కతిచలం బెసఁగ
వంది చందమునఁ గై వారంబు సేసి,
దంట మాటలు గొన్ని తడవాటు వన్ని,
గెంటక నోరార్చి గెల్వఁ జూచెదవు.
ఏనుండఁ దక్కిన యీగామును లుండఁ,
బూని నీ వెంతయుఁ బ్రోడయుఁ బోలె,
నాకేశుతోడ ము న్నాడి పల్కితివి !
మాకంటె నొక తపో మహిమాధికుఁడవె ?
నరసురాసురయక్ష నాగగంధర్వ
వరులందు మఱియు నెవ్వారలయందు,
బొంకనివారలఁ బోడ గాన మేము;
శంకరునాన ! ము జ్జగములయందు''
ననిన వసిష్ఠుఁ డిట్లనియె నాతనికిఁ
'దడవినమాటకుఁ దగినయుత్తరము
నుడువక, ప్రాజ్ఞుండు నో రొత్తుకొనునె ?
యలరెండువేల జి హ్వాలవాని కైనఁ
గొలఁదె హరిశ్చంద్రు గుణములు వొగడఁ ?
దను వెల్ల సత్యంబు; తలఁపెల్లఁ గరుణ;
పను లెల్ల ధర్మంబు; పలు కెల్లఁ బ్రియము;
బొంకు నాలుకకుఁ జేర్చుట కానివావి;
యింక నిన్నియుఁ జెప్ప, నేమికారణము ?
వారిజగర్భుని వ్రాఁతదప్పినను,
వారిజాప్తుఁడు తూర్పు వంకఁ గ్రుంకినను,

మేరువు గ్రుంగిన, మిన్ను వ్రాలినను,
ధారుణీచక్రంబు తలక్రిందు వడిన,
వారిధు లింకిన, వజ్రాయుధంబు
ధార దప్పిన, మాట తప్పఁ డారాజు!'
నావుడు నమ్మునినాథునిశ్చయము
భావించి క్రమ్మఱఁ బలికెఁ గౌశికుఁడు
'మేలు! నీమాటలు మెచ్చి రందఱును.
జాలుఁ బురే! రిత్త సంవాద మేల?
విన్నమాటల మాకు విశ్వాస మొదవ
ద, న్నరేంద్రునిసత్య మరసినఁ గాని;
యేయుపాయముల నే నిట మీఁద వాని
మాయలఁ గుదియించి మాటల నొంచి
యుల్ల మంతఁ గలంచి యూఁచముట్టుగను,
గల్ల లాడించినఁ గలదె పన్నిదము?
నిక్క మింతకుఁ జాలి నిలిచెద నేను.
జక్కఁగా మున్నె విచార మే మైనఁ
గల దేని వానికిఁ గఱపి నీపూన్కి.
వెలయఁ దిరంబు గావించి రమ్మ'నినఁ,
జెఱునవ్వు నవ్వి, వసిష్ఠుఁ డాగ్రహము
మెఱయఁ, గౌశికసంశయమికి నిట్టులనియె:
'సన్నుతం బగునట్టి సత్యవ్రతంబు
వెన్నతో నిడిన దానవిభునకు మున్నె;
కఱపెడి దేమి? యక్కమలాప్తకులుని
తెఱఁ గెఱుంగక, పూని దేవేంద్రుతోడ

నఱిముఱి వే మించ నాడంగ నేమి?
చిఱుతవేసి యింక నిన్ను చెప్ప నేమిటికి?
నీ వొకండవె కావు; నీవంటిమునులు
వేవురు గూడి, వేవేలచందముల
మాయలు పన్నిన, మరులు గొల్పినను,
బాయనియిడుముల పాలు సేసినను,
జననుతుఁ డగు హరిశ్చంద్ర భూవిభుఁడు
మనసున, వాక్కున, మఱి చేఁతలందుఁ,
గలలోన నైనను, గలవరింతలను,
నలఁకువ వచ్చిన, నవ్వులకైనఁ,
గులసతిఁ బాసినఁ, గొడుకు వోయినను,
దలమీఁద వచ్చినఁ, దాలిమి దూలి,
మఱచి, తా నాడినమాట బొంకినను,
మఱి నీవు నవ్వ,బ్రాహ్మ్యమునకుఁ దొలఁగి,
తపమును వేదశాస్త్రములును మఱచి,
యుపవీతసూత్రంబు లొగిఁ బుచ్చివైచి,
జపమును సంధ్యాదిసత్క్రియ లుడిగి,
వపనమై, యధ్యాత్మ వాసన మాని,
విపుల వల్కలములు విడిచి, నెన్నుదుట
నపవిత్ర మైనట్టి యంకంబు దాల్చి,
ఘనగార్ధభము నెక్కి, కష్టమానవుని
పునుకలో మద్యంబుఁ బోసి త్రావుచును,
జను లెల్ల నేవగించఁగఁ, దల వాంచి
కొని, దక్షిణాభిముఖుండ నై చనుదు ' !

నని వసిష్ఠుఁడు పల్కె నతుల ప్రతిజ్ఞ
విని, కౌశికుఁడు క్రోధవివశుఁ డై పలికె:—

విశ్వామిత్రుని శపథము.

'అనిమిషవల్లభుఁ డాదిగా సురలు
మునివరు లింక నాపూనికి వినుఁడు.
సాధించి, యాహరిశ్చంద్ర భూవిభునిఁ
గ్రోధకాళికి బారి నోటియఁగాఁ జేసి,
పలుకుపంతము చెల్లుబడి గాఁగ, నతనిఁ
జలపట్టి బొంకింపఁ జాలక యున్న,
సిద్ధచారణమునిసేవితం బైన
సిద్ధాశ్రమంబున శివుని నేఁ గూర్చి,
గాలి యాహారంబుగాఁ గ్రోలి, యొక్క
కాలూఁది, యూర్ధ్వముఖంబు గా నిలిచి,
రెండుచేతులు నెత్తి, ఱెప్పలు విచ్చి,
చండాంశుపై దృష్టి చక్కఁగా నిలిపి,
యెన్నంగఁ బెక్కు వేలేండ్లు తపంబు
మున్ను చేసినయట్టి పుణ్యంబులోన
సగ మిచ్చి, భువన ప్రశస్తంబు గాఁగ,
యుగములు నాలుగు, నొగిఁ బదునాల్గు
వరుసలు వర్తింప, వసుధ నేలింతు;
మఱి చతుర్దశమహామన్వంతరమున,
నింద్రుని సరిగద్దె నీ స్వర్గమందుఁ,
జంద్రకళామౌళి సాక్షిగా నునుతు!'
నని భయంకరముగా నమ్మహామునులు

చెనఁటిప్రతిజ్ఞలు సేసిన, బెదరి;
పన్నగేంద్రుని వేయి పడగలుఁ గ్రుంగె;
మిన్ను బిటదరె; నిమ్మేదిని దిరిగె;
జలధులు గలఁగె; నక్షత్రముల్ రాలెఁ;
గులగిరు లగలె; దిక్కులు వ్రక్కలయ్యెఁ;
బెల్లుగాఁ గావిరి బారసి, యుద్ధంపు
బిల్లపోలికి రవి బింబంబు దోఁచె.
గుండె జల్లనఁ, జేతి కులిశంబు వైచి,
పండెఁ బొమ్మని, దేవపతి గొల్వు విచ్చె.
జడలు వీడఁగఁ, గళాసములు విదిల్చి
మడిచి చంకల నిడి, మరలి చూచుచును,
జనిరి మౌనులు నిజాశ్రమముల కట్లు;
చనిరి వసిష్ఠ విశ్వామిత్రు లంత.

### ౧౬. వసంత వర్ణన.

తొలఁగె హిమంబు; చంద్రుఁడు మెఱుఁ గెక్కె
వెలిఁగెఁ; దియ్యనివిల్లు వెస నెక్కు వెట్టె
మెలఁగెఁ గంతుఁడు నుబ్బిమీఱి నల్గడలఁ;
జెలరేఁగి కోయిలల్ చెలఁగె; జుమ్మనుచు
మ్రోసెఁ దుమ్మెదలు గుంపులు గట్టె; అంతఁ
జేసె రాచిలుకలు; చెలు వగ్గలముగఁ
గ్రాలె జక్కవలు; చెంగల్వదీర్ఘికల
వ్రాలె నంచలు; ముద్దుపగఁ గ్రొత్తనసలు
దోఁచెఁ బొన్నలఁ; దతితో నట మున్నె
పూచె మోదుగువృక్షములు; విఱ్ఱీఁగఁ

గాచెఁ జూతంబులు; కమ్మనై మలసి
వీచె సోమరిగాలి విరుల తావులను.

విశ్వామిత్రుఁడు హరిశ్చంద్రుని ధన మడుగుట

బొలుచు నమ్మధుమాసమున నొక్క క్రతువు
వెలయ హరిశ్చంద్రవిభుఁ డొనరించి,
భూరిఁ బెట్టెడువార్త బోరన మ్రోయఁ,
గ్రూరచిత్తుఁడు కౌశికుఁడు విని యుబ్బి,
'కలిగెఁ బో సందు నాకడఁగినపనికి;
నలఘుసత్యవ్రతుం డగుహరిశ్చంద్రుఁ
దలము దప్పినయట్టి ధనరాశి వేఁడి,
కలఁచి బొంకించెదఁ గాక'ని పోయి,
మేదినీవిభుఁ గాంచి, మేల్మియక్షతలు
వేదమంత్రముల దీవించి యిచ్చుటయు;
నమ్మునిచంద్రున కర్ఘ్యపాద్యమ్ము
లిమ్ములఁ గావించి, యిలఁ జాఁగి మ్రొక్కి,
'ఘనతపోవైభవ! గాధేయ! నీవు
ననుఁ బ్రీతి మన్నించి నాయాగమునకు
శ్రీవిలసిల్ల వేంచేసితి గాన,
భావింప నీయాగఫల మబ్బె నాకుఁ;
బంపుఁ డేపనికైనఁ, బరఁగఁ గావింతు,
నింపార మీకు నభీష్ట మెయ్యదియొ'
యనిన విశ్వామిత్రుఁ డారాజుఁ జూచి,
'యనఘాత్మ! నీ కసాధ్యంబు లేపనులు?
కల్పవృక్షము కాయ క్రయ మడిగినట్లు,

లల్పదానం బొకం డడుగ వచ్చితిని.
అది చెప్పెదను విను; మధ్వరం బిపుడు
విదితంబుగాఁ జేయ వేడుక పుట్టెఁ;
బురుషుఁ డేనుఁగు నెక్కి, పొడవుగా నిక్కి,
వరరత్న మెగసి పోవైచినపొడవు
ధనము రాశిగఁ బోసి, దాన మిచ్చినను,
జననాథ! కొదలేక, సాఁగు నాయజ్ఞ'
మనినఁ, 'గృతార్థుండ నైతి; నీయిష్ట
ధనమిత్తుఁ; గొమ్మ'న్నఁ, దలయూఁచి, యప్పు
డొడుపు దప్పినయట్టి యురగంబ పోలెఁ,
దడయక వచ్చిన, తనపూన్కి దప్పి,
'మనుజేశతిలక! నీమన సొత్తి చూడ
విన విస్మయంబుగా వేఁడితిఁ గాక,
నీవంటిగుణరత్ననిధి మాకుఁ గలుగ,
నేవేళ ధన రాసు లేమిటఁ గొదువ?
యింక మాకుత్తరం బిచ్చిన, నీకు
శంకరునాన! త్రిశంకుని యాన!
పోయివచ్చెద నింక, భూపాలచంద్ర!
యాయురారోగ్యంబు లయ్యెడి నీకు'
ననుచుఁ గాలూఁదక, యచ్చోటు వాసి,
చనియె నమ్ముని నిజాశ్రమమున; కంత
నాహరిశ్చంద్రుండు నంతరంగమున
నూహించి, 'యిటమీఁద నొప్పమి పుట్టు;
పెనఁ బాముఁ జంపి పై వేసినరీతి,

మసలక పోయె నశేష్మలకలతపసి;
యీంప నెవ్వరివశే మహామహాఁడు
శాపించనేని ముజ్జగములుఁ గాలుఁ;
బోయినజగడంబు పోవని' మ్మనుచు
నాయతశక్తి రాజ్యము సేయుచుండె.

# ప్రసిద్ధపద్యములు.

[ఈపద్యములకుఁ దాత్పర్యముమాత్రము తెలిసినఁ జాలును.]

ఈనాలుగుపద్యములును మహాభారతమునుండి తీయఁబడినవి. దుష్యంతునకు శకుంతలచేఁ జెప్పఁబడినయుపన్యాసములోని భాగములు. సత్యమేపరమధర్మ మని బోధించును.

## 1. సత్యము.

చ. విమలయశోనిధీ పురుష
వృత్త మెఱుంగుచు నుండుఁ జూవె, వే
దములును, బంచభూతములు,
ధర్మువు, సంధ్యలు, నంతరాత్మయుఁ,
యముఁడును, జంద్రసూర్యులు, న
హంబును, రాత్రియు, నన్మహాపదా
ర్థము లివి యుండఁగా, నరుఁడు
దక్కొనన నేర్చునె తన్ను బ్రముచ్చిలన్? 1

చ. సుతజలపూరితంబు లగు
నూతులు నూఱిటికంటె, సూనృత
వ్రత! యొక బావి మేలు; మఱి
బావులు నూఱిటికంటె, నొక్కస
త్క్రతు వది మేలు; తత్క్రతుశ
తంబునకంటె, సుతుండు మేలు; త
త్సుతశతకంబుకంటె, నొక
సూనృతవాక్యము మేలు చూడఁగన్. 2

క. వెలయంగ నశ్వమేధం
బులు వేయును, నొక్క సత్యమును, నిరుగడలం
దులనిడి తూఁపఁగ, సత్యము
వలనన ములుసూపు, గౌరవంబున పెర్మిన్. 3

తే. సర్వతీర్థాభిగమనంబు, సర్వవేద
సమధిగమము, సత్యంబుతో సరియుఁ గావ,
యెఱుఁగు 'మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు', ధర్మజ్ఞులైన మునులు. 4

ఈ క్రిందిపద్యములు భాగవతములోనివి.

2. అర్జునుఁడు శంఖమొత్తుట.

వీనిలో గజేంద్రమోక్షణము, ప్రహ్లాదచరిత్రము దేవునియందు భక్తినిబోధించుమిక్కిలి ప్రసిద్ధభాగములు.

మ. కలఁగెం దోయధిసప్తకంబు; గిరివ
ర్గంబెల్ల నూటాడె; సం
చలతం బొందె వసుంధరావలయము; ఆ
శాచక్రముల్లాడెఁ; గొం

దల మందెం ద్రిద శేంద్రుపట్టనము ; పా
తాళంబు ఘూర్ణిల్లె; నా
కుల మయ్యెఁ గ్రహతారకాకులము ; సం
క్షోభించె నవ్వేధయుఁ. 5

## 3. ద్రౌపది.

చ. వరమునఁ బుట్టితిఁ, భరత
వంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ
వరునకుఁ గోడలైతి, జన 5
వంద్యులఁ బొందితి, నీతివిక్రమ
స్థిరు లగుపుత్త్రులం బడసి
తిఁ, సహజన్ములప్రాపుఁ గాంచితిఁ,
సరసిజనాభ! యిన్నిటఁ బ్ర
శస్తికి నెక్కినదాన నెంతయుఁ. 6

## 4. శ్రీరామావతారము.

సీ. తాటక మర్దించి, తపసిజన్నముఁ గాచి,
హరివిల్లు విఱిచి, ధైర్యమున మెఱసి,
ప్రబలు లైనట్టి విరాధకబంధోగ్ర
ఖరదూషణాది రాక్షసులఁ దునిమి,
వానరవిభు నేలి, వాలిఁ గూలఁగ నేసి,
జలరాశిగర్వంబుఁ జక్కఁ జేసి,
సేతువు బంధించి, చేరి రావణకుంభ
కర్ణాదివీరులఁ గడిమిఁ ద్రుంచి,
తే. యలవిభీషణు లంకకు నధిపుఁ జేసి,
భూమిసుతఁ గూడి సాకేత పురమునందు

రాజ్యసుఖములు గైకొన్న | రామవిభుఁడు
వరుస ననుఁ బ్రోచుచుండుఁ బ్రవాసగతుల. 7

### 5. ప్రహ్లాదుఁడు భక్తినిగూర్చి.

సీ. మందార మకరంద | మాధుర్యమునఁ దేలు
మధుపంబు పోవునే | మదనములకు?
నిర్మలమందాకి | నీవీచికలఁ దూఁగు
రాయంచ సనునె | తరంగిణులకు?
లలితరసాల | పల్లవఖాది యై చొక్కు
కోయిల సేరునే | కుటజములకుఁ?
బూర్ణేందుచంద్రికా | స్ఫురితచకోరక
మరుగునే సాంద్రని | హారములకు?

తే. అంబుజోదరుదివ్య | పాదారవింద
చింతనామృతపానవి | శేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ | జేరనేర్చు?
వినుతగుణశీల! మాటలు | వేయు నేల? 8

సీ. కమలాక్షు నర్చించు | కరములు కరములు,
శ్రీనాథు వర్ణించు | జిహ్వ జిహ్వ,
సురరక్షకునిఁ జూచు | చూడ్కులు చూడ్కులు,
శేషశాయికి మ్రొక్కు | శిరము శిరము,
విష్ణు నాకర్ణించు | వీనులు వీనులు,
మధువైరిఁ దవిలిన | మనము మనము,
భగవంతు వలగొను | పదములు పదములు,
పురుషోత్తముని మీఁది | బుద్ధి బుద్ధి,

తే. దేవదేవునిఁ జింతించు దినము దినము,
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు,
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు, గురుఁడు,
తండ్రి!'హరిఁ జేరు మ'నియెడి తండ్రి తండ్రి. 9

6. హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదునిఁగూర్చి.

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి, శే
షాంగశ్రేణికి రక్షసేయుక్రియ, నీయజ్ఞుం, గులద్రోహి, దు
స్సంగుం, గేశవపక్షపాతి,నధముం జంపించి, వీరవ్రతో
త్తుంగ ఖ్యాతిఁ జరించెదం,గులమునిర్దోషంబుగావించెదన్

7. ప్రహ్లాదుఁడీశ్వరుని సర్వవ్యాపకత్వముఁ గూర్చి.

మ. కల డంభోధి; కలండు గాలి; కలఁ డా
కాశంబునన్; కుంభినిం
గలఁడు ; అగ్నిన్, దిశలం, బగళ్ల,నిశలన్,
ఖద్యోతచంద్రాదులం
గలఁడు; ఓంకారమునన్ త్రిమూర్తుల, త్రిలిం
గవ్యక్తులం దంతటన్,
కలఁ డీశుండు; కలండు; తండ్రి! వెదకం
గా నేల యీయాయెడన్? 11

క. 'ఇందుఁ గలఁడు; అందు లేఁడు;' అని
సందేహము వలదు; చక్రి సర్వోపగతుం
డు;ఎందెందు వెదకి చూచిన,
నందందే కలఁడు; దానవాగ్రణి! వింటే? 12

## 8. గజేంద్రుని మొఱ.

శా. లావొక్కింతయు లేదు; ధైర్యము విలో
లం బయ్యెఁ; బ్రాణంబులుం
ఠావుల్ దప్పెను; మూర్ఛవచ్చెఁ; దనువుం
డస్సెన్; శ్రమం బయ్యెడిన్;
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ;మ
న్నింపన్ దగున్ దీనునిన్;
రావే, యీశ్వర! కావవే, వరద! సం
రక్షింపు, భద్రాత్మకా! 13

## 9. బలిచక్రవర్తి సత్యమునుగూర్చి.

శా. కారే రాజులు? రాజ్యముల్ గలుగవే?
గర్వోన్నతిం బొందరే?
వా రేరీ? సిరి మూటఁ గట్టికొని, పో
వం జాలిరే? భూమిపైఁ
పేరైనం గలదే? శిబిప్రముఖులుం
బ్రీతిన్ యశఃకాములై,
యీరే కోర్కులు? వారలన్ మఱచిరే,
యిక్కాలమున్, భార్గవా? 14

మ. నిరయం బైన, నిబంధమైన, ధరణీ
నిర్మూలనం బైన, దు
ర్మరణం బైన, కులాంత మైన, నిజమున్
రానిమ్ము, కానిమ్ము పో!
హరి యైనన్ హరుఁడైన, నీరజభవుం
డభ్యాగతుం డైన, నౌ;

తిరుగన్ నేరదు నాదుజిహ్వ, వినుమా,
ధీవర్య! వే యేటికిన్? 15

## 10. దేవకి కంసునితో.

ఉ. అన్న! శమింపుమన్న! తగదు; అల్లుఁడుగాఁడు; ఇది మేనగోడలా;
మన్నన సేయుమన్న! విను! మానినిఁ జంపుట రాచపాడిగా
దన్న! సుకీర్తివై మనఁగదన్న! మహాత్ములు పూర్వుత్రోవఁబో
వన్న! భవత్సహోదరిఁ గదన్న! నినున్ శరణంబు వేఁడెదన్.

ఈ క్రిందివి భర్తృహరిలోనివి.

## 11. పరోపకారము.

తే. తరువు లతిరసఫలభారగురుత గాంచు,
నింగి వ్రేలుచు నమృత మొసంగు మేఘుఁ
డు; ఉద్ధతులు గారు బుధులు సమృద్ధిచేత;
జగతి నుపకర్తలకు నిది సహజగుణము. 17

తే. ద్యుమణి పద్మాకరము వికచముగఁ జేయు;
కుముదహర్షంబు గావించు నమృతసూతి;
అర్థితుఁడు గాక, జల మిచ్చు నంబుధరుఁడు;
సజ్జనులు తారె పరహితాచరణమతులు. 18

## 12. మైత్రి.

ఉ. క్షీరము మున్ను నీటి కొసఁ
గెన్ స్వగుణంబులు, తన్నుఁ జేరుటన్,
క్షీరము తప్తమౌట కని,
చిచ్చుఱికెన్ వెతచే జలంబు; దు
ర్వారసుహృద్విపత్తిఁ గని,
వహ్నిఁ జొరం జనె దుగ్ధము; అంతలో

నీరముఁ గూడి, శాంత మగు;
నిల్చు మహాత్ములమైత్రి యీగతిన్. 10

## 13. పౌరుషము.

తే. తనిసిరే వేల్పు లుదధి రత్నములచేత?
వెఱచిరే ఘోరకాకోలవిషముచేత ?
విడిచిరే యత్న మమృతంబు వొడము దనుక ?
నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు. 20

శా. నీతిప్రౌఢవిహారు లైననిపుణుల్
నిందింపనీ, మెచ్చనీ,
ఖ్యాతిం జెందినసంపదల్ నిలుపనీ,
గాఢంబుగా సాఁగనీ,
ఘాతం బప్పుడె పొందనీ; నియతి మోఁ
గానీ యుగాంతంబునన్,
నీతిశ్లాఘ్యపథంబు తప్పరు గదా!
నిత్యంబు ధీరోత్తముల్. 21

## 14. వనములందలి సౌఖ్యములు.

చ. కలవు పచేళిమంబు లయి,
కానలలోపల, పండ్లు మ్రాఁకులన్;
కలవు పవిత్రవాహినుల
కమ్మనిశీతలవారిపూరముల్ ;
కలవు చివుళ్లపాన్పులు ; అవి
గైకొన నేరక, దీను లై, ధనా
ఢ్యులగవనిన్ వసించి, నరు
లు ఓలి సహింతురు తీవ్రతాపమున్. 22

# సరసపద్య కథా సంగ్రహము.

టీక.

## 1. శ్రీరాముఁడరణ్యమునకుఁ బోవుట.

1. కమ్మని— మాటలుకమ్మనివనుటలో నేమి తాత్పర్యము? అట్టులనే, తియ్యనిమాటలు, చప్పనిమాటలు, తేనెమాటలు, అన నేమి?
చనునే—చెల్లునా? తగునా ?

2. అఱమఱ— వాడుకలోని మాట ; 'వానికి మనకు మరో అఱమఱ, అభ్యంతరంలేదు' అని మాటలాడునప్పుడు వాడుటకలదు.
ఆనతి—'ఆజ్ఞప్తి' అనుదాని వికారము.
నీయానసుమీ— వాడుకలో 'నీతోడే సరి' అన్నట్టు.

3. పనుపుదురు—పంపుదురు.
తోడఁ బుట్టువు— ఏలింగము ?
పున్నియపు నేలలు - పుణ్య క్షేత్రములు.
మెలఁత—ఇట్లు 'స్త్రీ' అను అర్థమున వాడు మాటలను గుర్తించి పట్టికవ్రాయుము.

4. ఎన—సమము.

5. ఆన - 'ఆజ్ఞ' అనుదాని వికారము; రెండవపద్యములోని 'ఆన' కు అర్థమేమి?
బత్తి—'భక్తి' అనుదాని వికారము ; అట్లనే 'ముక్తి'కి 'ముత్తి', 'శక్తి' కి 'సత్తి', వికారములు.
నాతి—స్త్రీ.

6. కటకట—'కటా' అను కంటె, 'కటకట' లోనేమి హెచ్చు?
అటమటలు—వంచనలు.
'తానొక్కటి తలంచిన, దయ్యంబొక్కటి తలంచు'—ఈసామెత వాడు

కలో ఎట్లుండును? ‘దైవము’ నకు ‘దయ్యము’ని వికారపు మాట. ఎందుకు వాడఁబడెను?

7. కన్నకొడుకు—ఎట్టివారు కనని కొడుకులు?
‘కాఱు’ అనగా ‘గాఢమైన’; కాఱు + అడవి = ‘కాఱడవి’ గొప్పఅడవి. అట్లనే, కాఱునలుపు = హెచ్చైననలుపు.
ఎప్పగిది నోరాడెనోకో—వాడుకలో ‘ఎట్లానోరాడిందోగదా!’

8. సవతితనము— ఈ ‘తనము’ న కర్థమేమి? చిన్నతనము, ముసలితనము, లాతితనము (1వ పద్యము), మొదలగు చోటి ‘తనము’ వంటిదే. ఆ+ఉవిద = అయ్యువిద; ఉవిద—స్త్రీ.
వలుక = పలుక; ‘ప’ అను దానికి ‘వ’ ఎందుకువచ్చెను?
దిటము— ‘దృఢము’ అను దానివికారము. వాడుకలో ‘దిట్టము’ అందురు.
అఱ—కపటము, మర్మము, భేదము.

9. ఆ, బోటి = ఆ స్త్రీ. — ఈ యర్థపుమాటల పట్టికను కూర్పుము.
ఒడయఁడు = ప్రభువు, ఒజ్జ—గురువు.

10. సుఖపడునప్పుడు కాలముగడచుట తెలియరాదు; కనుక కాలము త్వరగా జరిగినట్లుతోఁచును; దుఃఖకాలమున నిమిషము చాలసేపు వలెనుండును. ఇంక నెప్పుడు కాలమిట్లు దీర్ఘముగా నుండును?
పొలుపు, ఆజి=కాంతి చెడి; వృద్ధి చెడి.

11. అంపదొనలు=అమ్ము (ల) దొనలు (పొదులు).
పుడమికాన్పు—పుడమి=భూమి; కాన్పు = బిడ్డ; సీతభూమికి బిడ్డ. సీత ఎట్లు పుట్టినది?
వలపు—ప్రేమ.

12. పతివ్రత ఎట్టిదని సీత చెప్పుచున్నది?
మెసవుట = తినుట; అనుభవించుట.
గొడవలు+ఒదవెడు+ఱేని = కష్టములు+పుట్టు+వేళ. గొడవ, గొడబ, అనికూడ వాడుకలో నందురు.
ఉసుఱుల+ఒడయఁడు = ప్రాణములకు + ప్రభువు; ప్రాణనాథుఁడు,
నాడెంపు+వెలఁదుక = యోగ్యమైన+స్త్రీ. నాడెముఅనఁగ యోగ్యత;

గుణము; వాడుకలో 'ఈ వస్తువనాడెము చేయండి' అందుము. అనఁగా, 'గుణముకనుఁగొనుఁడు' అని అభిప్రాయము.—

13. ముత్తయిదువ— సువాసిని, పేరంటాలు, మగఁడుగల యోగ్యమైన స్త్రీ. ముత్త (వృద్ధ) + ఐదువ (ఐదుకలది), ఆఐదు ఏవనఁగా-పసపు, కుంకుమ, గాజులు,మంగళసూత్రము, చెవ్వాకులు(లేదామట్టెలు). 'ఐదువ' యన్న నీయర్థమే.

పోణిమి - పోడిమి; సౌందర్యము.

అన్ను = స్త్రీ,

నెమ్మి = క్షేమము, సంతోషము.

14 నేలఱేఁడు - ఇది అచ్చతెనుఁగు; సంస్కృతసమము—భూవిభుఁడు; పృథివీపతి. ఱేఁడు-రాజు.

15. అనవుడున్ = నావుడు = అనఁగా.

ననబోఁడి=విరిబోఁడి= పువ్వుఁబోఁడి= స్త్రీ. 'నన' అనఁగానేమి?

ఈమాటలలోని'బోఁడి'కర్థమేమి?

మిన్న = శ్రేష్ఠము; ఇచట, శ్రేష్ఠురాలు.

నగి—వాడుకలో 'నవ్వి'

చక్కెర+బొమ్మ = స్త్రీ. చక్కెర = పంచదార. స్త్రీని 'పంచదార బొమ్మ'అని యెందుకందురు? పంచదారయొక్క ఏ గుణము తీసికొనఁబడినది? పిల్లలను ముద్దులాడునపుడు 'నా పనసపండేది?' అందురు కదా! అట్లేయిచట 'బంగారపుబొమ్మ' అనిఅందురు - ఎందువల్ల ?

16. లాఁతి తెఱఁగు - వేఱువిధము - వాడుకలో 'మరోలాగుఅనుకోకేమి' అందుము.

17. గొప్పస్త్రీలకు పట్టణములలోని వినోదములేమనిచెప్పఁబడినవి? అడవులలో వీనిబదులు ఎట్టికష్టములు వర్ణింపఁబడినవి ?

కూన=పిల్ల; పిల్లికూన, కుక్కకూన.

కొదమ=పిల్ల.

దుగమొగంబుల పుల్గు—దుగ=రెండు; పుల్గు=పులుఁగు = పక్షి ; ఇట్టి పక్షుల పేరేమి?

జవ్వాది పిల్లులు-పరిమళముగల జవ్వాది, పునుఁగు మొదలగు కొన్ని పదార్థములు, ఆయా పేరులుగల పిల్లులనుండి తీయఁబడును.

బెబ్బులి - పెను (=పెద్ద) + పులి.
కయిసేయు-అలంకరించు.
తీవియ = తివె=తీవ. తీఁగె=తీఁగ.
పొదలు-(క్రియ)-వృద్ధిపొందు; (నామము)-తుప్పలు.
పూఁబోఁడి-(బహు-పూఁబోండ్లు)-పువ్వుఁబోఁడి-పువ్వువంటి మేనుగలది.
పొల+ఓగిర (పు) + పొలంతుకలు=మాంసము+అన్నము(కల)+స్త్రీలు;
అనఁగా'రాక్షస స్త్రీలు.' పొల=పొలసు; ఓగిరము = అన్నము.
గోల-స్త్రీ. కోన=అడవి పల్లె. గోలలెక్కడ; కోనలెక్కడ - అనఁగా-రెంటికినిచాల భేదమున్నది; వాడుకలోని సామెతలోనిట్లే-'నక్క ఎక్కడ? దేవలోకమెక్కడ, ఈ 'ఎక్కడ' అను మాటలు 'అంతరము' సూచించును.
గాటంపు=గాఢపు; 'గాఢ' అనుమాటకు 'గాట' అనునది వికారము.

18. పలనొదవని = 'పల్లగాని' 'వీలుకాని'.
పలపదు=పలదు= 'వద్దు' అని అందుము.
ఎలదీవెఁ బోఁడి - లేఁతతీఁగెఁ బోఁడి - సుకుమార స్త్రీ.
'కలలోనైనఁ బాయఁగలనే' - అనఁగా, అజాగ్రత్తనైనను విడువనని.

19. కలువ+కంటి=కలువ (రేకుల) వంటి + కన్నులు కలది=స్త్రీ.
ఇయ్యకొను= ఒప్పికొను=అంగీకరించు.

20. ఇంటికి వచ్చినప్పుడును, ఎచటికైన వెళ్లునప్పుడును, పెద్దలకునమస్కరించి సెలవుపొందుటఆచారము. సమానులనుకౌఁగలించుకొనుటయుఆచారము.
తొడవుతొడవు = నగకునగ = సొమ్మునకుసొమ్ము = ఆభరణమునకు ఆభరణము. ఆభరణము శరీరమునకు ఏమిచ్చును? అట్లనే, ఈమె యాభరణములకు ఈమెశరీరమే వన్నె తెచ్చెను. నగలీమె ధరించుట వలన మిక్కిలి సొగసుగనున్నవి. అంత అందకత్తె.

21. లక్కుమనుఁడు - 'లక్ష్మణుఁడు' అనుదాని వికారము. ఈ వికారపు మాటలు వాడు టెందుకు? కవి ఏమి నియమము పెట్టుకొని వ్రాసెను?
సింగాణి=సింగిణి (సంస్కృతము='సింజిని') అను దాని రూపాంతరము. విల్లు.
అక్కజము = ఆశ్చర్యము. దొనలు = (అమ్ముల) పొదులు.

22. గేస్తురాలు= భార్య; 'గృహస్థుఁడు' అనుదానికి 'గేస్తుఁడు' అని వికారము; 'గేస్తుఁడు' అను దానికి స్త్రీలింగ మెట్లుండును ?

నడిమిత్రోవ—ఇది పెద్దదియనియా, చిన్నది యనియా అభిప్రాయము?

23. నిగారపు +గొనముల+ తిట్టులు=మంచి + గుణములకు+ఉనికిపట్లు; యోగ్యగుణములు కలవారు ; గుణవంతులు. 'గుణమునకు' వికారము 'గొనము.' నిగారము-అనఁగా, కాంతి; కాంతిగలగుణములు అనఁగా మంచివి అనియర్థము. చెడ్డగుణములునల్లనివని, ముఱికివని చెప్పుదురు.

కడు+అడవులు=కట్టడవులు; అట్లే, కడు+ఎదురు=కట్టెదురు; (ఇట్టి మార్పులు పొందుమాటలుమఱికొన్ని యూహింపుము.)

ముదుకఁడు=వృద్ధు- అనఁగా ముదుమిగలవాఁడు. అందువలన మంచి చెడ్డలనుసరిగా నాలోచనచేయలేఁడని.

కట్టిఁడి = కఠినుఁడు.

24. పడరాని పాట్లుపడి - వాడుకలో మాట.

25. వెడఁగుఁదనము - వెడఁగు=వెఱ్ఱి; 'తనము' అనగా నర్థమూహింపుము.

" ఒప్పులకుప్పలు-సౌందర్యమునకు నిధులన్నమాట.

" ముది=ముదిమి; ముదుసలితనము.

26. ఆలి-వాడుకలోని మంచిమాట ఏది? సామెతలో 'ఆలికన్నము పెట్టడం ఊరికి ఉపకారమా?'

బేల = వెఱ్ఱి.

ఇసీ=ఛీ!

అట్టు-వాడుకలో

'అవ్వ, అట్టు' అందుము.

అంతు=అల్లరి.

## 2. లంకాదహనము.

1. రాకాసి, రక్కసి = 'రాక్షసీ' అనుదాని వికారములు.

దొర=ప్రభువు. 'వెలమదొరలు' అన్నచోటను ఈఅర్థమే.

రాకాసిదొర-ఎవని కీ పేరువాడఁబడినది ?

బొమలు-కనుబొమలు- ఎందు కదరుచున్నవి ?

ప్రేలు- ఇక్కడ చక్కగవాడఁబడినది. వాడుకలో 'వీడుమహా పేల్తున్నాడు.'

2. కొమ్మమెకము = (కొమ్మలనుండు, మృగము)=శాఖామృగము; హనుమంతున కిట్టి పే రెందుకువచ్చినది?

అడలు=వాడుకలో 'హడలు', ('హడలిపోవడము' అడలుట).

• తావి మల చక్కిరాయఁడు - దక్షిణ దిక్కునకు రాజు-యముఁడు; (తక్కిన దిక్కుల కెవరు?); ఈతనిలోకము యమలోకము ( = నరకము); చచ్చినవారిచటికిఁబోదురు. ఈదక్షిణదిక్కుననే మంచిగంధపు చెట్లు పుట్టు మలయ పర్వతమున్నది. ఆపర్వతమున నాచెట్లుండుటవలనపరిమళము అచటినుండి వచ్చుచుండును. తావి=వాసన; మల = టాయి, కొండ; చక్కి = దిక్కు; రాయఁడు = ప్రభుఁడు. మాటకంతకును 'యముఁడు' అనికుదురునా? ఎట్లు? 'తావి... అనునపుఁడు'-తాత్పర్యము? 'పంపుఁడు', 'యమలోకమునకుఁ బంపుఁడు'.

3. ఆ + తఱిఁ=ఆ+సమయమున. ఇందు రాయబారులనుగూర్చిన యేధర్మము చెప్పఁబడినది?

4. కినుక = కింక=కోపము. వెత=వ్యథ = బాధ.

గట్లసూడు—గట్లు=కొండలు; సూడు=శత్రువు. పూర్వము కొండలకు ఱెక్కలుండెడివనియు, అవియెగిరి చాలనాశమునొందించె ననియు, అప్పుడు ఇంద్రుఁడు వజ్రాయుధముతో ఱెక్కలను కొట్టివేసె ననియు, పురాణములలో నున్నది. కొండలకు శత్రువెవఁడు? వాని పగతుఁడెవ్వఁడు? ఎందువలన?

5. ఔఁగాదనక - ఔను, కాదు, అనక; వాదించుకొనక; మాఱుమాటాడక. విదివిదులను-'విధివిధిని' అనఁగా ప్రతిషేధిని.

7. నిప్పుకలు - నిప్పు+టాయి; అనఁగా ఏటాయి?

కప్పుఁ+తెరువు =ఆకాశ+మార్గము; అంతరిక్షము.

జాణ=అనఁగా 'నేర్పరి':'గొప్ప' యని తాత్పర్యము.

8. సోఁకు = రాక్షస; తొయ్యలి= స్త్రీ.

దుక్కిచాలు...కడకు = సీతయొద్దకు. ఈ యర్థము ఎట్లు వచ్చినదో విడఁదీసిచూడుము. యజ్ఞముకొఱకు భూమి దున్నఁగా, ఆ దుక్కిచాలులో సీతదొరకినది. అందువలన 'దుక్కిచాలు' అను అర్థము కల 'సీత' అనిఆమెకు పేరుపెట్టిరి. (ప్రోయాలు= స్త్రీ). కడకు=వైపునకు, సమీపమునకు. ఇంతపొడుగు చిక్కుమాట లెందుకు వేయఁబడెను. ఈ కవి

నియమమేమి చేసికొనెను ?
మెలంతుక - స్త్రీ.

9. ఉసులు=ప్రాణము.
తెక్కలిదయ్యంబు = మాయ, (దొంగ) దైవము; దైవమనక, దయ్యమనుట ఎందువలన ? దానివికారమేయిదికదా?
అక్కటికము-కనికరము.

10. చేదోయి=చేయి+దోయి = చేతులురెండు.
అంటరానివేల్పు - వేల్పు=దేవత; దేవుఁడు ; అంటరానిదేవుఁడు=అగ్ని.
ఎందుకు అంటరాదు ? ఈతని సంగడీఁడు (సహవాసముగా నుండువాఁడు) గాలి-(=విన్నుచూలి). హనుమంతుని తండ్రిఎవరు ?
విన్ను, చూలి - (ఆకాశమునకుఁ, బుట్టినవాఁడు) గాలి; ('ఆకాశాద్వాయుః'--అనివేదము.)
కన్నాకు- శ్రేష్ఠుఁడు. (కన్ను+ఆకు - నప్పైనఆకు; తములపాకుల కట్టకుఁ బైనెట్ట యాకుండునో జూచినఁ దెలియును.)

11. హనుమంతునకు- ఏ నియమము కవి ఇచటవిడిచినాఁడు? ఎందువలన?
ప్రాఁతమినుకులు=వేదములు; నుడువులు=మాటలు.
గొడఁగిన- వాడుకలో 'గొణిగె సరకె'; అనఁగా, హనుమంతుఁడు ఏదియో వేదమంత్రమును జపించెనని తాత్పర్యము.
బమ్మ = బ్రహ్మ; 'బొమ్మ' అనికూడ వికారము. బ్రహ్మాస్త్రము వలన కట్టఁబడఁగా, నిప్పుడు, మంత్రజపమువలన ఆకట్లు వీడెను.

12. తులువ-నీచపు ; తొలివేలుపులు-మునుపటిఅనఁగా మొదటిదేవతలు=రాక్షసులు. రాక్షసులు మొదటదేవతలలోనివారే,కృత్యములను బట్టక్రూరులైరి.
గాడుపు+చూలు=గాలికొడుకు=హనుమంతుఁడు. మఱియొకకొడుకెవరు?

13. లంకను కాల్చువర్ణన చిన్న వాక్యముల నెందుకు చెప్పఁబడినదియో ఊహింపుము; నిప్పుతోఁ బాడుచేయుటకు వాడినమాటల పట్టికను గూర్పుము.
చూఁడి=కాల్చి.
తత్తడి, నెలవులు = గుఱ్ఱాల, సాలలు.
విడిముడి పట్టులు=ధనపుకొట్లు.
గట్టువిలుకాఁడు=కొండవిల్లుగాఁగలవాఁడు, శివుఁడు. ఈదేవుఁడొకప్పుడు.

రాక్షసులపట్టణములమూఁటిని (త్రిగ= మూఁడు, పట్టణములు=ప్రోళ్లు, త్రిపురములని కూడ వీనినే యందురు.) పాడుచేయ దలఁచి, మేరువు పర్వతమును ధనుస్సుగా చేసికొని విష్ణుదేవుని బాణముగా సంధించి, ఆరాక్షస సంహారముచేసె నఁట. ఆపట్టణము లప్పుడు కాలినట్లే, ఈలంకాపట్టణమును ఇప్పుడు కాలెనని తాత్పర్యము.

రాకాసి+వీడు (=పట్టణము)-ఏది ?

నేలకాన్పు = పుడమికాన్పు = భూపుత్రి = సత.

14. 'ఇదె'—వాడుకలో 'ఇదుగో' అని చిటికె వేయుదురు.

ఎలనాఁగ- స్త్రీ).రో-పిలుచునప్పుడు వాడుదురు-అక్కరో=ఓఅక్కా.

దొయి=దోయి, 'ద్వయీ' అను మాటకు వికారములు.

---

## 3. శ్రీరామపట్టాభిషేకము.

1. విభీషణుని ఎచట స్థాపించెను?

పుష్పక + ఆరూఢుఁడు=పుష్పకము (ఒక విమానము)+ఎక్కినవాఁడు.

సోనలు=జల్లులు.

తెరువు=మార్గము.

2. వీనులవిని—'వీనులు' అనియేల చెప్పవలెనా? ఎందుకు చెప్పఁబడినది?

పాదుకలు=పావలు (పాంకోళ్లు, అని వాడుక).

3. నొసలు-శిరస్సులో నేభాగము ?

తచ్చరణ... జల్లికొని - ఎందుకు?ఇది ఏమి సూచించును ?

సంతసంపుఁ గన్నీరు - సంతోషపుకన్నీరు ( = ఆనందబాష్పములు) ఎట్లుండు నందురు ? దుఃఖపుకన్నీరో? కాళ్లుకడుగు నీటికేమని పేరు? పెద్దలువచ్చినప్పుడు చేయుమర్యాదలేవి ?

4. ఈ పద్యములోని ముద్దుమాటలు ఎంచి వ్రాయుము.

పెక్కు+నాళ్లఁగోలె - చాల + దినములనుండి.

తపము-తపస్సు; 'తపస్' అను దాని వికారములు; అట్లే మనము,మనస్సు అనునవి 'మనస్' అనుదానికి.

గతత్రపుఁడు-గత = పోయిన, త్రప=సిగ్గు ; అంతకును 'పోయిన సిగ్గు కలవాఁడు'. అనఁగా, 'సిగ్గువిడిచినవాఁడు.'

5. శ్రీరామ పట్టాభిషేకమను పటమును చూడుము. ఈపద్యమున చెప్పఁబడినరాజచిహ్నములను గుర్తింపుము.

కవ-(కవలపిల్లలన్నచోటవలెనే)జత.

దెస='దిస' దిశ అనుమాటకువికారములు; 'దిక్కు' అని అర్థము. (దిస, మొలవాఁడు'— సంస్కృతము 'దిగంబరుఁడు).

కపిరాజు, రాక్షసరాజు - ఎవరు?

వెనుక నీరాజులెవరు?

వీవ-'వీచు' అనుధాతువు యొక్క రూపము.

పావాలు-పావలు=పాదుకలు.

తేర-'తెచ్చు' ధాతువుయొక్క రూపము.

జలపాత్ర-ఇది యెందునకవసరమైనది?

కేడెము-'ఖేట' అనుదానివికారము; 'డాలు'.

గ్రహములెల్ల ... చంద్రుపగిది - వెన్నెల రాత్రులలోఁ బ్రకాశించువానిని చూచినయెడల, అన్నిటిలో మిగుల కాంతికలది చంద్రబింబము; తరువాత శుక్రుఁడు, గురుఁడు, మొదలగు గ్రహములు. తరువాత నక్షత్రములు- ఇట్లుమనకంటికి కాంతి లోనివియీ మూఁడు తరగతులఁ గనఁబడును. అందువలన, చంద్రునిగ్రహరాజు అనియు, నక్షత్రరాజు అనియు, అందురు. కానివాస్తముగ చంద్రుఁడుపెద్దయా? గ్రహములు పెద్దలా? నక్షత్రములు పెద్దవా? ఇట్లు మనకుఁ గనఁబడుటకు కారణమేమి?

7. మహారాజురాకకు పట్టణ మెట్లలంకరించిరో, ఆవర్ణనమును బాగుగఁ తెలిసికొనుము.

రంభా-అరఁటి; 'రంభ' అనుమాటకింకొకయర్థమేమి?

చీరలు- గ్రంథములలో నీమాటకు 'బట్టలు' అనియర్థము. వాడుకలో 'మగఁడుగల స్త్రీలు మాత్రము ధరించు బట్టలు' అని.

కలవడంబులు-జెండాలు.

మేలుకట్లు-చాదినీలు.

8. దుమదుమలు-పంకిలములు; బాడికలవి.

రమణుఁడు...రమణయపోలెక్ - భర్తవచ్చునప్పుడు సంతోషించు భార్యవలెనే. రాజు పట్టణమునకు భర్తయనివాడుకకదా.

9\. రథగజాశ్వసుభటులు - వీనికి నాల్గింటికిని చేరి **చతురంగబలము** అని పేరు. ఈ పేరుగల ఆట(వాడుకలో 'చదరంగము')లోని జంతువుల పేళ్లేమి? రాజు, మంత్రి, కాక మఱి యేజంతువులున్నవి? అవి యిచటఁ జెప్పఁబడినవియే కదా.

చంద్రుఁడు...జలధిభంగి - పూర్వము పాలసముద్రమును మందరపర్వతమను కవ్వముతో దేవతలును రాక్షసులును (పాలకుండలోని పాలను కవ్వముతో తఱచినట్లు) తఱచిరి. అందునుండి అనేకవస్తువులు పుట్టెను. ఒకఁడు చంద్రుఁడు. కనుక, సముద్రుఁడు తండ్రి యనియు, చంద్రుఁడు కొడుకనియు, చంద్రుఁడు ఉదయించినప్పుడు (కొడుకు రాకకు సంతోషించు తండ్రివలె) సముద్రుఁడు (అనఁగా సముద్రమే) పొంగుననియు, చుట్టఱికములఁ జెప్పుదురు. సముద్రము పూర్ణిమనాఁడు చంద్రోదయము కాఁగా నేపోటు ఎక్కును. దీనికి వాస్తవమైన కారణము భూగోళములోఁ జదువుకొనుఁడు.

పాలసముద్రము - కాక, ఇంకనెన్ని సముద్రములున్నవందురు? అవి ఏవి? ప్రస్తుత పు భూగోళములో నీసముద్రముల నెచటనైన గుర్తించినట్లు చెప్పిరా?

11\. ఉత్సవము ఊరేఁగునపుడు జను లనుకొను మాటలు ఈపద్యమునఁ జెప్పఁబడుచున్నవి. పురజనులు ఎత్తైనచోటుల (మేడలు, మిద్దెలు మొదలగు వాని)పైనిలిచి వ్రేళ్లతోఁ జూపుచు చెప్పుకొనుచున్నట్లు వర్ణింపఁబడినది. ఈరామక థనిదివఱకే పౌరులందఱు వినియున్నారనియూహింపవలెను. ఈపద్యములో సొగసేమి? ఊహింపుము. అబల - (బలము లేనిది - అనఁగా) స్త్రీ).

ఇంద్రారి - (ఇంద్ర+అరి) - ఇంద్రునకు శత్రువు, ఎవరు? రాక్షసులందఱు దేవతలకు శత్రువులు; వారిరాజు వీరిరాజునకునట్లే.

కపివరుఁడు - ఎవరినిగూర్చి ఈమాట?

మరుత్ + సుతుఁడు = వాయువు + కొడుకు - హనుమంతుఁడు.

13\. రాజసదనము (అనఁగా, రాజుగారిలోగిలి) యొక్క వైభవమును బాగుగ గుర్తింపుము. ఏరత్నములిందుఁ జెప్పఁబడినవి? తక్కినవాని పేళ్లేమి? ఈ రత్నముల రంగులేమి?

15. ఈమర్యాదలు వీరడవికిఁ బోయినప్పుడును జరిగినవే. (పుట 4, పద్యము - 20.)
తమతల్లికి వందనమాచరించి - ఇది మరల నేల ?

17. పెద్దలు ప్రేమతోఁ బిల్లలనాదరించు విధము చూడుము.
నేత్రధారలక + తోఁగఁగఁ జేసిరి:- ఈ బాష్పము లెట్టివి ?.
వెడలిన ...నటంచు - బిడ్డలు తల్లులకు ప్రాణములవంటివారు. వారు అడవులనున్నప్పుడు తల్లుల ప్రాణములు వెడలి నట్లుండెను. ఇప్పుడు ?

18. జటాబంధంబు — ఎప్పుడుకట్టఁ బడెను ? ఎందులకు ?
బృహస్పతి-దేవతల గురువు. అందుననే ఈతఁడు గురుఁడని కూడ చెప్పఁబడును.
కమ్మనిపువ్వులు - 'కమ్మని' యనఁగా నేమి తాత్పర్యము ? వెనుకటి 1వ పుట, 1వ పద్యములోని 'కమ్మనిపలుకులు' అన్నచోట ఏయింద్రియమున కీ 'కమ్మన' తెలిసినది ?

19. రాజునకు ముఖ్యధర్మమేమని చెప్పఁబడినది ? తండ్రులు చేయవలసినయే పనులు రామచంద్రుఁడు చేసెను ?

20. ఈ పద్య మెందులకు మనోహరముగ నున్నదియో, ఊహింపుము. స్త్రీలకు శ్రేష్ఠమైన సొమ్ములిందు ఏమని చెప్పఁబడినవి ? సీత మహారాజు భార్యవలెనున్నట్లు చెప్పఁబడినదా ? ఇందలి ధర్మము లందఱు స్త్రీలును జరపఁదగిన వగునా, కాదా ?

---

## 4. శ్రీ కృష్ణుని దుడుకుతనములు.

ఈ పనులు చేయునప్పుడు శ్రీ కృష్ణుని వయస్సేమైయుండును ? ఈ భాగములోని పద్యములు చదువునప్పుడు నీకు మనోహరముగఁ గన్పట్టువానిని గుర్తించి, ఎందులకట్లున్నవో ఊహింపుము. గోపికలు యశోదతో నీ దుండగములఁ జెప్పునప్పుడు, పద్యములు మాటలాడుచున్నట్లు నడచుచున్నవా ? ఎందువలన చిన్న తేఁటమాటలు వాడఁబడినవో ఊహింపుము. వీనికిని, గడచిన భాగములలోని మాటలకును భేదమున్నదా ? పాలుతేవు (1 పద్యము), నీబిడ్డఁడు మాకడవలోనున్న మంచికాఁగినపాలు......నడచె.

(2 పద్యము); పాపఁడు, తల్లీ (3 వ దానిలో); ఇట్టి వాడుకమాటలను గుర్తింపుము.

4. పుట్టిపుట్టఁడు - 'పుట్టెనోలేదో' - వాడుకలో 'ఇంకా పుట్టాడో లేదో కాని'.

ఈ పద్యమందలి ముద్దుమాటలు గుర్తింపుము.

చేరలఁబట్టి - ఇది యెందునకు వివరింపఁబడినది.

11. లచ్చి - 'లక్ష్మి' అనుదాని వికారము; అనఁగా - ఐశ్వర్యము. కుడుతురు కట్టుదురు గాక - వాడుకలో 'తనకు ఉంటే తినాలి కాని, అందర్నీ అంటే పడతారా ఏమిటి?'. 'కుడుతురు' అనుమాట యిప్పటికిని సామెతలలోను, కొన్ని మాటలలోను, మంచియర్థమున వాడఁబడుచున్నది. 'కుడిచికూర్చుండలేక', 'మలికుడుపు', మనుగుడుపు.

12. ఈపద్యములోని మాటలసొంపు చూడుము.

## 5. శ్రీకృష్ణుఁడు గోపకులతో బంతిచేల్దులు గుడువ వనమున కేఁగుట.

గోపకుల వ్యాపారములను వినోదములను గుర్తింపుము.

1. బంతి - 'పఙ్క్తి' అనుదానివికారము.

శృంగంబులు పూరించుట-ఎందులకు?

ఇందలి మాటల పొందిక చూడుము:— పాడుచు, ఆడుచు; కూయుచు, చేయుచు; పాఱుచు, దూఱుచు; కడచుచు, నడచుచు; నిలుచుచు, అలఁచుచు; తోఁగుచు, ఊఁగుచు; డాగుచు, ఏగుచు; ఎక్కుచు, మొక్కుచు, బొక్కుచు, నిక్కుచు; నవ్వుచు, దువ్వుచు; చెలంగుచు, మెలంగుచు; వ్రాలుచు, సోలుచు.

2. ఇందు గోపకుల యాటలు వర్ణింపఁబడినవి. వారి యుల్లాసము, మాయలేని కొంటెతనము, స్నేహభావముతోఁ గూడినచనవు, మొదలగు గోపకుల గుణములను గుర్తింపుము.

## 6. గోపాలురు బాలకృష్ణునిఁగూడి చల్దులారగించుట.

1. తమ్మికంటి-తమ్మి ( = తామర)వంటి కన్నులు (గల)వాఁడు; అనఁగా తామరపువ్వుయొక్క రేకులవలె, సోగయు, కాంతియును. కన్ను

లకు కలదు. శ్రీ కృష్ణునికన్నులట్టి వని ప్రసిద్ధి ; కనుకనే 'వన జాక్షుఁడు' అని కూడ చెప్పఁబడెను. (పుట 17, పద్యము 5)

ఈ వచనమందు వచ్చిన యక్షరమే మఱి మఱి వచ్చునట్టి మాటల కూర్పు గుర్తింపుము. (తమ్మి - తమ్ము ; కంటె, యింటె ; నిచ్చ, మెచ్చు ; గాలి, ఓలి ; జల్లు, పెల్లు ; కొలంకుల, కెలంకుల ; వ్రేఁగు, వీఁగు; పట్టు, చెట్టు; ఒప్పు, తిప్పు, విప్పు ; పిచ్చిలింప, నెచ్చెలులకు).

2. ఈ పద్యమునందలి నడకకును క్రింది 4 వ పద్యముయొక్క నడకకును భేదమున్నదా? ఇందు మాటలాడుచున్నట్లు చెప్పఁ బడినది ; కావున చిన్న చిన్న వాక్యములున్నవి; అందు అంతయు నొకటే వాక్యము. మఱియు నీపద్యమునందు చిన్న తేఁట మాటలున్నవి ; అందన్నియు నట్లు లేవు.

3. ఈ వచనమందును మొదటి వచనములో వలె మాటలకూర్పు పరిశీలింపుము

4. తామర పువ్వులోని తేఁకులకూర్పు, అందులోని దుద్దును, పరిశీలించిన యెడ దీనియభిప్రాయము బాగుగఁదెలియును. ఈ సంఘములోఁ తేఁకులవలె నెవరుండిరి? దుద్దువలె నెవరు ? బాలకృష్ణుఁడు గోప కులమధ్యమున్నట్లు గుర్తింపుము.

5. బంతి పెట్టినప్పు డిట్టి వినోదములు స్వభావము కదా! ఇంత కొంటె తనమును, అల్లరియును జరగినను, స్నేహభావమునకేమైన కొదువకలి గెనా, లేక, అది చాల హెచ్చెనా, ఊహింపుము. మాయలేక, మనసునిండినప్రేమతో, పెద్దపోకిళ్లులేక, బడాయిలేక, సామాన్యవస్తు వులతో గొప్పసంతోషమును బొందుచున్న యీ గోపకుల వేడుకల కును, ఇప్పుడు సంఘములు పట్టణములలో విజృంభణముగఁ జేయు పెద్దవిందులకును వేడుకలకును భేదమును గుర్తించి, ఏది మనసునకు సుఖదాయకమో విమర్శించుకొనుము.

6. బాలకృష్ణుని యీ విగ్రహము బహు రమణీయముగను, కన్నులకుఁ గట్టినట్లును వర్ణింపఁబడినది. ఈ పద్యములోని చక్కనిముద్దు మాట లను గుర్తింపుము. ఆమాటలు ఈ వర్ణనను ఎట్టివన్నె తెచ్చినవో ఊహింపుము.

## 7. ద్రౌపది కృష్ణునితోఁ దనభంగపాట్లు సెప్పుట.

ఈ ప్రసంగ మేసమయమున జరగెనో తెలిసికొనుము. భారతము వచనముగ వ్రాయఁబడినది. చదివినఁ దెలియును.

ఈ భాగమునందు తత్సమపదములను ప్రతిపద్యమున లెక్కించి, తక్కిన జాతిపదములకంటె హెచ్చో తక్కువో కనిపెట్టుము.

1. మోము — మొగము — 'ముఖము' అనుదాని వికారములు. దైన్యము — దీనత్వము (=చిన్నతనము) 'దీన' అను సంస్కృత రూపము నుండి భావమును తెలియఁజేయు నర్థమున వచ్చిన రూపములు— తద్ధిత రూపము లనఁబడును.

   గద్గద—ఇది దుఃఖము కల్గినప్పుడుమాటలాడినయెడల కంఠమున నేదియో యడ్డుకొని నట్లుండి మాటలు గద్, గద్' అని వచ్చును. ఈ చప్పుడునుబట్టి గద్గదధ్వనియని ఆధ్వనికిఁ బేరు వచ్చినది. ఇట్టివే 'భుస్సు' మను, 'గుబ్బు' పెట్టు, 'పెటపెట' లాడు మొదలగు మాటలు—వీనికి 'అనుకరణ' శబ్దములని పేరు.

2. అంతలు— ఎంతలు ? చేతులతో నెట్లు చూపియుండును? ఊఱట— 'ఊఱడిల్లు' అనునర్థముగల 'ఊఱడు' అను ధాతువునుండి వచ్చిన నామవాచకము—ఇది 'కృత్తు' అనఁబడును.

3. ఈ పద్యమందలి తత్సమపదముల లెక్కింపుము; అవి వాడుకలోని వని గుర్తింపుము.

   బన్నము— భంగము. 'భగ్న'మను మాటయొక్క వికారము.
   ఎఱుంగమి పెట్టరె?— తెలివితక్కువ అనకుందురా ? ఎవరు?
   వీరుచాలరైరి—వాడుకలోనిచక్కని ప్రయోగము—'సమర్థులుకారు' అన్నమాట.
   నాన-సిగ్గు.

4. బ్రాహ్మణులకును, క్షత్రియులకును, ఏభేదము సూచింపఁబడినది ?

5. ఓట=భయము, సంకోచము. తుదిపాద మందలి భావమేమి ? ఇందు ద్రౌపదియొక్క యేగుణము తెలియనగు ?

6. ఏను— నేను; అట్లే ఈవు — నీవు.

   వలవదు—వలదు—వల్దు—వద్దు—ధాతు వేమి?

ఒకభంగిన్ — ఒకవిధముగా. వాడుకలోని మాట — 'ఈపం, డంత తియ్యఁగాలేదు. ఒకవిధముగా నున్నది' అన్నట్లు, అసంతుష్టిని సూచించును. 'కక్కుర్తికి బాగుండును'. అన్నమాట.

వలచి—వలవదు అను మాటకేమైన దీనితో సంబంధమున్నదా? ఈ పద్యముయొక్క తాత్పర్యమును వాడుకలోనిమాటలు పూర్తిగా నుపయోగించి చెప్పుము.

8. ఈ పద్యముయొక్క తాత్పర్యమును వ్రాయుము.

మాఱటనోరిదాన—'మాఱటనోరు' అనఁగానేమి? 'మాఱటతల్లి', 'మాఱటతమ్ముఁడు' మొదలగుచోటుల 'మాఱు' అనుదానికి ఈరూపముకనఁబడుచున్నది; 'మఱియొక' అనియర్థము. 'మాఱుదారి' —మాఱుమొగము' అనుచోట 'మఱియొక' అనఁగా 'పెడ' యనియర్థము. అట్లేయిచట 'పెడనోటిదానను' అనియర్థము. వాడుకలో ''నానోరుతిన్నగారాదు' అని యందురు—'కోపావేశమున దురుక్తులు (కాఱులు) చెప్పుదును' అనితాత్పర్యము. కూలంకష వ్యాఖ్యయందు ''మాఱటనోరిదాననై= చెప్పినమాటనే తిరిగి చెప్పుదాననై'' అనియున్నదని వినవచ్చె. ఇది సంస్కృతమున—

శ్లో॥ ''పునరుక్తంచ వక్ష్యామి విస్రంభేణ జనార్దన।
కాను సీమంతినీ మాదృక్ పృథివ్యామస్తి కేశవ''. ॥

అను దానిలోని'' పునరుక్తం'' అనుశబ్దము ననుసరించి యుండనోపు. కాని ఆశ్లోకమునకు నీపద్యమునకు ననుకరణమంతగాలేదు.

కర్జము—'కార్యము' అనుదాని వికారము.

కర్జము, ఎగ్గు — వాడుకలో 'మంచి, చెడ్డ', 'అయివచ్చేది, పైన చ్చేది.'

అల్క—అలుక— (కృత్తు); ఏధాతువునుండి?

వెఱ్ఱిఁడి—వెఱ్ఱివాఁడు (లేక, వెఱ్ఱిది).

వెండి—తిరుగ.

9. సహజన్ములు—సహ(కూడ)జన్మము(పుట్టువు)కలవారు: అనఁగా, సోదరులు.

11-13 ఈ పద్యము లెట్లు వినువారికిఁ గోపమును, జాలిని వృద్ధి పొందించునో గుర్తింపుము.

11. నెయ్యము — 'స్నేహము' అను మాటకు వికారము ; 'స్నేహము' అనఁగా 'చమురు' అను నర్థమువ, 'నెయ్యి' అను వికారము కల్గినది.

ఒకండు — తాత్పర్యము? అనామకుఁడు ; కళ్చన ; (వాడుకలో — 'కళ్ళన్న').

రాజసూయము — 'ఒకరాజు తక్కినరాజులనుజయించిచేసిన యజ్ఞము.'

అవభృథ — యజ్ఞముతుదిని లోపములుండు నేమోయనుభయముచే నాదోషముపోవుటకుఁ జేయుస్నానక్రియ.

12. 'ద్రౌపదీ వస్త్రాపహరణమును' గూర్చిన వృత్తాంతమును జదువుము. 'పతుల చిత్రముల యాకృతి' నెందులకుండిరి ?

13 మహాపురుషుఁడు — ఎవరు ? నిజమైన మహాపురుషుఁడే నా ? కామున్న నెందులకట్లు చెప్పఁబడెను ?

కోటరంబు — కోడలికము'; కోడలు చేయు నుపచారము. 'కోడలు' అను దాని తద్ధిత.

పరవుడము — దాసి చేయుపని; 'పరవు' అనఁగాకూలి, జీతము; పరవుఁడు — జీతగాఁడు; సేవకుఁడు. ఆపని 'పరవుడము,' 'పరవుటము.' తద్ధితరూపములని గుర్తింపుము.

15- ద్రోవది — 'ద్రౌపది'కి వికారము.

వల (పల) — కుడి ; వలపల × దాపల.

అసిత......భుజంగము — నల్లని పెద్దత్రాఁచు.

ఈ పద్యమందలి తత్సమ పదముల లెక్కించి, అంత హెచ్చుగ నుండుటకుకారణ మూహింపుము.

17;18. — దీనియందలి రసమును గ్రహింపుము ; ద్రౌపదియొక్క యావేశమును గన్పట్టుము.

18. అలుపాలు = అల్పగుణులు, కొద్దివి.

కాల్పనే — జాతీయమైన మాట — 'స్వర్థ' మని తాత్పర్యము.

కన్నార — ఇదియు మంచి జాతీయమైన మాట.

19. రక్కసతాల్మిఁ — హెచ్చగు శాంతముతో; గొప్పఓర్పుతో. రక్కస, రక్కసి—'రక్షస్' అనుదాని వికారములు; వీనికి 'రాక్షసుఁడు.' అని యర్థమైనను, ఇచట 'హెచ్చైన' అనియర్థము. అట్లేవాడుకలో'రాక్షసి తిండి', 'రాక్షసిపట్టు', 'రాక్షసికోపం' మొదలైనవి. ఈరెండర్థములకు సంబంధమెట్లో ఊహింపుము.

చిచ్చోపడింగట్టిన యట్లు—చక్కని జాతీయమైన మాట. నిప్పొడిలోఁ గట్టిన నేమగును? సుఖమా, దుఃఖమా? ఈమె కోపము మనసుననిల్పు కొనియోర్చుకొనుట నిప్పునొడిలోఁగట్టుకొనుటయని చెప్పుచున్నది. — 'కోపము'నకును 'నిప్పు'నకును పోలిక యెట్టిదో కనిపెట్టుము.

---

## 8. శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట.

ద్రౌపది కోరినదేమి? కృష్ణుఁడెట్లామెకు శాంతి కల్గించుచున్నాఁడు.

2. కళత్రంబు—కళత్రము (= భార్య) —ఈశబ్దము నపుంసకలింగముగ సంస్కృతమున వాడఁబడినది; అందు వలన ప్రాణము లేని వాని కేళ్లకువలె, 'ము' వర్ణము కొనను జేర్పఁబడి తెలుఁగున వాడఁబడు చున్నది. —ఇట్లనే పుంలింగముగా నుండఁదగి, 'స్నేహితుఁడ'ని యర్థమిచ్చు 'మిత్ర' శబ్దము సంస్కృతమున నపుంసకముగ నుం డుటవలనఁ దెలుఁగున'మిత్రము' అని వాడఁబడుచున్నది. ('మిత్రుఁడు అని కూడ వాడుక కలదు).

కలకలనవ్వు— 'కలకల' అను ధ్వనినిబట్టి వచ్చినమాట. ఇట్టి వాని కేమనిపేరు?(20వ పుట 1-వపద్యము; 'గద్గద' అనుదానిటీక చూడుము)

3. యమ, మహిష (= దున్నపోతుయొక్క), ఘంటికా (చిఱుగంట ల) నాదము, వినక (= వినుటకు), కౌతూహలంబు (కుతూహలము, ఉత్సాహము), తలకొనెడు (=కనఁబడెడు) - అనఁగా 'యముని పోతు మెడలోని గంటలచప్పుడు వినవలెనని కోర్కెగల'. ఈ కో ర్కె ఎచ్చటికిఁ బోయినఁదీరును? అచటి కెవ్వరుపోదురు? పాపు లందఱును చచ్చి యమలోకమునకుఁ బోదురని హిందూ మతము చెప్పుచున్నదికదా; దీనినిబట్టి తాత్పర్యము నూహింపుము.

4. మేరువు తిరిగెనేని— మేరువు కొండలన్నిటిలో మిక్కిలి గొప్పదని మనవారి యభిప్రాయము, ఇట్టి మహాపర్వతము తిరుగునా? తాత్పర్య మేమి? ఇట్టివి మఱికొన్ని చెప్పుము. 66 వ పుటలో 'వారిజగర్భుని వ్రాఁత మొదలు 6 పంక్తులుచూడుము.)

## ౯. భీష్మ పరశురాముల యుద్ధము.

ఈయుద్ధమందు వాడఁబడు నాయుధములెట్టివో, యుద్ధమెట్లు జరిగెనో గుర్తింపుము. ఇప్పటికాలమందు యుద్ధమెట్లు జరుగునో తెలిసికొని భేదము లను గ్రహింపుము. యుద్ధధర్మములనుగూడ గ్రహింపుము.

2. గురుఁడు - గురువు; 'గురు' అను సంస్కృతశబ్దము యొక్క తెనుఁగు రూపములు, ఉకారాంతపుంలింగములకిట్లు రెండురూపము లుండును.
కోదండవిద్య - విల్లు నుపయోగించువిద్య; ధనుర్విద్య.
ఈరసము-'ఈర్ష్య' అను సంస్కృతశబ్దముయొక్క వికారము.

3. కోపశిఖి = కోపమనెడి శిఖి (నిప్పు). శిఖకలది శిఖి; నిప్పనకుమంట శిఖవంటిది; శిఖియనఁగా నెమిలియనియు నర్థము. ఎందువలన?

4. పర, అనురక్త, చిత్త(ము కలది).
నీచేత నెట్టైన—ఏరెండు విధములఁ గాఁదగియున్నది?

5. గర్వి=గర్వము గలవాఁడు. 'గర్వ' అను సంస్కృతముమీద తద్ధిత. అట్లనే, గుణము కలవాఁడు 'గుణి' లేక 'గుణవంతుఁడు'.
ఉత్+మద = హెచ్చైన + పొగరు, (లేక, గర్వము; అందువలనఁ గల్గు నవివేకము); ఉన్మదప్రవృత్తిక్ - గర్వివలె; లేక వెఱ్ఱివానివలె.
ఎండ్రు—కర్త?

6. కాలానలము— కాల + అనలము. (దీనికి సంస్కృతమున సవర్ణదీర్ఘ సంధి యని పేరు; అనఁగా, సమానములయిన యచ్చులు 'సవర్ణ' అచ్చులని చెప్పఁ బడును. అట్టివి ఒకటి తరువాత మఱి యొకటి యుండిన, వానికి రెంటికిని కలిసి దీర్ఘమగు నాయచ్చే వచ్చును?'ల' మీద నున్న 'అ' కును, 'అనల' అనుదానిలో మొదటి 'అ' కును. సవర్ణదీర్ఘము 'ఆ'). కాల=(ప్రళయ)కాలమందలి, అనలము =అగ్ని. లోకమంతయు యుగాంతమున నశించుననియు, అప్పుడు గొప్పయగ్ని

బయలు వెడలి యన్నిటిని గాల్చుననియు పురాణములఁ జెప్పఁబడి యున్నది.

కయ్యము = ఇప్పుడీ మాటనెవరువాడుదురు ? ఈసామెత నందలును వాడుదురు కదా—"కయ్యమునకు కాలుదువ్వుట."

మొనలేర్చి—'మొన' యనఁగా సేనయొక్క ముఖము(=ముందుభాగము). ఏర్చి = ఏర్పఱచి. అనఁగా సైన్యమును యుద్ధమున కనువగు రీతులఁ గూర్చినిలిపి.

8. అలుకదనము — ఇచట 'తనము' ఏమి తెలియజేయును ? ఇది యే 'వృత్తి' ? (20 పుటలోని మొదటిపద్యము లోని 'దైన్యము' అను మాటక్రింది టీక చూడుము.)

చేఁత = చేయుట—(ఏవృత్తి?)

9. త్రయి= మూటి సమూహము; మూఁడులోకముల సమూహము. సామాన్యముగా 'వేద' మని యర్థము (మూఁడు వేదముల సమూహము కావున).

10. బలము = సైన్యము.

11. మర్యాదలను గనుఁగొనుము.

భాగీరథి = 'భగీరథుఁడు' తెచ్చినదికావున 'గంగ' కీ పేరువచ్చె. భీష్మునకును గంగకును సంబంధ మేమి ?

పిక్క = వెనుదీయుట; తగ్గుబాటు; మానఁబూనుట యని తాత్పర్యము.

అగ్గించి=(స్తుతించి), నమస్కరించి— ఈపనులెట్లు చేయుదురు? ఇట్టిచో నే బాణములు వేయుదురు?

12. ఆకసము = 'ఆకాశ' శబ్దవికారము.

అరదము = 'రథ' శబ్దవికారము.

అచ్చెరువు = 'ఆశ్చర్య' శబ్దవికారము.

13. నో(నొవ్వ) నాటు (=బాణములువేయు).

14. భల్లంబు = (ఇచట) బాణము ; 'బల్లె' మనియు నర్థము. బాణమని యర్థముగల మాటలను దండగాఁగూర్పుము.

సాంద్ర (గాఢమైన) జ్యానాద (వింటిత్రాటియొక్క-ధ్వనితో) భరిత (నిండిన) రోదసి(భూమికిని యాకాశమునకును మధ్యభాగము గలది).

తాత్పర్యము-అతని వింటిత్రాడు లాగినప్పుడెల్ల గొప్పధ్వనిపుట్టి నలుదిక్కుల నిండించెడిది.

తదీయోగ్రచాపము - తదీయ = (అతని), ఉగ్ర = (భయంకరమగు) చాపము (విల్లు)

అతిముతి = శీఘ్రముగా.

15. ఉజ్జ్వల-(ఉత్ = పైకి, జ్వల = మండు; అనఁగా మిక్కిలి మండుచుండెడు) రోష (కోపమనెడు) మహా (గొప్ప) అనల (నిప్పు యొక్క) అర్చులు (మంటలు, కాంతులు).

ఒండొండ = క్రమక్రమముగా.

గుణము = వింటిత్రాడు.

మార్గణము = బాణము.

వియచ్చరప్రకరము - వియత్ (ఆకాశమున) చర (తిరుగువారి) ప్రకరము (సమూహము)= దేవతలగుంపు. ఆకాశమున నెందులకుఁ దిరుగుచుండెడిది ?)

16. ఊలక = 'లక్ష్యముచేయక'. 'ఊలు' ధాతువు.

నారసమ్ములు = బాణములు.

గాత్రము = శరీరము.

17. ఉచ్చిపోయిన = నాటి వెడలిన.

శోణితము = రక్తము.

కెంజాయ= కెంపు+చాయ; (ఎఱ్ఱనికాంతి).

క్రొమ్మావి = క్రొత్త+మావి (మామిడిచెట్టు).

భార్గవుండు—భృగుని వంశపువాఁడు;పరశురాముఁడు.

18. మూర్ఛాయత్తుండు = మూర్ఛ (కు)+ఆయత్తుండు (స్వాధీనుఁడు); 'సవర్ణదీర్ఘసంధి'.

సొగయు = మత్తిల్లు; సోలు.

ఉద్వృత్తక్షత్రియధర్మోపాత్తంబు—ఉత్ +వృత్త(ఉన్నతమైన, గొప్పదియగు)+క్షత్రియధర్మ(మువలన)+ఉపాత్తంబు(పొందఁబడిన);'తేజము' నకు విశేషణము.

ఒల్లఁబాటు = ఇష్టముకానిది. క్షత్రియధర్మమువలనఁ బరాక్రమముఁ జూపి శత్రులనొప్పించుట యీసమయమున (అనగా పరశురాముఁడు మూర్ఛనొందిన సమయమున)మంచిదిగాఁ గనఁబడలేదు.

19. గర్హించు = నిందించు. (గర్హ = నింద).

20. ఏఱు+పాఱుతెంచున్ +ఎసకము + ఎసఁగ=నది, ప్రవహించు, ఉద్రేకము, ఒప్పఁగా.

21. మరుదస్త్రము — మరుత్ = వాయువు; మరుదస్త్రము,= వాయవ్యాస్త్రము; ఇదివేయఁగనే పెనుగాలివీచి,అన్నిటినీడ్చికొనిపోవునఁట. లేక మరుత్ = దేవతల, అస్త్రము; అనఁగా ఈయస్త్రమువేయఁగనే దేఃతలశక్తి బయలుదేరి శత్రుసంహారమునకు సవకట్టును; దీనిని నివారించుటకు పరశురామునిచే 'గుహ్యక' శరము (మఱియొక జాతిదేవతల యస్త్రము) ఉపయోగింపఁబడెను.

రభసము=తొందర -('స' అనునది సమాసముల మొదట ఉండి 'కూడి, కూడ' అను నర్థమిచ్చును. కావున సరభసమునన్ =తొందరతో).

ఉద్ధుర(గొప్పదైన, తీవ్రమైన) శిఖి (అగ్ని) బాణంబు (అస్త్రము). తాత్పర్యము—ఆగ్నేయాస్త్రమన్నమాట. వరుణవిశిఖము(వరుణుని యస్త్రము)-ఇదివర్షమునుగురిపించి 'ఆగ్నేయాస్త్రము' వలని మంటలను జల్లార్చును.

22. రయము = తొందర; అంబరవీధి = ఆకాశమార్గము.

23. అంత్యకాల (ప్రళయకాలమునందలి)+అనల (అగ్నియొక్క) +ఉద్దామ (భయంకమగు)+లీల (విధమున). ప్రళయకాలమును గూర్చి 6వ పద్యములోని 'కాల' అనుదాని టీకచూడుము.

నా+ఉరస్స్థలి =నాగుండె. (ఈప్రథమ ఏయర్థమునవచ్చినది?)

24. ని+శిత—మిక్కిలి, వాఁడియగు.

అచటు వాపె - అచటు పాపె; అటనుండితప్పించెను.

25. చేతనుఁడనై = తెలివితెచ్చికొని.

మత్+సూతున్ = నా+సారథిని- 'నా' అను నర్థమున సమాసమందు 'మత్' అని సంస్కృతమునవచ్చును. బహువచనమున 'అస్మత్' అని వచ్చును. అట్లె 'నీ'యనుదానికి 'త్వత్'అనియు,'మీ' అను బహువచనమునకు 'యుష్మత్' అనియు వచ్చును.

ఉన్న + ఎడ.

బాణ+పరంపరా (వరుసలలో)+ నిమగ్నున్ (మునిఁగినవానిని).

అంబ-ఈమె మన సెందులకు 'దలఁక' వలెను ?

నెమ్మనము - నెఱి+(గొప్ప) మనము. అట్లనే 'నెమ్మది' అను చోటఁ గూడ సంధి.

26. ఉపసంహరించు = ఆఁపు; నిలుపు.
రేపకడ - ప్రాతఃకాలమున, ప్రొద్దున (రేపు×మాపు)

28. శక్తి-ఒకవిధమైన యాయుధము. శక్తి+దశకము - శక్తుల యొక్క, పది; అనఁగా 'పదిశక్తులు'. దశకము అనఁగా 'పదింటియొక్క సమూహము'.

29. అస్మత్ (మాయొక్క) కరము (చేయి) -ఇచటి బహువచనము (మా చేయి) ప్రౌఢిమను సూచించును. 'అస్మత్' అనుదాని గూర్చి 25 వ పద్యముటీకలో 'మత్' అనుమాటక్రింద చూడుము.
లాఘవ+ఆ రూఢముగాన్ = లాఘవము (నేర్పు) ను గ్రహించినట్లు- అనఁగా - మిక్కిలి నేర్పుతో.
పటు (బలమగు, విస్తారమగు) + దీప్తి(కాంతిచే)+స్ఫైర (వెలిఁగెడు నని తాత్పర్యము) + అస్త్రములన్. స్ఫైరాస్త్రఅనుచో సవర్ణదీర్ఘ సంధి.)

32. మున్ను నా (నేను) కన్నచందంబున - పైని 11-వ సంఖ్యగల వచనములో 'భాగీరథి భామినీరూపంబున' అను భాగము చూడుము.
మందాకిని = గంగ.
మదీయ = నాసంబంధమైన.
రథ్యంబులు= (రథమును లాగు) గుఱ్ఱములు.

33. సారథ్యము - (తద్ధితవృత్తి) సారథిచేయునట్టిపని; రథము తోలుట. సారథి చనిపోవుటవలన స్వయముగనే రథము తోలుకొనవలసివచ్చె.

34. దర్భశయనంబున నుండి - ఎందులకు?
సురభూసురవర్గంబు = దేవతల బ్రాహ్మణుల గుంపు.
ఆజి=యుద్ధము.
పవలు = పగలు, పగటియందు.

35. గాంగేయుఁడు-గంగయొక్క కుమారుఁడు, భీష్ముఁడు. 'గంగా' అను దాని 'తద్ధిత'.
మోహన + అస్త్రము = మోహనము (మూర్ఛ) పొందించు నస్త్రము.

36. ప్రయోగ+ఉపసంహారములు = ఏయుటయు, మఱల్చుటయునో.

37. అఱ నచ్చిపోయితివి - నగము చచ్చితివి.
కవిసెన్ =ఎదుర్కొనె. ధాతువేమి ?

38. ప్రతతి = సమూహము.

40. తూఁగాడి = సోలి.
అకృతవ్రణుఁడు = పరశురాముని సారథి.

41. అలఁతి (లాఁతి) = వేఱు.
బ్రహ్మాస్త్రము - బ్రహ్మదేవతగాఁ గలయస్త్రము. బ్రహ్మబలము వలన శత్రుక్షయమగునని తాత్పర్యము.

42. తేజః+స్థగితము = కాంతితోఁ గూడినది.

43. సకల+భూత+సంక్షోభ (బాధ) + సంజనకము (పుట్టించునది).
తఱి = తరుణము; సమయము.
సంచిత + ఆవాహనము - కూర్పఁబడిన, ప్రవేశము. అనఁగా - మంత్రోచ్చారణమువలన వాయుస్త్రశక్తిని బాణమునందుఁ బ్రవేశపెట్టుట.
చర + అచర—చలించువవియు(అనఁగా - చేతనములు, ప్రాణులును) చలింపనివియు (అనఁగా. జడములు, అచేతనములు, ప్రాణములేనివి.)

44. ఉడుగుడుగు - రెండు సారులెందులకుఁ జెప్పఁబడియెను ?

46. ఇప్పరుసునన్ - ఈపరుషపు (కఠినపు) రీతిని.
పరుసపు=పరుషపు.

48. గారవమునన్ = గౌరవముతో.
తారు = తాము.

50. త్రైలోక్య (మూఁడు లోకములలోను),సమ్ (బాగుగ), ఆరాధ్యుఁడు, (పూజింపఁదగినవాఁడు.)
ఆగమ(వేద)వాక్య (ములవలె) ఉదారములు(గొప్పవి - గంభీరమైనవి).

51. దీపింపం జేసితి - దాని సామర్థ్యమును హెచ్చింపఁ జేసితిని.
జామదగ్న్యుఁడు - జమదగ్ని కొడుకు. 'తద్ధితవృత్తి.
తజ్జనకుండు-తత్ (అతనియొక్క) జనకుండు (తండ్రి). 'త్' అనుదానికి 'జ్' పరమైనప్పుడు 'జ్' వచ్చినది. సంస్కృతసంధి.

52. అన్ (=న=లేదు; కావల)+అన్య (ఇతరులకు)+సామాన్య - (సామాన్యమైన+తేజుఁడు (తేజస్సుకలవాఁడు). తాత్పర్యము - ఇతనివంటి తేజస్సితరులకు లేదు.

'అన్' (=న) అనునది 'లేదు' అను నిషేధవాచకము. 'అన్యాయము', 'అసాధ్యము' అను హలాదిపదములలో 'అ' అనియును, అజాదిపద ములలో 'అన్' అనియు నగును.

ఆహవము=యుద్ధము.

అగునె=తగునా ?

రోషము = కోపము; తనకపకృతి కలిగినదని తెలిసిన వెంటనె వచ్చు నట్టిది.

మత్సరము = అపకారస్మృతివలన మనసున నెల్లపుడు నుండునది; ప్రతీకారము చేసినఁగాని తీరనిది.

53. నారాయణ సఖుఁడు - అర్జునుఁడు.

నరుఁడు, సవ్యసాచి - అర్జునుని పేళ్లే.

నాఁ=అనఁగా

తక్క + ఇతరజనములకు—మిగిలిన, ఇతరులకు.

ఆలంబు - యుద్ధము.

54. ఉపశమన వాక్యములు-శాంతికలిగించు మాటలు.

అనునయించి-బ్రతిమాలి, మెత్తఁబఱిచి - ఒడఁబఱిచి.

55. బ్రహ్మవిదుఁడు - వేదము (లేక బ్రహ్మస్వరూపము) తెలిసినవాఁడు.

అ+కుంఠిత + తేజుఁడు - మొక్కవోని (తగ్గని) తేజస్సుకలవాఁడు.

అనఘ=దోషము లేనివాఁడా ! (అఘము=దోషము, అన్-నఞర్థకము.)

56. సాష్టాంగ దండప్రణామంబు— స (=కూడిన) అష్ట+అంగ+దండ+ప్రణామము; 'ఎనిమిది అవయవములతోఁ గూడిన కఱ్ఱవంటి, నమస్కారము' అని అవయవార్థము. అనఁగా, రెండు చేతులు, రెండు కాళ్లు, ఱొమ్ము, లలాటము, రెండుబుజములు ఈయెనిమిదియవయవములును నేలను దగులునట్లు సాగిలఁబడిన, కఱ్ఱవలెఁ గనఁబడును. అట్టి నమస్కారమునకు సాష్టాంగదండప్రణామమని పేరు. ఈ 7ది పద్యమున నిది యే వర్ణింపఁబడినది. 'క. కరయుగముును

చరణంబులు। నురము లలాటస్థలంబు నున్నతభుజముల్। సరి ధరణి మోపి మ్రొక్కిన౯, బరువడి సాష్టాంగ మండ్రు పరమ మునీంద్రుల్.'

గ్రుచ్చి యెత్తి - ఏమి గ్రుచ్చి ?

సస్నేహంబు గా = స్నేహముతోఁ గూడినట్లుగా. ('కూడిన' యనునది దేనియర్థము ?)

నన్ను భీష్ముండు గెలిచె-పరశురాముని యోగ్యత గన్పట్టును.

ఆ+ముని+జన+పితృ+దేవతా+సమూహంబు=ఆ మునుల యొక్కయు, పితృదేవతలయొక్కయు, దేవతల యొక్కయు, గుంపు.

ఆమంత్రణంబు సేసి=వీడుకొలిపి, అనఁగా, బంధువులను గాని, మిత్రులనుగాని విడిచి వెళ్లునపుడు, పెద్దలతో 'సెలవిమ్మనియు; చిన్నలతో 'ఉండుము' అనియు, చెప్పుట 'ఆమంత్రణము'.

అంతర్ధానంబు సేసె = అదృశ్యమయ్యె,—మాయమయ్యె.

---

## ౧౦. హంసకాకీయోపాఖ్యానము.

1. అంబుధి=సముద్రము. [అంబు (నీరు) ధి (ఉండునది.)]

అ+లఘు +తర=మిక్కిలి గొప్ప;'లఘు' అనఁగా, 'చిన్న' 'స్వల్పమైన; అలఘు = చిన్నకాని, గొప్ప. 'తర' అన్నుప్రత్యయము హెచ్చును సూచించును. ఇంగ్లీషులో comparative degree వంటి రూపమును గల్గించు ప్రత్యయము. లఘు×గురు. 'లఘుతర'కు 'లఘీయస్' అనియు రూపము. ఈపద్యమున 'తర' ప్రత్యయమునకు 'హెచ్చు' అనియె యర్థము. మఱియొక దానికంటె హెచ్చను తారతమ్య విచారణలేదు.

ద్వీప - ద్వి+అప (రెండు, నీరుకలది). చుట్టును నీరుకలభూమి.'దీవి', 'దిబ్బ', 'లంక'.

అధ్వర+ఆది+సత్కర్మశూరుఁడు-యజ్ఞము మొదలగు మంచికర్మములయందు శూరుఁడు. (అనఁగా, ఆరంభించిన కర్మములను దీక్షతోఁబరిసమాప్తి చేయువాఁడు.)

శాంతి—అంతరింద్రియ నిగ్రహము (అనఁగా, మనసును స్వాధీనముచేసి కొనుట). 'దాంతి'—'బహిరింద్రియనిగ్రహము'.

దుర్మానము = దుర్గర్వము. తృణీకరించి, తృణమువలెఁ (చులుకనఁ) జేసి, తిరస్కరించి.

పక్షబలంబు = ఱెక్కలబలము.

2. సుపర్ణుఁడు = గరుత్మంతుఁడు.

3. పులుఁగు - పిట్ట.

అంచ - 'హంస' అనుదాని తద్భవము.

వినువీథి (విన్వీధి యనియు రూపముకలదు)—ఆకాశము.

బహులత=విశేషము; 'వివిధములగు గతులచే' నని తాత్పర్యము.

4. తారతమ్య, జ్ఞాన, హీనులు=భేదముయొక్క, తెలివి, లేనివారు; భేదమును దెలియు శక్తిలేనివారు; 'తారతమ్య' అను సంస్కృత శబ్దము 'తర', 'తమ' అను ప్రత్యయములు చేరిన దానిపైని 'తద్ధిత'. 'తర','తమ'అనునవి. (పై మొదటిపద్యములో, 'అలఘుతర' అన్నచోటి టీకచూడుము) హెచ్చుతగ్గులను సూచించునవి. కనుక 'తారతమ్యము' అనఁగా భేదమని యర్థము వచ్చినది.

ఉచ్ఛిష్టము(ఉత్+శిష్టము) = తిని విడువఁబడినది; ఎంగిలి.

మౌర్ఖ్యంబు-'మూర్ఖ' అనుశబ్దము మీదితద్ధిత; 'మూర్ఖత్వ' మనునదియు నీయర్థముననే.

5. మానస, సరసి - ఈసరస్సు ఎచటనున్నది? హంసలు వర్షకాలము వచ్చుదాఁక మనదేశమునుండి, అనంతరము హిమవత్పర్వతమువలన నీసరస్సునకు 'క్రౌంచరంధ్ర' మను నొకబిలమార్గమున నెగసిపోవునని చెప్పుదురు.

7. పిలిచితి-పూర్తిరూపము—'పిలిచితివి'

8. శత, యోజన, వ్యాప్తి= నూఱు, ఆమడలు (నాల్గు క్రోసులు), పోవుట.

దూర, పాత, భంగి=(మిగుల)నెత్తునకు నెగురు, విధము.

సంగతి=కూడి యెగురుట.

పరుపడి-'పర్యాయము'; అనఁగా ఒకగతి వెంట మతియొక దాని నవలంబించుట.

చారు,లీలా,గతి-సుందరమగు, విలాస(లాఘవముతోఁ జేయు) గమనము, (ఎగురుట); వెక్కులు ;కదల్పకుండుట మొదలగునవి.

వక్రయానము-పాము మెలికవలె పరుగిడుట.

వలయ, క్రమంబు- గుండ్రముగ (చక్రమువలె) ఎగురుట.

9. ఆహూతంబైన = పిలువఁబడిన

10. జలధిచదలు=సముద్రముపై ఆకాశము.

11. ఏక, యాన, పర్యవసాన, హీన, సముత్సాహ, దోహలి = ఒక్క గతి (యందే) ముగింపుచే, స్వల్పమగు, ఉత్సాహముయొక్క, అతిశయముకల - అనఁగా, వివిధగతులయందు నేర్పులేక, ఉత్సాహహీనుఁడవై ఒక్కగతితో బాఱునట్టివాఁడవు.

మరాళంబు = హంస.

గమి = గుంపు.

మున్నీరు-(మును+నీరు)-సముద్రము.

12. రాయంచ-రాజహంస ; అనఁగా, కాళ్లును ముక్కును ఎఱ్ఱగనుండి, తక్కిన శరీరమంతయు తెల్లగనుండు హంస.

లీలాయితములు = విలాసములు; ఒయ్యారములు.

అగ్గలికమెయిన్ = ఉత్సాహముతో

14. ప్రసరణ = గమన (మందు)

చతురంబు = నేర్పుకలది.

గేలిగొని-పరిహాసించి.

కలకలంబు - 'కలకల' మని ధ్వని-ఇట్టిశబ్దముల కేమని పేరు ?

15. పడమటిదెస - సముద్ర [illegible]పున నుండె నని తాత్పర్యము.

ఈలకఱచి - ఇలకఱ[illegible] ణముబిగఁబట్టి.

ఉదంచిత, త[illegible] కళాపై దగ్ధ్యంబు = హెచ్చిన, వేగము [illegible], నేర్పు - అనఁగా, మిక్కిలి వేగ

వైదగ్ధ్యము - 'విదగ్ధ' అను సంస్కృతశబ్దము మీఁదితద్ధిత.

బీఱువడి - బలహీనమయి.

ఆకుల + అంతరంగంబు=కలఁతపడిన+మనస్సు, (కలది). బహువ్రీహి

వికల+అంగ-శిథిలమయిన+శరీరము,కలది.

17. తొడరు - యత్నించు.

కాల్కొను - కాలుకొను, కాలు (ఊను) కొను.

బహు,సత్త్వ, మయము-అనేక,(క్రూర)జంతువులఁ,గూడినది. 'మయ'అను నది ప్రత్యయము (అనఁగా నొక శబ్దమునకుఁజేరినప్పుడర్థము కలిగియు, విడిగఁ బ్రయోగింప నర్హము కానిది.)'మయ' అను ప్రత్యయము రెండర్థములఁ జేర్పఁబడును. 'మృణ్మయము' [=మృత్ (మన్ను) మయము] అనుచో 'వికారార్థ' మందురు. అనఁగా మృత్తు (మన్ను) మాఱురూపము పొందినదన్నమాట - కుండ గోలెము మొదలగు మంటి సామానులు. రెండవయర్థమున కుదాహరణ మీపద్యములోని 'సత్త్వమయము' అనునదియే. దీనికిఁ 'ప్రాచుర్యార్థ' మందురు. అనఁగా 'సత్త్వములతో ప్రచురమైనది, 'అనేక సత్త్వములఁ గూడియున్నది' అని తాత్పర్యము. వాడుకలో నీప్రత్యయము తత్సమపదములకే కాక, ఇతరపదములకును చేర్పఁబడుచున్నది. 'అబ్బా! ఆపూరు దోమల మయం'.

వలయుం బొలియన్-గద్యలోనిది 'పొలిఁచు వలయును' అని యుండును.
పొలియుట = చచ్చుట.

18. మానసంబు = మనస్సు. 'మనస్' అను సంస్కృతశబ్దమీది తద్ధిత 'మానసమ్' అనియుండును. ఈతద్ధితను 'స్వార్థతద్ధిత' యందురు. శబ్దమునకేయర్థమో, తద్ధితజేరినదియే యర్థము. ఇట్లే 'కుతూహలము' 'కౌతూహలము' అను నవియు సమానార్థములు కలవి(చూ. 8 వ భాగములోని 3 వ పద్యము).

సొగసి - 'సొగయుట'పరవశత్వము నొందుట, అవశతనొందుట.

19. ఈపద్యములోని రసమును గ్రహి[illegible] 8 వ పద్యములోని కాకి మాటలును, 3 వ పద్యములోని [illegible] దెచ్చుకొనవలెను.

నేర్తు - నేర్తువు.

ఏను = నేను.

తడసెదవు.-'తడయుట'='అలస్యము చేయుట' ఎఱకలు= ఱెక్కలు.

21. తలకొని = 'అత్యంతము' అని 'ఆంధ్రదీపిక' యందున్నది.

22. అగ్గలంబగు = హెచ్చగు; బెగ్గలంబు - 'విహ్వలత', భయము.

24. కోలది - సామర్థ్యము.
కరుణ+ఆలోకనంబు = దయ (గల) చూపు. శరణ్యుఁడు = శరణు బొందఁదగినవాఁడు.
నన్ను మగుడఁ, (మరల) కాకులలోఁ గలుపఁదగవు గాదే - జాతీయ మైన ప్రయోగము.
తెలుప - 'తెలుచుట'.

27. వెరవు = ఉపాయము.

28. కూటం బెరిఁగిన - కూడుతిని పెరిఁగిన.
ధిక్కరించు=తిరస్కరించు.

---

## ౧౧. దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల వృత్తాంతము.

1. దీర్ఘదర్శి = దూరాలోచనము కలవాఁడని తాత్పర్యము. ప్రాప్తకాలజ్ఞుఁడు - మంచిచెడ్డలు తటస్థమగు సమయమునఁ దెలిసినవాఁడు (అనఁగా, తెలివిగల్గి నడచుకొను [illegible] ర్ఘసూత్రుఁడు; పొడవు ద్రాటివాఁడని యథాయార్థము. [illegible] ఁడు; పరమ మందుఁడు. ఈ పేళ్లెల్లు సార్థకములో [illegible] న విచారింప వలె. మొదటి వానికి అనాగత విధా [illegible] ండవ వానికి 'ప్రత్యుత్పన్నమతి'యనియుఁ గూడ పేళ్లు.
జలచర, బహుళంబు - నీటఁదిరుగు, జంతువులతో [illegible] ఁ గూడి నది. పొందు=సహవాసము. కూటమి.

2. ఇం దీమత్స్యము యొక్కయే గుణము సూచింపఁబడు [illegible]

3. ఇందే మత్స్యముయొక్క యేగుణము సూచితమైనది?
మానితోపాయవృత్తి—మానిత+ఉపాయ, వృత్తిఁ = ఎన్నఁదగిన (మంచి) యుపాయముతోఁ బ్రవర్తించుటవలన.

5. జడనిధి—జలనిధి = సముద్రము, సంస్కృతమున కొద్దిచోట్ల 'లడయోరభేదః' (అనఁగా, 'ల' అనునక్షరముసకును, 'డ' అను

దానికిని భేదములేదు) అందురు. కావున 'జడ' అనుదానికిని 'జల' అనుదానికిని భేదములేక యుండెను.

ఇప్పుడేమిమాఁడెను—జాతీయప్రయోగము - వాడుకలో "ఇప్పుడేమి పడిపోయింది," "ఇప్పుడేమి తగులపడి పోయింది" అనియందురు.

అడిచిపడు=త్వరపడు-వాడుకలో 'వాడి అడిచిపాటు'-'అనఁగా, ఉద్రేకముపోగరు'.

రిత్త—'రిక్త' ('పట్టి' యనియర్థము) అనుసంస్కృతపదమునకువికృతి. ఇట్లే బత్తి 'భక్తి', సత్తి 'శక్తి'.

నెవ్వగ—నెఱ 'అధికమగు'+వగ 'భయము.' ఈ సంధిని గుర్తింపుము. ఇట్లే నెమ్మది 'నెఱ+మది', నెత్తావి 'నెఱ+తావి', ఒయ్యనన్—మెల్లన.

6. అంబు, స్రోతః, జనిత, అభయము—నీటి, ప్రవాహమువలన, పుట్టిన నిర్భయము-ధైర్యముగల అనఁగా నీటిమార్గమునఁ బోవుటచేనిర్భయమగు; 'పథ' మనుదానికి విశేషణము.

7. కతిపయ=కొన్ని, కొలఁది.

8. తాఱు=చాటుననుండు ; అంతర్హితమగు, మఱుఁగుపడు.

9. ఊఁత-"పైక్రిందులు బయలుగావిడిచి, యడుగునుండి మీఁదికి వాటముగా కంపనల చువ్వలతో నల్లిన మత్స్యగ్రహణ" సాధనము, రూ-

ఊఁ[illegible] చేఁపలఁబట్టెడి అడ్డువల.

గువ్వఁ[illegible] ఫు 'గుచ్చు' ( = కూర్చు).

10. ఒంద[illegible] ాందంగా'. అనఁగా, కలసినట్లుగా. క్రందుకొ[illegible]

నుట[illegible] డిచేయుట'.

[illegible] నులు ; మీనములు (= చేఁపలు).

ఇరు×ఒండు కలసి, ఇరొండు,రొండు, రెండు, గా మార్పుఁజెందినట్లు చెప్పుదురు. 'ఇరు ఒండు' అనఁగా ంఁలు ఒకట్లు అన్నమాట అని అర్థముచెప్పుదురు).

13. దురితంబు—కలఁత.' పొర—ప్రమాదము.

14. చకిత, వికల, భావ, ఇంద్రియుఁడు—భయపడి, చెదరిన, మనస్సును, ఇంద్రియములును గలవాఁడై.

15. జడుఁడు—మందుఁడు.

## 12. కపోతోపాఖ్యానము.

1. శరణ, ఆగత, సంరక్షణ, పరులు—రక్షణకొఱకు, వచ్చిన వారిని, కాచుట యందు, ఆసక్తికలవారు.

నిర్భర, కరుణ, ఆకర—గొప్ప, దయకు, స్థానమైన వాఁడా! (దయామయుఁడా). 'కరుణాకర' అన్నచోట నేసంధి ?

2. నాఁగ - అనఁగ.

దనుజ, మంత్రి=రాక్షసులయొక్క మంత్రి—శుక్రాచార్యుఁడు ('గురుఁడ'ని తలమంత్రి బృహస్పతి యనియు నెఱుఁగవలయు. ఆతని ...రిని దానవు యందురు). దనుజ—'దను' సంతతివారు; ఇందువలననే ... లని యందురు.

3. ఇతిహాసము-పూర్వపు కథ—ఉపాఖ్యానమనఁగా, ...ంగవశమున చెప్పిన అవాంతరకథ.

నీయడిగిన - నీవు అడిగిన.

అవహితుఁడు—శ్రద్ధ (అవధానము) కలవాఁడు.

ఆకర్ణింపుము=వినుము. 'కర్ణము' అన నేమి ?

4. సవరించుకొని—ఇక్కడి యర్థము నూహింపుము.

మహాటవి—మహాత్+అటవి- (గొప్ప, అడవి), ('మహాత్' ...నునదికర్మ ధారయసమాసములో 'మహా' అగును; తరువాత ...ర్ణదీర్ఘము చేయఁగా నీ రూపమువచ్చినది).

పెను—పెద్ద.

కాన—కాననము, అడవి.

జలనుయంబు—ఇచ్చట 'మయ' అనుదాని కేయర్థము? హంసకాకీయోపాఖ్యానములోని 17 వ పద్యము టీకచూడుము.

వెల్లువ=ప్రవాహము. ఒడ్డి = దాఁటి. వనస్పతి - (పూవక కాచెడి) చెట్టు. సెజ్జ-శయ్య. రాతిరి=రాత్రి.

శీతార్తుఁడు-శీత(=చలి వలన)ఆర్తుఁడు (బాధఁ జెందిన వాఁడు.)

5. లుబ్ధకుఁడు - వేటకాఁడు. అత్తరువరము - ఆ+తరు (చెట్టు)+వరము (శ్రేష్ఠము) - ఆపెద్దచెట్టు.

కరుణాశీలతఁ - దయా+స్వభావము (తో)

విశిష్ట+వినీతిఁ - విశేష+వినయములతో.

6. శయనంబు - ఎట్టిది ? (నాల్గవపద్యముచూడుము.)
మహీ+రుహాంబు-(భూమినుండి+పుట్టినది) చెట్టు.
వల్లభ - ఏలింగము? (వల్లభుఁడు-ఏలింగము?)
మేఁత - ఏధాతువునుండి వచ్చిన 'కృత్తు'?

7. ప్రొద్దు-కాలము, ('ప్రొద్దు' అనఁగా 'సూర్యుఁడు' అనియు నర్థము. సంస్కృతమున 'బ్రధ్న' అను శబ్దమునకు వికృతి).
ఉజ్జ్వలాంగి - ఉజ్జ్వల (ప్రకాశించు, కాంతిగల) అంగి(అంగములు, అవ
వములు కలది.
ఎమ్మె
ం —ఏ+మేను (శరీరము)
కలివి
ఏధాతువునుండి 'కృత్తు'? వ్యతిరేకము-లేమి.
అధిక
అనురాగ (ప్రేమ)+యుక్త ('కూడినది')—ఏలింగము ? సతి—
భ
వ్య; 'పతివ్రతయనిభావము'.
గుణా
ల—గుణములే.
ఐహి
క+ఆముష్మిక — ఇహ (ఈ) లోకమందలియు, పరలోకమంద
ము.
సు
ఏష -సుమ్ము- సుమా.
ఏధాతువునుండి ? (అభివృద్ధి, అతిశయము, హెచ్చు,ఆధిక్యము).
స
ష, పూర, మగ్నంబు-సంతోషము (అనెడి), ప్రవాహమున,
ంగినది.
8. ఁ, ఎక్కిన - మనసున కెక్కిన; మనస్సునగాఢముగాఁ ప్రవే
ంచిన.

యువతి—పడుచు; 'యువ'—పుంలింగము.
పుణ్యవతి-పుణ్యముకలది; ధన్య. పుణ్యవంతుఁడు - పుంలింగము.
ప్రియ+ఆలాపములు (మాటలు)—సవర్ణదీర్ఘసంధి.
గతి—విధము.
కృతకృత్యంబు—కృతార్థము; సఫలము.
జమునిఁ—యముని. 'యమ' అనుసంస్కృతశబ్దమునకు వికారము 'జముఁడు'.

9. ఉల్లంబు—మనస్సు,

అతిథి—గృహమునకు భోజనమునకు వచ్చినయాతఁడు. గృహస్థుఁడు. అతిథి పూజసేయుట హిందువులలోధర్మము.

10. ఆతిథ్యంబు అతిథులయందు సాధువైనది, అనఁగా, అతిథులవిషయమైన యోగ్యసత్కారము. 'అతిథి' అను సంస్కృత శబ్దముపైని 'తద్ధిత'.

11. భవదీప్సితార్థము—భవత్ 'నీవు', ఈప్సిత 'పొందఁగోరికకల', అర్థము 'వస్తువు'.

12. అనా—అన్నా-ప్రేమనుసూచించును - ఆదరణకై య[illegible]పలుచుట.

13. పక్షివైరి -పక్షుల, శత్రుఁడు - బోయ.

సీతు—'శీత' అనుసంస్కృత శబ్దవికారము-చలి(చూ. 1[illegible] పద్యము).
సకల×అంగకంబులు— అన్ని, అవయవములు. 'అంగక[illegible]' అనుదానిలో 'క' అల్పతనుసూచించును. దుర్బలములగునవయవము[illegible]నిసూచన. ప్రతున్నము-పీడనుపొందినది. అ+కుంఠితమైన—మొండి[illegible]దని; అనఁగా, పూర్ణమైన.

14. సంగతంబైన—కూడిన.

ఇంగలంబులు - నిప్పు. 'బొగ్గు' అనిసంస్కృతమున అర్థము 'ఇంగాలము' అనియు రూపము. 'అంగార' శబ్దమురొక్క వికారమ[illegible]రు. అయినను 'ఇంగాల' శబ్దముకూడసంస్కృతమున 'బొగ్గు' అనునర్థమున కనపట్టుచున్నది.

15. తనుకంగా—జ్వలింపఁగా; మండునట్లు. నెమ్మి—ప్రేమ.

16. ఆ,అనల,శిఖా, కలాపమున—ఆ,నిప్పు, మంటల (యొక్క)సమూహమున—

వెలవెలంబాఱి-ఎందువలన ?

18. జీవనంబు—బ్రతుకుతెఱువు ; ఇచట ఆహారము.

నియతి - నియమము, ధర్మము.

20. వలగొని—ప్రదక్షిణముచేసి. అగ్నిదేవుఁడుకావున భక్తితోఁ బ్రదక్షిణము చేయుటధర్మము. వ్రాన్పడి—వ్రానువలెపడి-అనఁగా మూర్ఛితుఁడై.

22. కారుణ్యము — 'కరుణ' అను సంస్కృతశబ్దము మీది 'తద్ధిత'. ఏతత్, క్రూరతా, ఘోరచేష్టలు-ఈ,క్రూరత్వముచే, ఘోరములగు, పనులు.

24. ఒలయు-కలుగు. మహాప్రస్థానము—(గొప్పప్రయాణము) అనఁగా, వైరాగ్యముకలిగి, అన్నిటినివిడిచి, అడవులడ్డున్నను ఏయాటంకము లున్నను, లక్ష్యపెట్టక, తిన్నగా నుత్తరదిశకుఁ దపమాచరింపఁ బోవుట. (చూ. 36 వ పద్యము.)

25. నిపాతి—చంపుట.

26. రాలుపడు—'కంపించు':

అశ్రుజల, తరంగిత, ఆశ్య—కన్నీటిచే, అలలు కలదిగాఁజేయఁబడిన (కలుషితమైన), మొగముకలది.

27. పతియనురాగమెట్లు వర్ణింపఁబడుచున్నదో గుర్తింపుము.

29. ఇగురు—చిగురు.

30. అన్న, మరణము—వెంటఁజచ్చుట.

అనూన=అ + ఊన—తక్కువకాని. 'కాని' అనిదేనియర్థము ?

33. స్ఫురిత—కాంతికల.

34. జలసి - పరివేష్టించి, చుట్టుకొని.

పాలిచె—సంచరించె. తోఁచె-తక్కినవారల కెందులకు తెలియలేదు?

37. కట్టెదురు. ఇట్టిసంధిగలమఱి కొన్ని చెప్పుము. సం, ప్రమోదిత, చిత్తుఁడు—పూర్ణముగ, సంతసించిన, మనస్సుకలవాఁడు.

---

## 13. గృధ్రజంబుకోపాఖ్యానము.

ఇందలినీతిని యుక్తులను గుర్తింపుము. మాటల కూర్పుచూడుము.

13 వ వచనమును ముందు చదువుము.

1. గాంగేయుఁడు—గంగాఅను దానిమీది తద్ధిత.గంగకు కొడుకు భీష్ముఁడు, ఈ కథను భీష్ముఁడు ధర్మరాజునకు చెప్పెను.

కౌంతేయ, పూర్వజునకు కుంతీపుత్రులలో,మొదట పుట్టినవానికి;అనఁగా 'ధర్మ' రాజునకు; 'కుంతీ' శబ్దముమీది తద్ధిత, కౌంతేయ.

ప్రేతభూమి—శ్మశానము.

అ, మేయ—కొలువ వీలులేనిది ; అంతహెచ్చైనదని తాత్పర్యము.
ప్రొద్దు—సూర్యుఁడు—'బ్రధ్న' శబ్దవికారము.

2. మగఁడుదురే— మల్లుదురా ;
మీరుందెగుదురు—మీరును చత్తురు.
కర్జము—'కార్య' శబ్దవికారము.

4. అబ్జ, వదనుఁడు—పద్మము (వంటి కాంతి, లావణ్యము, కల) మొగము కలవాఁడు.

అసువులు—ప్రాణములు.

5. జెట్టిదుండు—క్రూరుఁడు; కఠినుఁడు.
కాలుఁడు—యముఁడు.
పడయు—సంపాదించు.

10. ఇన్నూఱు—ఇఱు (రెండు)+నూఱు;
మున్నూఱు—మూఁడు+నూఱు.

11. ఉక్కివము—కపటము.

12. ఎగవెక్కి—సెగవెక్కి—తొందరపడి.
రాఘవుఁడు—బ్రదికింపఁడే—పూర్వము శూద్రుఁడొకమునివలె తపము చేయుచుండుటవలన బ్రాహ్మణబాలుఁడొకఁడీకాలమున చావఁగా, రాముఁడాశూద్రమునిని చంపి బ్రాహ్మణబాలుని బ్రతికించెనను కథ నిచట జ్ఞాపకముంచవలెను.
సృంజయుం కొడుకు—లేదె—సృంజయుఁడను రాజు నారదునివరమువలన సువర్ణష్ఠీవి యను కొడుకునుగనెను. ఒకప్పు డీ పుత్త్రుని దొంగలెత్తుకొని పోయిచంపిరి. నారదుండు వానిని మరల బ్రతికించెను.
పనవు—'ప్రలాపించు'.

13. ప్రేతవన—శ్మశానము.
కరుణా, కింకరుండు—దయా, పరవశుఁడు.

14. సంప్రమోద, భక్తి, సంభ్రమ, భరితులు—సంతోషము (వరము వచ్చునని), భక్తి (దేవుఁడగుటవలన), భయము, లేక, తొందర (గొప్పవారు వచ్చినప్పుడు కొద్దివారి కుండునది) వీనిచే నిండినవారు.
ప్రభూతంబులు—గొప్పవి.
ఆర్త—బాధఁజెందిన.

ప్రమార్జనంబు—తుడిచివేయుట.
కర్తవ్యము—కరణీయము, కార్యము—చేయఁదగినది.

---

## 14. చిరకారి చరిత్రము.

చిరకారి—అనఁగా, చాలసేపటికి చేయువాఁడు. తొందరపడి చేయువాఁడు కాఁడు; బాగుగ నాలోచించి చేయును. 'సంప్రేక్ష్యకారి' యున్నమాట.

1. కురు, భూపతి, వర్య—కురు, రాజుల(లో), శ్రేష్ఠుఁడా!; ధర్మరాజా! ఈకథనుగూడ ధర్మరాజునకు భీష్ముఁడు చెప్పెను.
   ఎద్ది—ఏయది, ఏది; ఇట్లే, ఇది, ఈయది, ఇద్ది; అది, ఆయది, అద్ది.
2. ముని—గౌతముఁడు; చిరకారితండ్రి.
   పనిచి—పంచి; నియోగించి ('పంపి').
   చేఁత—ఏధాతువునుండి ? ఏవృత్తి ?
   సత్+కర్మ+విదులు—మంచి, పనుల, నెఱిఁగినవారు.
   మాతృ+రక్ష—తల్లి(యొక్క), సంరక్షణ.
   పుత్రభావము—పుత్రత్వము, అనఁగా, కొడుకగుట
   అస్వాతంత్ర్యము—అ (నఞ్—'లేద' ని యర్థము) + స్వాతంత్ర్యము (స్వతంత్రుని భావము—తద్ధిత); ఇతరులకు (తల్లిదండ్రులకు) వశుఁడై యుండుట.
   నెలవు - స్థానము.
   ఎవ్వలన్ - ఏ,వలన్ - ఏవిధముగా.
   ఒకొ - ఓ, (వితర్కమందు.)
   ఈ పద్యమందలి విమర్శను బాగుగఁ బరిశీలింపుము; కొడుకునకుఁ దండ్రియెడలను, తల్లియెడలను, ధర్మములున్నవి. రెంటి నతిక్రమింపక, చేయు నుపాయమును దెలియలేక, చిరకారి దీర్ఘ విచారమునుజేయుచున్నాఁడు. ఈతని చిక్కు - నీ'(1)తండ్రిమాట నతిక్రమింప రాదు; (2) తల్లిని జంపరాదు; రెండును సమకూడుట ఎట్లు ?' అని.
6. జనని—దీని-పుంలింగము - జనకుఁడు (సం. రూ. 'జనక')
   ఉడిగితిఁబో—వాడుకలో 'మానేశాననుకో'.
   జనక+అవమానము—తండ్రియొక్క (విషయమైన) అవమానము.

4. బిడ్డను మొక్కకుపోల్చుచు, తండ్రి గింజను చల్లువాఁడనియు, తల్లి పొలము వంటిదనియు, వారిద్దఱకును తాను ప్రేమాస్పదుఁడననియును, ఒకరినైనను విడుచుట తగదనియుఁగినితని.

భస్త్రిక—సంచి. అనఁగా, మాతృగర్భము; తిత్తివంటిది—అందు శిశువువృద్ధి నొందును.

వంశ, ధరణార్థముగన్—వంశమును, నిలువఁ, బెట్టుటకొఱకు ('కొఱకు' అను నర్థముదేనికి?).

పొత్తులవాఁడు—'పొత్తు' అనఁగా - స్నేహము; ప్రేమము; ఇద్దఱకును నేను స్నేహపాత్రమునై.

6. తండ్రియే తల్లి కడుపునఁబడి కొడుకుగ జన్మించునని చెప్పనగును. అందు వలననే 'ఆత్మైవ పుత్రనామాసి' అని చెప్పఁబడినది.

9. కర, చరణ, ఆది, సంఘటిత, కాయము—చేతులు, కాళ్లు, మొదలగు (వానితో), కూర్పఁబడిన, శరీరము.

వహ్ని—నిప్పు.

అరణి—అగ్గిపుల్లలులేని పూర్వకాలమున, మన దేశమున, యజ్ఞములు మొదలగు పవిత్రకర్మలలో అగ్నిని పుట్టించుటకు, రెండు కఱ్ఱలను దెచ్చి అందొకదానిని దొలిచి రెండవదానిని మొనదేర్చి, ఒకదానిలో రెండవది కవ్వమువలె త్రిప్పెడివారు. ఆమథనమువలన నిప్పుపుట్టెడిది. ఈ కఱ్ఱలకు అరణియని పేరు. కాయము యొక్క పుట్టుక తల్లిదెస నైనదికదా; నిప్పు పుట్టుక అరణికి వలెనే.

పట్టి—కుమారుఁడు—బిడ్డఁడు.

10. ఇడుమలు—కష్టములు.

11. అధిక — ఏలింగము? తక్కిన లింగములందు రూపము లెట్లుండును.

అర్మిలి—ప్రేమము.

పొత్తులవాఁడు—'పొత్తు' అనఁగా—స్నేహము; ప్రేమ: ఇద్దఱకును నేను ప్రేమపాత్రమునై.

ఆ పదార్థంబు—ఆ (తల్లియను) పదముయొక్క అర్థము; 'తల్లి' యను పేరిచేఁ బిలువఁబడునది.

జగమ్ము—'జగత్' అను సంస్కృత శబ్దమునకు వికారము; 'జగత్తు' అనియు వాడుదురు.

12. క్షుద్ర—నీచమైన, అల్పమైన.
గురు—గొప్పదైయైన; అధికమైన (వాఁడు).

13. మాతృ+వియోగంబు—తల్లి (నుండి) +విడిపోవుట; తల్లిలేనివాఁడగుట.

14. సబలుఁడు,అబలుఁడు—ఇందలి 'స,అ' ల కర్థముల గుర్తింపుము.

15. అధిక+పాప+పయో+రాశి— హెచ్చగు+పాపమనెడు+ (నీటి+సమూహము) సముద్రము. 'పయస్' అను సంస్కృతశబ్దమునకు 'పాలు' అనియును అర్థము. అందువలననే దానితో చేసినవంటకమునకు 'పాయస'మందురు. (ఈ 'పాయసము' తెలుఁగున'పాసె'మైనది.)
పసులవాఁడు - పశువులఁగాచువాఁడు. ('పశు'శబ్ద వికారము 'పసువు) బహువచనము 'పసులు.' పసులవాఁడనఁగా—గొల్లవాఁడు 'వెఱ్ఱిగొల్ల'; కావుననే వానికిని దెలిసినవిషయము ఇతరులకు సులభముగఁ దెలియక తప్పదు.

16. తదీయ—'తత్' అనుశబ్దముపై 'తద్ధిత'; వానియొక్క, వాని సంబంధమైన
సార్థకంబు—అర్థముతోఁ గూడినది. పేళ్లుపెట్టుటలో సాధారణముగ గుణములఁబట్టి పెట్టుట వాడుకలేదు—(వాడుకలో 'పుట్టుశాస్తుర్లా పెట్టుశాస్తుర్లా' అందురు). కావున పేరునకు సరిపోవు గుణములుకల వాఁడు సార్థకనాముఁడు.

17. వెడ—అల్పమైన.

19. చిరకారిత—'చిరకారి' యొక్క స్వభావము.
వెరవరి—వెరవు (మార్గము) ఎఱిఁగినవాఁడు; నేర్పరి.

23. శోకబాష్పములు, ఆనందాశ్రువులు—వీనికి భేద మేమని చెప్పుదురు?
మూర్ధఘ్రాణంబు సేసి—శిరము మూర్కొని.

24. తత్+తత్—ఆయా.
అన్+ఆర్యుఁడు—ఆర్యుఁడు కాని వాఁడు—'అన్' అనునది అజాది శబ్దములకువచ్చును. హలాదులకు 'అ'వచ్చును.

25. మిత్రత్వము - 'మిత్ర' అనుసంస్కృతశబ్దముమీఁదితద్ధిత. 'మిత్రత,' 'మైత్రి'-అనునవియు నిట్టివియె - ఈయర్థము కలవియె.
పాత్రత—'పాత్రత్వ' మనునది మఱియొకరూపము.
చిరతర—'చిర' అనుదానికి 'తర' అను ప్రత్యయము చేర్చినందువలన ఏర్పడిన రూపము - ఈ 'తర' ప్రత్యయమును గూర్చిహంసకాకీయో

పాఖ్యానములోని 1 వ పద్యములో 'అలఘుతర' అనుమాటపై వ్రాయఁబడినటీక చూడుము. 'తర' అను ప్రత్యయము 'రెంటిలో హెచ్చు' అని చెప్పును. అంతకంటె మించినవానిలో హెచ్చును చెప్పుటకు 'తమ' అను ప్రత్యయమునువాడుదురు. ఉదాహరణములు—తృణము కంటె తూలము లఘుతరము. తృణము, తూలము, యాచకుఁడు—వీనిలో యాచకుఁడు లఘుతముఁడు.

చిరతరగణనాసూత్రితముగన్—'పరికించు' అనుదానితో నన్వయము. చాలకాలము లెక్కించుట (అనఁగా, పరిశీలించుట) వలన సూత్రము (వీలు, అర్థసాధనము) కలుగునట్లు. తాత్పర్యమేమనఁగా—బాగుగ పరిశీలించుట వలన యుక్తసాధనములు తెలియును. అందువలన కార్యము విచారించిచేయుట కలుగును.

## 15. వసిష్ఠవిశ్వామిత్ర సంవాదము.

ఇది వశిష్ఠుఁడను మునికిని విశ్వామిత్రుఁడను మునికిని ఇంద్రునిసభలో జరిగిన సంవాదము. ఇంద్రుఁడు స్వర్గపట్టణమునకు రాజధానియగు అమరావతీ పట్టణమున సుధర్మయను గొప్పసభలో నెత్తైన దివ్యసింహాసనమున కూర్చుండి యుండ, ఆతనిచుట్టు దేవతలును ఉచితాసనములనుండ, సప్తమహర్షులు (అనఁగా, కశ్యప, అత్రి, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమ, వసిష్ఠ, వామదేవులు) ను వారికి నియమింపఁబడిన పీఠములనుండ, ధర్మవిషయముగాని, చరిత్రవిషయముగాని విచారణలు జరుగుచుండును. అట్టిదొకటి జరుగుచున్నట్లు ఈ సంవాదమున నూహింపవలయును.

1. మూఁడులోకంబులు—రూ-ముల్లోకములు; స్వర్గ, మర్త్య, పాతాళములు.
   మునుము+ఇడి—పరుప+పెట్టి.

9. ఈక-ఈయక ; 'ఇచ్చు' ధాతువు.
   ఒండు, ఒరులన్—ఒకని, నొకరు.

11. గుజగుజలాడు—త్రొక్కటపడు.

12. గజిబిజి—కలఁత; సందడి - మునులందఱును ప్రత్యుత్తరమిచ్చుటకు శక్తి లేక కలఁతఁజెందిరి.

13. నిరుపమ+విజ్ఞాన+నిధి—సాటిలేని, తెలివికి, నిధివంటివాఁడగు. నిర్+ఉపమ—సాటిలేని. 'నిర్' అనుదానికి 'లేని' యనిఅర్థము. 'విజ్ఞాన' మనుమాటకు సాధారణముగ 'శిల్పశాస్త్రములందలి నేర్పు' అనునర్థము.

ఈ పేర్పు అనునర్థముదీనికి వికృతియగు విన్నాణమనుదానికిఁ గనఁబడును.

14. పురుహూతుఁడు—ఇంద్రుఁడు.

15. సురేంద్ర—సుర+ఇంద్ర ('గుణ' సంధి). దేవతల, ప్రభువ. ఇచట 'ఇంద్ర' శబ్దమునకు, 'ప్రభు'వనిమాత్రమెయర్థము. 'ఇంద్రుఁ'డనియు నీమాటకేయర్థము.
విశ్వము—ప్రపంచము.

16. విక్రమ+ఉన్నతుఁడు—పరాక్రమునుచే+గొప్పవాఁడు.

17. షోడశ+మహా+దాన+వినోది - పదునారు, గొప్ప, దానములచే, వినోదించువాఁడు. షోడశ — షట్ (ఆఱు) + దశ(పది)-పదునాఱు.

20. వితత+ధనుర్వేధ+విద్యా + అధికుండు—విస్తీర్ణమైన, యుద్ధశాస్త్రమను విద్యయందు, గొప్పవాఁడు-ధనుర్విద్యయనఁగా ధనువు నుపయోగించువిద్య; యుద్ధవిద్యయని తాత్పర్యము.

22. దురిత, దూరుఁడు—పాపమునుండి, దూరమైనవాఁడు.
పాత్రుండు—'పాత్రము' అని పురుషునకును వాడుదురు. ఈవాడుక సంస్కృతమున నిత్యము.

23. సర్వశాస్త్ర (ముల యొక్క) అర్థ, విచార, కోవిదుఁడు (నేర్పుగలవాఁడు.) 'కోవిద' అను సంస్కృతశబ్దము 'ఓకోవిద' అనుదాని రూపమనియును, 'ఓకః=స్థానమును(బ్రహ్మ), విద=తెలిసిన (వాఁడు)' అనియర్థముచెప్పి, మొత్తమునకు 'నేర్పరి, పండితుఁడు' అనితాత్పర్యమును చెప్పుదురు.

24. గర్విత, రిపు, గజ, కంఠీరవుండు - గర్వముగల, శత్రువులను, ఏనుఁగులకు, సింహమువంటివాఁడు. ఏనుఁగులను సింహము చంపును గదా.

25. ఆఱుగురు చక్రవర్తులు—హరిశ్చంద్ర, నల, పురుకుత్స, పురూరవస్, సగర, కార్తవీర్యులు.

26. తరము+ఇడి—వరుస+ఇచ్చి; వరుస నేర్పఱిచి.

29. భాను, వంశ, శరధి, చంద్రుఁడు—సూర్య, వంశముఅనెడి, సముద్రమునకు, చంద్రునివంటివాఁడు - చంద్రుఁడు సముద్రునికిఁ గుమారుఁడై తనయుదయమున సముద్రునిఁ బొంగించును.

31. పోఁడిమిన్ — ఒప్పుతో; నేర్పుతో.

32. వాఁడెపో — వాఁడేసుమీ.

33. అంబుద ధ్వని — మేఘ, గర్జనము; ఉఱుము. అంబు (నీటిని) ద(ఇచ్చు నది) గనుక అంబుదమని పేరు.

36. వాక్రువ్వ — చెప్పఁగా — ధాతువు — వాక్రుచ్చు. వాయి(నోరు, మాట) కూర్చు (చేర్చు) అనుదానికి, 'వాక్రుచ్చు' అనురూపమువచ్చినది. 'వాయి' అనుదానికి 'వా' అనునది మాత్రము మిగులుచున్నది. అట్లే 'వాతెర', 'చిలువ' అనుచోట్ల — (వాయి+తెర,)(చీలు+వాయి, లేక, చిలుము+వాయి). 'వాయి' అనునది 'నోరువాయిలేదు, వాఁడు వట్టి వెఱ్ఱివాఁడండీ'' అనివాడుకలో నున్నది.

37. దధి, ఆజ్య, శాలి, ఓదన, మాంస, భోజనములు — పెరుఁగు, నేయి, శాలి (ధాన్యము) యొక్క, అన్నము, మాంసము, ఈ భోజనములు - తిను వస్తువులు.

40. సత్తుగాబొంకుట — సత్యముగ (తప్పక) అబద్ధమాడుట.

41. జనపతులేయూరు, సత్యమేయూరు — చాలదూరమున్నది. ఈప్రయోగము బహుస్వాభావికముగ నున్నది.

43. ఏడ — ఏ+ఎడ=ఎక్కడ.

46. శతముఖంబులన్ — నూఱునోళ్లతో; నూఱువిధములు.

53. అంతుగా — గొప్పధ్వనితో.

52. తక్కు — విడుచు. కంఠీరవంబు — సింహము.

55. కల్ల, ఝంజాటంబు — అబద్ధపు, తగులము (వ్యాపారము.)
కౌశిక — 'కుశిక' అనుశబ్దముమీది 'అపత్యార్థతద్ధిత' కుశికునికొడుకు; (విశ్వామిత్రుఁడు).

55 ఉరగ+కంకణుఁడు — పాములు+కంకణములుగాఁ గలవాఁడు. ఉరగ — బొరతోఁబోవునది గావున 'పాము' అని యర్థము.
ఊరజోఁగి — (ఊరన్, జోగి) ఊరువెంబడిపోవు బిచ్చపుఁజోగి. జోగి 'యోగిన్' అను సంస్కృత శబ్దవికారము.

58. నృపపిశాచములు — నృపాధములు; చచ్చురాజులు. 'ఇంద్ర' 'చంద్ర' మొదలగు శబ్దములు 'శ్రేష్ఠ' వాచకములగునట్లే, 'పిశాచ' శబ్దము 'అధమ' వాచకమయినది.

59. వ్రాలు—వ్రాత

63. సార్వభౌమ—సర్వభూమీశ.

67. తివిరి—కోరి, యత్నించి; కోపపడి.

68. శివుఁడెఱింగెడుఁజుమీ—ఇదియొక 'ఒట్టు'. ఇట్లే 94వ పంక్తిలో 'శంకరుసాన!' అని ఒట్టు.

71. పట్టి జర్జరలు - పట్టి యల్లరి; వ్యర్థ ప్రలాపములు.

74. కులపర్వతంబు—ఏడు పెద్దపర్వతములకు 'కులపర్వతము'లని పేరుకలదు. ఇవి మహేంద్ర,మలయ, సహ్య, శుక్తిమత్, గంధమాదన, వింధ్య పారియాత్రములు. భూమిని భరించు పని వీనికిఁగలదని చెప్పుదురు.

76. పుత్రశోకాబ్ధిముంచి—పుత్రుల (చావువలని) దుఃఖమనెడి, సముద్రమున ముంచి.

77. రాజకీటంబు—రాచపురుగు అనఁగా, 'చచ్చురాజు'. రాజాధముఁడు. 'కీట'శబ్దము 'అల్పత్వ'మును బోధించును. వాడుకలో 'నీకంటెకేమి పురుగులాగున్నానా ఏమిటి'?

78. కొండ—'గొప్ప'యని తాత్పర్యము. 'గోరంతలు కొండంతలు సేయుట' అను సామెతలో చూడుము.

84. వంది—రాజసభలలో రాజులయొక్క గొప్పగుణములనుగూర్చి స్తోత్రములు చేయు నొకజాతి వారు 'వందులు'; 'భట్రాజులు' అనఁబడు వారి వంటివారు-వీరుచేయు స్తోత్రమును కైవారమందురు.

85 దంటమాటలు-నేరైనమాటలు.

తడవాటు వన్ని—తడవాటు+పన్ని - వెదకికూర్చి' యని తాత్పర్యము.

86. గెంటక—చలింపక.

88. ప్రోడ—ప్రౌఢుఁడు. 'ప్రౌఢ' శబ్దవికారము 'ప్రోడ'.

89. ఆడి పల్కితివి—'నొక్కి చెప్పితివి' అని తాత్పర్యము.

94. ముజ్జగములు—మూఁడు+జగములు; ఇట్లె ముల్లోకములు.

96. తడవిన—ప్రస్తావించిన.

98. రెండు వేలజిహ్వాల వాఁడు—ఆదిశేషుఁడు; ఈ పామునకు వేయిపడగలు గలవు; ఒక్కొక్కతలకు రెండునాలుకలుగనుక అన్నియు రెండు వేలనాలుకలగును. అన్ని నాలుకలతో స్తుతించినను అయోగ్యతను పూర్ణముగ స్తుతింప నలవికాదు.

100. ఇచటినుండి ఈతని ప్రసంగము ముగియు దాఁక భాషయొక్క బలమును గుర్తింపుము.

104. 108 ఇవి యన్నియు నసంభవములు—అట్లే?

113. 'రిత్త'—రిక్త(=వట్టి) అనుదాని వికారము.

114. ఊఁచముట్టుగ—నిశ్శేషముగ; పూర్తిగ.

125. సంయమి—తపోవంతుఁడు.

128. కమల+ఆప్త + కులుని = పద్మములకు + స్నేహితుఁడగు (సూర్యుని) +కులముగలవాని-సూర్యవంశమునఁ బుట్టినవాని—కమలములకు సూర్యుఁడును, కలువలకుఁజంద్రుఁడును మిత్రులని కవిసమయము.

130. అటమటి—తొందర, కలఁత, తొట్రుపాటు.

133. వేవురు—వేయిమంది.

వేవేల—(వాడుకలో) అనేకవేల; 'వేనవేల' అనియు నుండును.

137. ఈమూఁడును, త్రికరణములు; 'మనోవాక్కాయ కర్మము'లు.

145. ఉపవీత సూత్రంబు—జన్నిదము "జంధ్యము" అనివాడుకలో.

147. వపనము—క్షౌరము.

152. ఏవగింపఁగ—రోఁతపడ; 'హేయ'మని తలఁప.

159. క్రోధకాళికి—క్రోధమనెడి కాళికాదేవికి.

బారిగొఱియ—హింసార్థమైన గొఱ్ఱె; బలియిచ్చు గొఱ్ఱె.

162. సిద్ధ, చారణ—సిద్ధులు, చారణులు—వీరుదేవతలలో నొకజాతివారు.

165—167. ఈవర్ణనమును గుర్తింపుము—కన్నులకుఁ గట్టినట్లున్నది.

175. చంద్రకళామౌళి—చంద్రునియొక్క కళను మౌళియందు (శిరమందు) కలవాఁడు; శివుఁడు.

178—183 ఈయుత్పాతములను పరికింపుము, 104—108 పంక్తులలోని వానితో పోల్చి చూడుము.

180. వ్రక్క—'వ్రయ్యు' ధాతువునుండి; పగులు, ముక్క. 'వక్క' అని పోఁకచెక్కకు వాడుక.

181. కావిరి—నలుపు.

184—188. ఈవర్ణనమెంత కన్నులకుఁ గట్టునట్లున్నదో గుర్తింపుము.

184. కులిశంబు—వజ్రాయుధము.

185. పండె—'పాపము పండింది' అన్నట్లు.

186. కళాసములు—చర్మములు ; కృష్ణాజినము లన్నమాట.

188. నిజ + ఆశ్రమములు—తమ (యొక్క) + ఆశ్రమములు.

---

## 16. వసంతవర్ణనము.

ఈ ఋతువర్ణనములో ముఖ్యముగా సృష్టియందలి సౌందర్యమును గుర్తింపుము. ఇందు మన్మథసైన్యము వర్ణింపఁబడినది.

2. తియ్యనివిల్లు—చెఱుకు.

3. కంతుఁడు—మన్మథుఁడు. భార్యాభర్తల పరస్పరానురాగమునకు హేతువు మన్మథుఁడను నొక దేవుఁడనియు, ఆయన మహాపరాక్రమశాలి యనియు, లోకము నంతను జయించినవాఁడనియుఁ జెప్పుదురు. ఆతనివిల్లు చెఱుకుకఱ్ఱ; నారి తుమ్మెదలు; బాణములు లేఁజిగుళ్లు పువ్వులు; వాహనము చిలుక; ధ్వజమందు మకరముండును, మీన మని కొందరు ; వసంతుఁడు (అనఁగా వసంతఋతువు), చంద్రుఁడు స్నేహితులు; మందమారుతము, కోకిలలు, చందనము మొదలగునవి పరివారము; ఇట్టి సైన్యముతో ముల్లోకములను గెల్చినవాఁడని చెప్పుదురు.

ఉబ్బు—గర్వము.

5. ఱంతు—'కలకల' మని ధ్వని.

6. చెలువు + అగ్గలముగ—ఇంపు, మీఱునట్లు.

7. జక్కవలు—చక్రవాకములను పక్షులు - ఇవి పురాణములందును కావ్యములందును మిగులవర్ణింపఁబడినవి. వీని జోళ్లకు రాత్రు లందు విడుటయు (వియోగము, విరహము) ను, పగళ్లయందు కూటమియు (సంయోగము)ను కలుగునని చెప్పుదురు. 'చంద్రుఁడు మెఱుఁగెక్కుటయును ఈపక్షులు 'క్రాలుట' (అతిశయించి యుండుట) యును ఒకసమయమందుండవు. అయినను ఒకఋతువునందు భిన్న సమయములందుండవచ్చు.

ముద్దువగ—ముద్దులు కట్టునట్లు. వగ=విధము.

12. సోమరిగాలి—మందమారుతము. వాయువునకు మూడు ముఖ్యగుణములు వర్ణింపఁబడును—శైత్యము (చల్లదనము), మాంద్యము, సౌరభ్యము (పరిమళము.) ఇచట, రెండుమాత్రమే చెప్పఁబడినవి.
13. మధు—వసంత; ఇచట, చైత్ర.
15. భూరి—బంగారు.
17. సందు—అవకాశము.
నాకడఁగిన—నేఁగడఁగిన, నేను పూనిన.
19. తలము—తరము; శక్తి; తలముదప్పిన—అశక్యమయిన.
12. అక్షతలు—వాడుకలో 'అక్షింతలు'
23. అర్ఘ్యము—అర్ఘ' అనుశబ్దమునీఁద తద్ధిత. పూజార్థమైనది. గొప్పవారు గృహాస్థుల యిండ్లకుఁ బోయినప్పుడు ఎదురుగఁ దీసికొని రాఁబడును. పెరుఁగు, తేనె, నెయ్యి, అక్షతలు, దర్భ, నువ్వులు, గఱిక, పుష్పములు- వీనితోఁగూడినది.
35. గాధేయ—గాధిపుత్ర.
40. అభీష్టము—కోరినది.
47. ఒడుపు దప్పినయురగము—కఱచుటకు వీలుతప్పిన పాము.
45. మనుజ+ఈశ+తిలక—మనుష్యులకు, ప్రభువులలో, శ్రేష్ఠుఁడా. 'తిలక,' శబ్దము 'శ్రేష్ఠము' అనునర్థమున వాడఁబడినది. ఇట్లే 'సింహ' శార్దూల, నాగ మొ॥ ఈయర్థముగల మాటలన్నియు శ్రేష్ఠవాచకములు.
47. రత్న—శ్రేష్ఠారమందు. 'రత్న'మునకు మణియనియు, శ్రేష్ఠవస్తువనియు రెండర్థములు.
50. త్రిశంకుఁడు—హరిశ్చంద్రునితండ్రి,
51. చంద్ర—ఇదియును శ్రేష్ఠవాచకము.
52. మలఁకలతపసి—చిక్కులుపెట్టుతపస్వి.

# ఆనంద ముద్రణాలయము

## ముద్రిత గ్రంథములు.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఆనంద వాచకపుస్తకము | బాలశిక్ష | ... | ... | 0 | 2 | 0 |
| ,, | ,, మొదటితరగతి ... | | ... | 0 | 2 | 6 |
| ,, | ,, రెండవతరగతి .. | | . | 0 | 3 | 0 |
| ,, | ,, మూఁడవ తరగతి | | ... | 0 | 4 | 0 |
| ,, | ,, నాల్గవతరగతి | ... | ... | 0 | 5 | 0 |
| ,, | ,, ఐదవతరగతి | ... | ... | 0 | 5 | 0 |
| ,, | ,, ఆఱవతరగతి | ... | ... | 0 | 6 | 0 |
| ,, | ,, ఏడవ తరగతి ... | | ... | 0 | 7 | 0 |
| సుమతిశతకము—టీకాతాత్పర్యసహితము | | ... | ... | 0 | 2 | 6 |
| కుమారీశతకము. | డిటో | ... | ... | 0 | 2 | 0 |
| భాస్కరశతకము | డిటో | . | .. | 0 | 4 | 0 |
| దాశరథిశతకము. | డిటో | ... | .. | 0 | 4 | 0 |
| అంబరీషోపాఖ్యానము. | డిటో | ... | ... | 0 | 2 | 0 |
| ధ్రువోపాఖ్యానము. | డిటో | ... | . | 0 | 4 | 0 |
| కుచేలోపాఖ్యానము | డిటో | ... | ... | 0 | 3 | 0 |
| నలోపాఖ్యానము | డిటో | .. | .. | 0 | 5 | 0 |
| నీతిచంద్రిక—పరవస్తు చిన్నయ్యసూరికృతము ... | | | ... | 0 | 6 | 0 |
| ధైర్యకవచము | ... | ... | . | 0 | 6 | 0 |
| నృసింహశతకము | ... | ... | ... | 0 | 2 | 0 |
| కమలిని ... | .. | . | ... | 1 | 0 | 0 |
| ఇందిర.—క్రొత్తనవల ... | ... | ... | ... | 0 | 8 | 0 |
| కల్యాణి.—అతిసుందరమైన కథ ... | | ... | ... | 0 | 1 | 0 |
| సుశీల.—నవల | ... | ... | ... | 0 | 1 | 6 |
| మల్లిక | ... | ... | ... | 0 | 2 | 0 |
| ప్రతీతుఁడు. | ... | ... | .. | 0 | 3 | 0 |
| పరమానందయ్య కథలు. | ... | ... | ... | 0 | 2 | 0 |

ఆర్. వేంకటేశ్వర్ అన్డ్ కంపెని,
లోకాసేశ్వర్, మద్రాస్.